చదవండి... చదివించండి... 1952
విశాలాంధ్ర
జాతీయ తెలుగు దినపత్రిక
చందా వివరాలు
సంవత్సరం చందా రూ. 1300/-లు
అర్ధ సంవత్సరం చందా రూ. 650/-లు
3 నెలల చందా రూ. 325/-లు
విడి పత్రిక రూ. 4/-లు
ఆదివారం రూ. 5/-లు
వివరములకు సంప్రదించండి 7995009615

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం
sricharanamedia.com

సంపుటి : 68 సంచిక : 190 | బుధవారం 02-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



కొలువు దీరిన హైకోర్టు

- సీఎం క్యాంపు ఆఫీసులో తాత్కాలికంగా ప్రారంభం
- చీఫ్ జస్టిస్‌తో సహా 14 మంది జడ్జిలు ప్రమాణ స్వీకారం
- హైదరాబాద్ నుండి పెద్దఎత్తున తరలివచ్చిన న్యాయవాదులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొలువుదీరింది. విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో తాత్కాలికంగా మంగళవారం హైకోర్టు ప్రారంభమైంది. తొలి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో - మిగతా 2 లో



ఇదో చారిత్రక ఘట్టం

- సీఎం చంద్రబాబు
- న్యాయ వ్యవస్థ గౌరవం పెంపొందించాలి : సుప్రీం జస్టిస్ రమణ
- కొత్త చరిత్ర మొదలైంది : చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్

3లో




కేరళలో ఉమెన్ వాల్ (మహా మానవహారం) కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

'ఉమెన్ వాల్' సక్సెస్

- లింగవివక్ష...మనువాదంపై మహిళల ఫైర్
- 14 జిల్లాల్లో మానవహారం : లక్షలాదిగా కదిలిన నారీ మణులు
- వామపక్ష నేతల హాజరు : సామాజిక, రాజకీయ సంఘాల మద్దతు

లింగ వివక్షకు.. మనువాద ఛాందసాన్ని నిరసిస్తూ కేరళ నారీ భేరీ మోగించింది. ఒకటా రెండా 14 జిల్లాల్లో 620 కిలోమీటర్ల మేర మహా మానవహారాన్ని నిర్మించారు. లింగ సమానత్వం, పునరుజ్జీవన విలువలపై ప్రతిన బూనారు. యువతులు, ఉద్యోగులు, టీచర్లు, అధ్యాపకులు... శ్రామికులు ఇలా అన్ని వర్గాల నుంచి మహిళలు కదం తొక్కారు. ఉత్తర కేరళలోని కాసర్‌గాడ్ నుంచి దక్షిణాన తిరువనంతపురం వరకూ మానవహారాన్ని నిర్మించి చరిత్ర సృష్టించారు. లక్షలాది మంది మహిళలు ఈ క్రతువులో భాగస్వాములయ్యారు. మరో వైపు ఆర్ఎస్ఎస్ మూకలు కిష్కంధకాండ సృష్టించటానికి యత్నించినా... మహిళలు ఎక్కడా వెనుకడుగు వేయలేదు. 11లో



'కోరేగావ్' వీరులకు జన నివాళి

- కట్టుదిట్ట భద్రత
- ప్రకాష్ అంబేద్కర్ హాజరు

2లో



జీఎస్టీ ధమాల్...!

డిసెంబరులో రూ.94,726 కోట్లే వసూలు

న్యూఢిల్లీ : వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు 2018, డిసెంబరులో రూ.94,726 కోట్లకు పడిపోయాయి. అంతకు మునుపటి నెలలో రూ.97,637 కోట్లు వసూలయ్యాయి. అయితే 77.44 లక్షలు వద్ద డిసెంబరులో జీఎస్‌టీఆర్-3బీ దాఖలు లేదా మొత్తం అమ్మకాల రిటర్న్‌ల సంఖ్య ఆ నెలలో మెరుగయ్యింది. అదే నవంబరులో 69.6 లక్షలు దాఖలయ్యాయి. కేంద్ర జీఎస్‌టీ(సీజీఎస్‌టీ) వసూలు రూ.16,442 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ(ఎస్‌జీఎస్‌టీ) రూ.22,459 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ(ఐజీఎస్‌టీ) రూ.47,936 కోట్లు, సెస్ రూ.7,888 కోట్లుగా మొత్తం రూ.94,726 కోట్లు వసూలైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఐజీఎస్‌టీ సాధారణ పరిష్కారం నుంచి ఎస్‌జీఎస్‌టీకి రూ.14,793 కోట్లు, - మిగతా 2 లో



ఎన్‌కౌంటర్ నిందితులకు

పదోన్నతులు

- బెయిల్‌పై ఉన్న డీఐజీకి ఐజీగా పదోన్నతి
- సోహ్రాబుద్దిన్ ఎన్‌కౌంటర్ నిందితుడికి కూడా..
- గుజరాత్ ప్రభుత్వ రూటే సెపరేటు
- సీబీఐ ప్రతిష్టను మంటగల్పింది ఇక్కడి అధికారులే

అహ్మదాబాద్ (గుజరాత్) : దేశంలోనే గుజరాత్ రూటే సెపరేటుగా ఉంటోంది. ఆరోపణలు ఎదుర్కొనే వారిని అందలం ఎక్కించటం ఆ రాష్ట్రానికే చెల్లుబాటవుతుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రతిష్ట మంటగలవటంలో గుజరాత్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారులదే కీలకపాత్ర. అలాంటి రాష్ట్రంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు ఉన్నతాధికారులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించటం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. అందులోనూ రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లతో నిందితులు, గోద్రా అల్లర్ల కేసులో సిట్ విచారణను ఎదుర్కొన్న ముగ్గురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసులకు (డీఐజీ) ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) పదోన్నతి కల్పిస్తూ గుజరాత్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇష్రాత్ జహన్ ఎన్‌కౌంటర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొనటంతోపాటు ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్న ఐపీఎస్ అధికారి జీఎల్ సింఘాల్‌కు ఐజీగా పదోన్నతి లభించింది. 2001 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన సింఘాల్ 2004లో జరిగిన ఇష్రాత్ జహన్ ఎన్‌కౌంటర్ కీలక నిందితుడు. ఈ కేసు విచారణను చేపట్టిన సీబీఐ సింఘాల్‌ను 2013లో అరెస్టు చేసింది. ప్రధాన నిందితుడుగా ఉన్న సింఘాల్‌పై 2014 మేలోగా చార్జిషీటును దాఖలు చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ విషయంలో సీబీఐ వైఫల్యం చెందింది. దీంతో బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన్ని గుజరాత్ ప్రభుత్వం డీఐజీ పదోన్నతి కల్పించి మరీ పోలీసు శాఖలో పునర్నియమించింది. ఈ కేసులో అప్పటి హోం శాఖ మంత్రి, నేటి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా సహకారంతో సీబీఐకి తప్పుడు ఆధారాలిచ్చి సింఘాల్ కేసు నుంచి బయటపడ్డారు. అలాంటి అధికారికి ఐజీ పదోన్నతి కల్పించటం గమనార్హం. దేశంలో మరో సంచలన ఎన్‌కౌంటర్ సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో డీఐజీ విపుల్ అగర్వాల్‌కు ఐజీగా పదోన్నతి కల్పించి అహ్మదాబాద్ అదనపు పోలీసు కమిషనర్ (అడ్మినిస్ట్రేషన్)గా గుజరాత్ ప్రభుత్వం నియమించింది. ముంబైలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఐపీఎస్ అధికారి అగర్వాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. ఇక 2002 నాటి గోద్రా అల్లర్ల కేసులో సుప్రీంకోర్టు నియమించిన సిట్ విచారణను ఎదుర్కొన్న జేఆర్ మొతాలియాను అహ్మదాబాద్ అదనపు కమిషనర్ (ట్రాఫిక్)గా పదోన్నతి కల్పించటం గమనార్హం.

గాంధీజీ గొప్ప రచయిత

- మహాత్ముడు ప్రత్యేక అభిరుచి కలిగిన పబ్లిషర్
- విజయవాడతో గాంధీకి ప్రత్యేక అనుబంధం
- ప్రముఖ సాహితీవేత్తలను, సాహిత్యాన్ని అందించిన ఘనత బెజవాడ సొంతం
- ప్రఖ్యాత చరిత్రకారుడు, గాంధీజీ మనవడు రాజమోహన్ గాంధీ
- విజయవాడ 30వ పుస్తక మహోత్సవం ప్రారంభం



సభలో ప్రసంగిస్తున్న రాజమోహన్‌గాంధీ, వేదికపై కొలకలూరి, బుద్ధప్రసాద్ తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ : మహాత్మా గాంధీ సహజంగా అందరూ రాజకీయ నాయకుడిగా, రోజూ రాట్నంతో నూలువడికే వ్యక్తిగా, జాతిపితగా భావిస్తారని, వాస్తవానికి ఆయన గొప్ప రచయిత, జర్నలిస్టు, ప్రత్యేక అభిరుచి కలిగిన పబ్లిషర్ అని మహాత్ముని మనవడు, ప్రఖ్యాత చరిత్రకారుడు ఆచార్య రాజమోహన్ గాంధీ చెప్పారు. స్థానిక స్వరాజ్య మైదానం('నవభారత్' ప్రకాశరావు ప్రాంగణం)లోని యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వేదికపై 30వ విజయవాడ పుస్తక మహోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ భాషా, సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన జనవరి 11వ తేదీ వరకు నిర్వహించే ఈ పుస్తక మహోత్సవాన్ని ఆచార్య రాజమోహన్‌గాంధీ, ఆయన సతీమణి ఉషా రాజమోహన్ గాంధీ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆచార్య రాజమోహన్‌గాంధీ మాట్లాడుతూ మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చిన తర్వాత ప్రతి రోజూ ఆర్టికల్స్ రాసేవారని తెలిపారు. దక్షిణాఫ్రికాలో భారతీయులు, ఇతర ప్రాంతాల వారు ఎదుర్కొంటున్న వివక్ష గురించి, మన దేశంలో స్వాతంత్ర్య పోరాటం ఆవశ్యకత గురించి నిత్యం స్ఫూర్తిని పెంపొందించేలా కథనాలు రాసేవారని, వాటిని యంగ్ ఇండియా, హరిజన్ పత్రికల్లో ప్రచురించేవారని చెప్పారు. మహాత్ముడు ప్రత్యేక అభిరుచి కలిగిన పబ్లిషర్ అని, నవజీవన్ పబ్లిషింగ్ సంస్థ ద్వారా పలు పుస్తకాలు, పత్రికలను ప్రచురించారని గుర్తుచేశారు. గాంధీజీకి విజయవాడతో ప్రత్యేక అనుబంధం ఉందని, ఆయన 1921లో ఇక్కడికి వచ్చారని తెలిపారు. జ్ఞానానికి, సమాచారానికి చాలా తేడా ఉందని, జ్ఞానం ఆలోచనను, వివేకాన్ని, నిర్ణయాలను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఎందరో ప్రముఖ సాహితీవేత్తలను, సాహిత్యాన్ని అందించిన గొప్ప సాంస్కృతిక చరిత్ర కలిగిన విజయవాడలో - మిగతా 2 లో

ఇదీ లోకం!





లంబసింగిలో 'జీరో' డిగ్రీలు

- తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న చలి
- విశాఖ మన్యంలో మంచు జల్లులు
- తెలంగాణలో ఐదురోజులపాటు రెడ్ అలెర్ట్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖ సిటీ : తెలుగు రాష్ట్రాల్లో చలి వణికిస్తోంది. మధ్యాహ్నం వరకు శీతల గాలులు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. రెండు రాష్ట్రాల్లోని ఏజెన్సీలలో అత్యల్ప ఉష్ణోగ్రతలు - మిగతా 2 లో

అస్మదీయులకే విలాసాలు..!

- రాజధానిలో విపక్షాలకు నో బంగళా
- ఏడుగురు సీఎంలకే కేటాయింపు
- ఢిల్లీలో కేంద్రం వివక్ష



న్యూఢిల్లీ : పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అధికారిక పర్యటనలో భాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీ వెళ్లినపుడు సాధారణంగా ఆయా రాష్ట్రాల భవన్‌లోనే బస చేయాల్సి ఉంది. సీఎంల భద్రత, ఇతర వ్యక్తిగత అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బంగళాలను కేటాయిస్తుంది. మొత్తం 29 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాల సీఎంలకుగానూ, కేవలం ఏడుగురికే ఢిల్లీలో నివాస బంగళాలు ఉండటం గమనార్హం. ఇవన్నీ మోడీ ప్రధాని అయిన తర్వాత కేటాయించినవే. చివరకు ఎనిమిది నెలల క్రితం త్రిపుర సీఎంగా ఎన్నికైన బిప్లవ్ కుమార్‌కు సైతం 6 తల్కాతోర రోడ్డులో మోడీ ప్రభుత్వం నివాస బంగళాను కేటాయించింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఒక్కరంటే ఒక్కరికి కూడా బంగళాల కేటాయింపు జరగలేదు. కాగా, విపక్ష సీఎంలు ఎవరూ నివాస బంగళా కోసం దరఖాస్తు చేసుకోలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పేర్కొనటం గమనార్హం. బంగళాల - మిగతా 11 లో

క్యూబాకి జిన్‌పింగ్ అభినందనలు



బీజింగ్ : క్యూబా విప్లవం 60వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని చైనా కమ్యూనిస్టు పార్టీ తరపున ఆదేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ క్యూబానేతలకు అభినందన సందేశాన్ని పంపారు. క్యూబా మాజీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కార్యదర్శి రాల్‌కాస్ట్రో, దేశాధ్యక్షుడు మిగుల్‌డియాజ్‌కనెల్, మంత్రివర్గ సభ్యులకు తన సందేశంలో విప్లవాభినందనలు తెలియజేశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం పాలనలో 60 ఏళ్లకాలంలో క్యూబా, ఆదేశ ప్రజలు కఠోరమైన శ్రమద్వారా గొప్ప విజయాలను సాధించారని ప్రశంసించారు. సోషలిస్టు సమాజ నిర్మాణంవల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని జిన్‌పింగ్ తన సందేశంలో పేర్కొన్నారు. విజయాలు సాధించిన ప్రభుత్వాన్ని, ప్రజలను చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం, ప్రజలు అభినందించారు. అంతర్జాతీయంగా ఎన్ని అవాంతరాలు, ఒడిదుడుకులు ఎదురయినప్పటికీ చైనా, క్యూబా మధ్య స్నేహసంబంధాలు పురోగమించాయని, ఇది ఎంతో ప్రాముఖ్యతగల అంశమని ఆయన చెప్పారు. రాల్‌కాస్ట్రోతోనూ, అధ్యక్షుడు కనెల్‌తోనూ మంచి ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించి దేశాన్ని పురోగమింపజేయగలరన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. నెలరోజుల క్రితం కనెల్ చైనాలో చరిత్రాత్మక పర్యటన జరిపారని ఆయన నాయకత్వంలో ద్వైపాక్షిక సంబంధాలు నూతనశకంలోకి ప్రవేశిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. క్యూబా సాధించిన విజయాలు మరింతగా విస్తరించి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని జిన్‌పింగ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎల్లవేళలా రెండు దేశాలు పరస్పరం అర్థం చేసుకుని ద్వైపాక్షిక సంబంధాలలోను, అంతర్జాతీయ అంశాలలోను ఒకరికొకరు సహకరించుకున్నాయని తెలిపారు.

హామీలు ఉల్లంఘిస్తే మరోదారి తప్పదు

అమెరికాను హెచ్చరించిన ఉత్తరకొరియా

ప్యాంగ్‌యాంగ్ : అమెరికా తాను ఇచ్చిన వాగ్దానాలను ఉల్లంఘించడం కొనసాగిస్తున్నదని ఇలా జరిగితే తాము మరో దారి చూసుకోవడం తప్పదని ఉత్తరకొరియా ఆదేశాన్ని హెచ్చరించింది. కొత్త సంవత్సరం సందర్భంగా ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్ మాట్లాడుతూ 2019లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌తో అణ్వాయుధాల అంశంపై మరో శిఖరాగ్ర సమావేశం జరిగి పరిష్కారం లభించగలదన్న ఆశాభావంతో ఉన్నామని పేర్కొన్నారు. ఆంక్షలు, ఒత్తిళ్ల ద్వారా తమ సహనాన్ని పరీక్షించవద్దని అమెరికాను ఆయన హెచ్చరించారు. కిమ్ కొత్త సంవత్సరం ప్రసంగాన్ని టెలివిజన్‌లు ప్రసారం చేశాయి. ట్రంప్‌తో ఎప్పుడైనా మాట్లాడి తగిన ఫలితం సాధించేందుకు సిద్ధంగానే ఉన్నానని కిమ్ వెల్లడించారు. ఈ అంశాన్ని అంతర్జాతీయ సమాజం స్వాగతించింది. ఏకపక్షంగా కొన్ని డిమాండ్లను సాధించేందుకు తమపై ఆంక్షలు, ఒత్తిళ్లు కొనసాగించి ప్రజల ఓర్పును పరీక్షిస్తున్నారని, ఇది తప్పుగా అంచనా వేయడమే అవుతుందని కిమ్



పేర్కొన్నారు. దక్షిణకొరియాతో కలిసి అమెరికా తలపెట్టిన సంయుక్త సైనిక విన్యాసాలను నిలిపివేయడం కొనసాగించాలని కిమ్ కోరారు. దక్షిణకొరియాలో వ్యూహాత్మక సైనిక ఆయుధాలను, సైన్యాన్ని నిలపవద్దని కిమ్ కోరారు. రెండు కొరియాల మధ్య బలమైన సహకారాన్ని పెంపొందించుకోవాలని దేశ ప్రజలనుద్దేశించి కిమ్ పిలుపునిచ్చారు. ఉత్తరకొరియా సరిహద్దులలోని కయిసాంగ్ నగరంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫ్యాక్టరీని తిరిగి పనిచేయించడానికి తాను సిద్ధంగానే ఉన్నానని, అలాగే ఉత్తరకొరియా డైమండ్ పర్వతం రిసార్టును దక్షిణకొరియా యాత్రికులు సందర్శించేందుకు అనుమతిస్తామని కిమ్ చెప్పారు. అమెరికా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడంతో పాటు తదుపరి కార్యాచరణను చేపట్టినట్లయితే రెండు దేశాల మధ్య సంబంధాలు వేగవంతంగా, అద్భుతంగా ఏర్పడి కొనసాగుతాయని, తప్పనిసరిగా మంచి ఫలితాలు వస్తాయని కిమ్ అన్నారు. తాము తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పులూ ఉండబోవని ఆయన చెప్పారు. సింగపూర్‌లో జరిగిన శిఖరాగ్రసమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమెరికా అమలుచేసినట్లయితే తాము కూడా ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని కిమ్ చెప్పారు.

మరికొన్ని రాయితీలకోసం థెరిసా చర్చలు

లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుండి వైదొలగేందుకు కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందాన్ని సొంత పార్టీ నాయకులతో సహా ప్రతిపక్ష నాయకులు, పార్లమెంటు సభ్యులు ప్రధానమంత్రి థెరిసామె మధ్యవర్తిత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈనేపథ్యంలో క్రిస్మస్ సెలవల అనంతరం ఈయూ నాయకులతో చర్చలు జరిపి మరికొన్ని సానుకూలమైన రాయితీల కోసం థెరిసా ప్రయత్నిస్తున్నారు. ఈనెల మధ్యకాలంలోనే బ్రెగ్జిట్ ఒప్పందాన్ని పార్లమెంటు ఆమోదించే అవకాశాలున్నాయని థెరిసా ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఒప్పందం వ్యవహారంలో ప్రతిష్టంభన ఏర్పడినందున చర్చలను పునరుద్ధరించేందుకు థెరిసా ఈయూ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో వారం రోజుల్లో పురోగతి ఉంటుందని ప్రధానమంత్రి ప్రతినిధి తెలిపారు. అయితే ఏఏ అంశాలలో సానుకూల అభిప్రాయం రావచ్చునన్న జాబితా తనవద్దలేదని ఈయూ నాయకులతో థెరిసా సంప్రదిస్తున్నారని, పార్లమెంటులో ఓటింగ్ జరిగేవరకు ఈ చర్చలు కొనసాగుతూనే ఉంటాయని ప్రధాని ప్రతినిధి వెల్లడించారు. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని ఆమోదింపజేసుకునేందుకు ప్రధాని ఎంపీలను ఒప్పించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. పాలక కన్సర్వేటివ్ పార్టీతో సహా అన్ని రాజకీయ పక్షాలు బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నాయి. మార్చి 29లోపు ఈయూ నుండి బ్రిటన్ పూర్తిగా వైదొలగవలసి ఉంటుంది. ఒప్పందంలోని అంశాలు



పూర్తిగా అమలుకావడానికి పరివర్తన దశ బహుశ రెండు సంవత్సరాలు ఉండవచ్చు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జీన్‌క్లాడ్‌జంకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రితో చర్చలు మరింత లోతుగా జరిపే అవకాశం ఉంటుందన్నారు. బ్రిటన్ రాజకీయ పార్టీలన్నీ కలిసి పనిచేయాలని వారి స్పందన పూర్తి అసహేతుకంగా ఉన్నదని వ్యాఖ్యానించారు.

బ్రిటన్ ప్రథమ మహిళా ఎంపి మార్కివిజ్

లండన్ : బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన మొదటి మహిళ కొన్నిమార్కివిజ్‌కు లేబర్ పార్టీ నాయకుడు జెరిమికార్బిన్ ఘనంగా నివాళి అర్పించారు. ఆమె పార్లమెంటుకు ఎన్నికై వందేళ్లు గడచిన సందర్భంగా శతవార్షికోత్స వాన్ని నిర్వహించారు. ఆమె సిన్‌ఫెన్ ఎంపీగా పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎన్నికైన తరువాత ఆమె పార్లమెంటుకు హాజరుకాలేదు. బ్రిటన్ రాణికి విధేయురాలిగా ఉంటానని పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేయడానికి తిరస్కరించడం ద్వారా ఆమె పార్లమెంటు సమావేశాలలో పాల్గొనలేదు. ఆమె ఎన్నికై వందేళ్లు అయిన సందర్భంగా లండన్ ఉత్తరప్రాంతంలోని హోలివే జైలులో వేడుకలు జరుపుకున్నారు. ఈ జైలులో ఆమెను ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్గొన్నారనే ఆరోపణలపై నిర్బంధించారు. కార్బిన్ తన సందేశంలో కొన్నిమార్కివిజ్ ఐర్లాండ్ మహిళలకు మార్గదర్శిగా ఉన్నారని ప్రశంసించారు. ఆ రోజుల్లో మహిళా హక్కులకోసం పోరాడిన వారిని మీడియా ఎగతాళి చేసిందని ఆ తరువాత అదే మీడియా ప్రజల మద్దతు కోల్పోయిందని కార్బిన్ తన సందేశంలో పేర్కొన్నారు. బ్రిటన్‌లో స్త్రీ, పురుషుల మధ్య వివక్షకు అంతం పలకాలని ఆయన కోరారు. మహిళల్లో పేదరికం, నివసించేందుకు ఇళ్లుకూడా లేని పరిస్థితిని కల్పించిన ఆర్థిక వ్యూహాన్ని మార్చుకోవాలని ఆయన సూచించారు.

అమెరికా, చైనా దౌత్య సహకారం



బీజింగ్ : రెండుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం అంశాన్ని పక్కనపెట్టి చైనా, అమెరికాలు దౌత్యసంబంధాలలో పరస్పరం సహకరించు కోవాలని నిర్ణయించాయి. రెండు దేశాల మధ్య ఏర్పడిన దౌత్య సంబంధాల 40వ వార్షికోత్సవం సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పినట్టు మీడియా తెలిపింది. 2018లో అమెరికా, చైనా మధ్య తీవ్రమైన వాణిజ్య విభేదాలు ఏర్పడ్డాయి. దిగుమతి చేసుకునే చైనా వస్తువులపైన సుంకాల పెంపును ప్రస్తుతానికి నిలిపి వేస్తున్నట్టు రెండురోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన తాము సాధించిన పెద్ద విజయమే అని జిన్‌పింగ్ చెప్పారు. సహకారం, సమన్వయం, సుస్థిరతకోసం రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లవలసిన అవసరంవుందని జిన్‌పింగ్ మంగళవారం పంపిన సందేశంలో తెలియజేశారు. 40 ఏళ్లుగా రెండు దేశాల మధ్య కొనసాగుతున్న గట్టి స్నేహసంబంధాలను ట్రంప్ ప్రశంసించినట్లు జిన్హువా వార్తాసంస్థ తెలిపింది. ముందుగా ట్రంప్ చైనా వస్తువుల దిగుమతిపైన సుంకాలను పెంచగా ఆ తరువాత చైనా కూడా అమెరికా వస్తువులపైన సుంకాలను పెంచి దీటుగా సమాధానం చెప్పింది. ఈనేపథ్యంలో రెండు దేశాల మధ్య చోటుచేసుకున్న వాణిజ్యయుద్ధం ప్రపంచంలోని అనేకదేశాల మార్కెట్లపైన, ఆర్థిక వ్యవస్థలపైన తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించింది. రెండు దేశాల మధ్య వాణిజ్యం న్యాయవిరుద్ధంగా ఉన్నదని ట్రంప్ ఆరోపిస్తూ టారిఫ్‌లను చైనా, యూరోపియన్ యూనియన్, జపాన్ తదితర దేశాల వస్తువులపైన పెంచడం ద్వారా వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. ఇది సరైన పంథాకాదని ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్లుటిఒ) సూచించినప్పటికీ ట్రంప్ తన మొండివైఖరిని విడనాడలేదు.

టోక్యో కారు ప్రమాదంలో 9మందికి గాయాలు

టోక్యో : నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా టోక్యో నగరంలో జనసమూహంపైన కారు దూసుకువెళ్లడంతో 9మంది గాయపడ్డారు. వీరిలో ఒకరు స్పృహ తప్పిపడిపోయారు. అద్దెకారును నడుపుతున్న 21 ఏళ్ల కుసకబి అనే యువకుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. హత్యానేరంకింద అతనిని అరెస్టు చేశారు. ఒసాక లైసెన్సు ప్లేటుతో ఉన్నకారును ఆ యువకుడు నడిపాడు. తాను చేసిన పనికి పశ్చాత్తాపం చెందడంలేదని జపాన్‌లో ఉరితీతకు వ్యతిరేకంగా ఈ టెర్రరిస్టు చర్యకు పూనుకున్నానని చెప్పినట్టు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఒసాకానుండి కారులో తాను ఇక్కడికి చేరుకున్నానని



పాదచారులను చంపివేసేందుకే కారును వారిపైకి తీసుకువెళ్లానని ఆ యువకుడు చెప్పాడు. ప్రమాదం జరిగిన తరువాత డ్రైవర్‌స్థానంలోవున్న కుసకబి ఆ ప్రాంతంనుంచి తప్పించుకుని వెళ్లిపోయాడు.

జీఎస్టీ ధమాల్...!

(మొదటిపేజీ తరువాయి)

సీజీఎస్‌టీకి రూ.18,409 కోట్లను ప్రభుత్వం పరిష్కరించినట్లు పేర్కొంది. డిసెంబరులో సాధారణ పరిష్కారం తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్జించిన మొత్తం ఆదాయం సీజీఎస్‌టీ రూ.43,851 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ.46,252 కోట్లుగా ఉందని మంత్రిత్వ శాఖ వివరించింది. నవంబరులో నిర్వహించిన కొనుగోళ్లు, అమ్మకాల కార్యకలాపాలు డిసెంబరు ఆదాయ వసూలును ప్రతిబింబిస్తాయి. ప్రభుత్వానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో(ఏప్రిల్ నుంచి డిసెంబరు) వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) నుంచి రూ.8.71 కోట్లకుపైగా ఆదాయం పెరిగింది. ఇక వార్షిక జీఎస్‌టీ వసూళ్లు రూ.13.48 లక్షల కోట్లుగా ఉంటుందని 2018-19 బడ్జెట్ అంచనా వేసింది. అంటే నెలవారీ ఆదాయ లక్ష్యం రూ.1.12 లక్షల కోట్లు. గత ఆర్థిక సంవత్సరం(జూలై 17 నుంచి మార్చి 2018)లో నెలవారీ సగటు జీఎస్‌టీ వసూలు రూ.89,885 కోట్లుగా ఉంది. ఇదిలాఉండగా, 2019, జనవరి 1వ తేదీ నుంచి 23 ఉత్పత్తులపై రేట్లను జీఎస్‌టీ కౌన్సిల్ తగ్గించిన నేపథ్యంలో రానున్న నెలల్లో జీఎస్‌టీ ఆదాయంపై మరింత ఒత్తిడి ఉంటుంది. ఇటీవల తగ్గించిన రేట్లతో 28 శాతం అత్యధిక పన్ను స్లాబులో కేవలం 28 ఉత్పత్తులు మాత్రమే ఉన్నాయి. రేటు తగ్గింపు ఫలితంగా వార్షిక ఆదాయం సూత్రప్రాయంగా రూ.5,500 కోట్లు ఉంటుంది. అంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మిగిలిన మూడు నెలలు(జనవరి నుంచి మార్చి)లో ఆదాయ నష్టం దాదాపు రూ.1,375 కోట్లు.

జీఎస్‌టీ ఆదాయాల స్థిరీకరణ కనిపిస్తుంది. ఈ ఏడాదిలో మేము దక్షిణాన రేట్లు కలిగి ఉన్నాం. అందువల్ల ఉత్తరానికి రావాల్సిన ఆదాయం కష్టంగా ఉంటుంది' అని డెలాయిట్ ఇండియా భాగస్వామి ఎం.ఎస్.మణి తెలిపారు. పీడబ్ల్యూసీ జాతీయ పరోక్ష పన్ను నాయకుడు ప్రతీక్ జైన్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో జీఎస్‌టీ వసూళ్లు ఇదే విధంగా ఉంటాయన్నారు. మరింత అమలు, విచారణ కేసులు ఉండవచ్చని తెలిపారు.

'వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త వర్తింపు కార్యాచరణ ప్రణాళిక వచ్చినప్పుడు వచ్చే ఏడాదికి జీఎస్‌టీ వసూళ్లకు వాస్తవిక అంచనాను ప్రభుత్వం కోరుకోవచ్చు. వ్యాపారాలను ఇన్‌పుట్ క్రెడిట్ ద్వారా పేర్కొనప్పుడు సేకరణలు మెరుగుపడగలవు. ఫలితంగా వసూళ్లు తిరిగి మెరుగుపడతాయి' అని జైన్ వివరించారు. జీఎస్‌టీ వసూళ్లు ఏప్రిల్‌లో రూ.1.03 లక్షల కోట్లు, మే నెలలో రూ.94,016 కోట్లు, జూన్‌లో రూ.95,610 కోట్లు, జూలైలో రూ.96,483 కోట్లు, ఆగస్టులో రూ.93,960 కోట్లు, సెప్టెంబరులో రూ.94,442 కోట్లు, అక్టోబరులో రూ.1,00,710 కోట్లు, నవంబరులో రూ.97,637 కోట్లుగా ఉన్నాయి. ఈవై ట్యాక్స్ భాగస్వామి అభిషేక్ జైన్ మాట్లాడుతూ గత రెండు నెలలతో పోల్చితే జీఎస్‌టీ ఆదాయం వసూళ్లలో తగ్గుదల చిన్నపాటి నిరుత్సాహమేనని తెలిపారు. 'స్వల్పకాలిక ఆటో విడిభాగాలు, సిమెంటు వంటి 28 శాతం పన్ను కేటగిరిలో మిగిలి ఉన్న వస్తువుల పన్ను రేటును హేతుబద్ధీకరించకుండా ప్రభుత్వం నిరుత్సాహపరచవచ్చు' అని ఆయన పేర్కొన్నారు.

లంబసింగిలో 'జీరో' డిగ్రీలు

(మొదటిపేజీ తరువాయి)

నమోదవుతున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల్లోనూ భారత వాతావరణశాఖ (ఐఎండీ) రెడ్ అలర్ట్‌ను ప్రకటించింది. చలి విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఏజెన్సీతోపాటు పలు ప్రాంతాలలో పొగమంచు వల్ల రోడ్లపై రాకపోకలు సాగించే వాహనాలు కనిపించటంలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ మన్యంలో మంచు జల్లులు కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు జీరో డిగ్రీల సెల్సియస్‌కు చేరాయి. రాష్ట్రంలో అత్యంత శీతల ప్రాంతమైన లంబసింగిలో మంగళవారం జీరో డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంది. మన్యాన్ని మంచు కమ్మేస్తుండటంతో అతి సమీప వ్యక్తులు కూడా కనిపించని స్థితి ఉంది. గడిచిన 24 గంటల్లో లంబసింగిలో జీరో డిగ్రీలు, చింతపల్లిలో 1.5 డిగ్రీలుగా ఉంది. గత పదేళ్లలో చింతపల్లిలో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతలు కావడం విశేషం. మినుములూరులో 3 డిగ్రీలు, పాడేరులో 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. 2010 సంవత్సరంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకాగా, మళ్లీ ఇప్పుడు చలి పులి పంజా విసిరింది. వణికిస్తున్న చలిలో ఏజెన్సీలోని పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విపరీతమైన పొగమంచు కారణంగా సూర్యుడు ఉదయం 11 గంటల తర్వాతే కనిపిస్తున్నాడు. ఉదయం బారెడు పొద్దెక్కినా చలి తీవ్రత తగ్గడం లేదు. పొగమంచు వీడడం లేదు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. జి మాడుగుల, హుకుంపేట్ లోయల్లో మంచు జల్లులు కురుస్తున్నాయి. జి మాడగులలో పార్కింగ్ చేసిన వాహనాలపై మంచు గడ్డలు కట్టాయి. మిట్ట మధ్యాహ్నం కూడా చలిగాలల ప్రభావంతో ప్రజలు గజగజలాడుతున్నారు. ఉదయం పూట పనులకు వెళ్లే కూలీలు, విధులకు బయలుదేరే ఉద్యోగులు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు చలితో సతమతమవు తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. వివిధ జిల్లాల్లో సాధారణం కంటే 4, 5 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పొగమంచు తీవ్రతకు రోడ్లు కనిపించక వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల వరకూ వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. మరో రెండు రోజులపాటు అతి శీతల వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది. చలి గాలుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5 డిగ్రీలకు పడిపోయింది. భద్రాచలంలో 13 డిగ్రీలు, హకీంపేట్‌లో 11 డిగ్రీలు, హన్మకొండ, హైదరాబాద్‌ల్లో 9 డిగ్రీలు, ఖమ్మంలో 13 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 14 డిగ్రీలు, మెదక్‌లో 6 డిగ్రీలు, నిజామాబాద్‌లో 10 డిగ్రీలు, రామగుండంలో 9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

గాంధీజీ గొప్ప రచయిత

(మొదటిపేజీ తరువాయి)

తాను రచించిన 'మోడరన్ సౌత్ ఇండియన్ హిస్టరీ' పుస్తకాన్ని ప్రతిష్టాత్మక 30వ బుక్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పుస్తకంలో 17, 18, 19, 20వ శతాబ్దాల దక్షిణ భారతదేశ చరిత్రను తాను పరిశోధన చేసి, మిత్రులు, పలువురు ప్రముఖుల ద్వారా సేకరించిన చరిత్ర, సంస్కృతి, ప్రజల జీవనవిధానాలు, ఇతర ముఖ్య విషయాలను పొందుపరిచానని వివరించారు. ఈ పుస్తకం చదివే సమయంలో దక్షణ భారతీయులకు చాలా వరకు తెలిసినవే ఉండవచ్చన్నారు. అయితే, తన పుస్తకం ఉత్తర భారతదేశం వారు చదివినప్పుడు దక్షణ భారతదేశ గొప్ప చరిత్ర, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, నేతల ఆదర్శవంతమైన జీవితాలు వంటివి తెలిసే అవకాశం ఉందన్నారు. ఆంధ్రదేశం ఎంతో చైతన్యవంతమైందని, ఇక్కడి కవులు, రచయితలు సమాజాన్ని బాగా ప్రభావితం చేశారని పేర్కొంటూ... 'దేశమంటే మట్టి కాదోయ్... దేశ మంటే మనుషులోయ్...' అన్న మహాకవి గురజాడ పద్యాన్ని గుర్తుచేశారు. ముఖ్య వక్తగా హాజరైన ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎన్నికల కమిషనర్ ఆర్‌పీ సిసోడియా మాట్లాడుతూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా, ఈ-బుక్స్ వంటి వాటి ప్రభావం వల్ల పుస్తకం చనిపోతుందా.. అనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ తరుణంలో పుస్తకాల విలువ తెలిసినవారు పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించాలని కోరారు. ఒక విషయాన్ని తమ రచనల ద్వారా పాఠకుల మస్తిష్కంలోకి చొప్పించి ఒప్పించగల శక్తి రచయితలకు మాత్రమే ఉందని, కాబట్టి మంచి రచనలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సభకు అధ్యక్షత వహించిన అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అనేకమంది కవులు, రచయితలు, ప్రచురణ సంస్థలకు కార్యస్థానం విజయవాడ అని చెప్పారు. అనేక గొప్ప వ్యక్తులు, పుస్తకాలను విజయవాడ అందించి జాతిని ప్రభావితం చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ తెలుగుభాషను ప్రమోట్ చేసే విధంగా పుస్తక మహోత్సవం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. సాంకేతికంగా ఎన్ని మార్పులు వచ్చినా మన సంస్కృతి, సంప్రదాయాలు, భాషను, సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తులతో కాదు, విజ్ఞానంతో నడిచే వ్యవస్థలను రూపొందించుకోవాలని, ఇందుకు పుస్తకం వారధి కావాలని పేర్కొన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ చెత్త రాజకీయాలను మార్చేందుకు పుస్తకాలను అందరూ చదవాలని, సామాజిక మార్పునకు పుస్తకం నాంది కావాలని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు పుస్తకాలు వారధి కావాలని ఆకాంక్షించారు. మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడు తూ సంక్రాంతి పండుగ వరకు పుస్తక మహో త్సవం నిర్వహిస్తే బాగుంటుందని, ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. ఏపీ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.విజయభాస్కర్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు వెంకట నారాయణ, కార్యదర్శి లక్ష్మయ్య పాల్గొన్నారు.

'కోరేగావ్'లో జన నివాళి

పూనే : కోరేగావ్ భీమా యుద్ధ 201వ వార్షికోత్సవం పురస్కరించుకుని పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మహారాష్ట్రలోని పూనే జిల్లాలోని 'జయ స్తంభం' యుద్ధ స్మారకం వద్ద అమర వీరులకు నివాళి అర్పించేందుకు మంగళవారం వేలాది మంది ప్రధానంగా దళితులు తరలి వచ్చారు.

కాగా దళిత చరిత్ర కలిగిన 1818 యుద్ధ వార్షికోత్సవం సందర్భంగా గత ఏడాది జనవరి 1న చెలరేగిన కుల ఘర్షణల్లో ఒకరు చనిపోగా, అనేక మంది గాయపడ్డారు. కోరేగావ్ భీమా వార్షికోత్సవం కారణంగా ఈసారి జరిగే వేడుకలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు భీంఆర్మీ నేత చంద్రశేఖర్ రావణ్ ఆజాద్ కోరేగావ్‌ను సందర్శిస్తుండంతో మహారాష్ట్ర పోలీసులు భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిఘా పెట్టనున్నట్టు మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. యుద్ధ స్మారక స్థూపం వద్ద ప్రజలు నివాళులర్పించే పూనే జిల్లాలోని పెర్నే గ్రామం చుట్టూ కనీసం 5 వేల మంది పోలీసులు, 1200 మంది హోం గార్డులు, 12 కంపెనీల రాష్ట్ర రిజర్వు పోలీసు బలగాలు(ఎస్‌ఆర్‌పీఎఫ్), 2 వేల మంది దళిత వాలంటీర్లను మోహరించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.


1818, జనవరి 1న కోరేగావ్ భీమా యుద్ధంలో మరణించిన అమర వీరులకు స్మారకంగా 'జయ స్తంభం'ను నిర్మించారు. పెద్ద ఎత్తును పోలీసులను మోహరించడంతోపాటు 500 సీసీటీవీ కెమెరాలు, 11 డ్రోను కెమెరాలను, 40 వీడియో కెమెరాలను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారి మంగళవారం ఉదయం చెప్పారు. అలాగే పూనే జిల్లా సరిహద్దు వెంబడి పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. 'పెర్నే గ్రామం, పరిసర ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసినట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ విశ్వాస్ నంగర్ పాటిల్ తెలిపారు. జయ స్తంభం వద్ద మంగళవారం ఉదయం అమర వీరులకు నివాళి అర్పించిన వారిలో బహరిప బహుజన్ మహాసంఘ్ నాయకుడు, దళిత ప్రముఖుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ తొలి రాజకీయ నాయకుడు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ స్మారక కార్యక్రమం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది అమర వీరులకు నివాళి అర్పించే ప్రజల సంఖ్య పెరగవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఎల్గార్ పరిషత్ వేదికను నక్సల్స్ అనే ముద్ర వేసిందన్నారు. కోరేగావ్ భీమా వాస్తవ చరిత్రను విద్యార్థులు తీసుకున్నారు. కానీ ప్రభుత్వం వారిని నక్సల్స్ అని పిలుస్తోంది' అని తెలిపారు. గత ఏడాది హింసకు కారకులైన అసలు నిందితులను ప్రభుత్వం గుర్తించాలన్నారు.

కొలువు దీరిన హైకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్ ఈఎస్‌ఎల్‌ఎన్ నరసింహన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మరో 13 మంది న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీ భట్, ఆకుల వెంకట శేషసాయి, ఎం.సీతారామమూర్తి, యు.దుర్గాప్రసాదరావు, టి.సునీల్‌చౌదరి, ఎం.సత్యనారాయణమూర్తి, జి.శ్యాంప్రసాద్, జె.ఉమాదేవి, ఎన్.బాలయోగి, టి.రజని, డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, కె.విజయలక్ష్మి, ఎం.గంగారావులచే గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సి.మానవేంద్రనాథ్‌రాయ్ రాష్ట్రపతి నోటిఫికేషన్ ప్రొసీడింగ్స్‌ను వేదికపై చదివి వినిపించారు. తదుపరి గవర్నర్ నరసింహన్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో సహా మొత్తం 14 మంది జడ్జిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందుగానే వేదిక వద్దకు చేరుకున్న సీఎం చంద్రబాబు గవర్నర్‌కు సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం సీఎం క్యాంపు కార్యాలయంలో తాత్కాలిక హైకోర్టును సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ ప్రారంభించారు. చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్, సీఎం చంద్రబాబు, మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమ పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో మొత్తం 9 కోర్టు హాళ్లు సిద్ధం చేశారు. మరో హాలును మహాత్మాగాంధీ రోడ్డులో ఉన్న ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఏర్పాటు చేయబోతున్నారు. ప్రధాన న్యాయమూర్తి సహా న్యాయమూర్తులంతా తమకు కేటాయించిన ఛాంబర్లలో ఆసీనులయ్యారు.

జస్టిస్ రాధాకృష్ణన్ ప్రమాణం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణలో మరో చారిత్రక ఘట్టానికి జనవరి 1, 2019 సాక్ష్యంగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉదయం 8.30 గంటలకు ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణన్ చేత గవర్నర్ ఇఎస్‌ఎల్.నరసింహన్ ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు రాజకీయ ప్రముఖులు, న్యాయవాదులు, హైకోర్టు సిబ్బంది హాజరయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం రాధాకృష్ణన్‌కు గవర్నర్ నరసింహన్, సిఎం కెసిఆర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేరళలోని కొల్లాంలో 1959, ఏప్రిల్ 29న రాధాకృష్ణన్ జన్మించారు. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. కర్ణాటకలోని కొలార్ గోల్డ్ ఫీల్డ్ లా కాలేజీ నుంచి లాయర్ పట్టా సాధించారు. తిరువనంతపురంలో 1983లో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు. సివిల్ లాయర్‌గా పేరుగాంచిన రాధాకృష్ణన్ రెండుసార్లు కేరళ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. గతేడాది మార్చి 18న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జూలైలో తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఏపీలో హైకోర్టు ఏర్పాటుకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో హైదరాబాద్‌లోని హైకోర్టు తెలంగాణ హైకోర్టుగా కొనసాగనుంది. దీనికి చీఫ్ జస్టిస్‌గా రాధాకృష్ణన్‌ను కొనసాగిస్తూ రాష్ట్రపతి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. విభజన చట్టం ప్రకారం తెలంగాణ హైకోర్టుకు 24 మంది న్యాయమూర్తులను కేటాయించారు. అయితే ప్రస్తుతం 13 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో తెలంగాణకు కేటాయించిన 10 మంది, ప్రధాన న్యాయమూర్తి, బదిలీపై వచ్చిన ఇతర రాష్ట్రాలవారు ఇద్దరుతో కలిపి మొత్తం 13 మంది న్యాయమూర్తులున్నారు. రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్రానికి కేటాయించిన ఇతర న్యాయమూర్తులతో హైకోర్టు ఆవరణలో చీఫ్ జస్టిస్ రాధకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ రామ సుబ్రమణ్యన్, జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్, జస్టిస్ సత్యరత్న శ్రీరామచంద్ర రావు, జస్టిస్ అడవల్లి రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ పొనుగంటి నవీన్ రావు, జస్టిస్ చల్లా కోదండరాం చౌదరి, జస్టిస్ బొలుసు శివశంకర్ రావు, జస్టిస్ డాక్టర్ షమీన్ అక్తర్, జస్టిస్ పొట్లపల్లి కేశవరావు, జస్టిస్ అభినంద్ కుమార్ షావలి, జస్టిస్ తొడుపునూరి అమర్ నాథ్ గౌడ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి సిఎం కేసీఆర్, హైకోర్టు న్యాయవాదులు, సిబ్బంది హాజరయ్యారు. న్యాయమూర్తులకు కేసీఆర్ పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంకు పలువురి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్జీఓల అధ్యక్షుడు అశోక్‌బాబు నాయకత్వంలో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు కలసి శుభాకాంక్షలు చెప్పారు. ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య ఇతర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విజయవాడ శివార్లలోని నున్న మానసిక వికలాంగుల సంఘంలో ఆశ్రయం పొందుతున్న వారు కూడా సీఎంను కలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. మానసిక వికాలంగుల యోగక్షేమాలను సంఘ నిర్వాహకుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

రాజ్యసభ ప్రచారం అవాస్తవం : కోదండరాం



విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు వెళతానంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవంకాదని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం స్పష్టం చేశారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో పోటీ అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటింటా ప్రచారంచ చేయటంలో వైఫల్యం చెందామని అంగీకరించారు. మహా కూటమి మంచి అజెండాను రూపొందించినా, దానిని ప్రజలలోకి తీసుకువెళ్లలేకపోయామని, అందుకే ఓటమిపాలైనట్లు చెప్పారు. అసలు కూటమి ఏర్పాటులోనే చాలా ఆలస్యం జరిగిందన్నారు. ప్రచారానికి సమయం కూడా చాలలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల వ్యూహం మరోలా ఉంటుందన్నారు. ఓటమితో విశ్వాసాన్ని కోల్పోలేదని, గ్రామ, మండలస్థాయి నుంచి పార్టీకి బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 25 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో రైతు రుణమాఫీ, మద్దతు ధర, నిరుద్యోగ సమస్య, జీఎస్టీ వంటి అంశాలు రాజకీయాలపై ప్రభావం చూపుతాయని కోదండరాం అభిప్రాయపడ్డారు. చరిత్రలో రెండు సార్లు మాత్రమే ఫెడరల్ ఫ్రంట్ సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫెడరల్ ఫ్రంట్‌కు అవకాశం లేదన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఎవరి కోసమో కేసీఆర్‌కే తెలియాలని వ్యాఖ్యానించారు.

9న ప్రజా సంకల్పయాత్ర ముగింపు

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఈ నెల 9న ముగియనున్నట్లు పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. లోటస్‌పాండ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మూడో తేదీ నుంచి ఏడు వరకు అన్ని నియోజకవర్గాల్లో సంఘీభావ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సమన్వయకర్త రెండు గ్రామాల్లో పాదయాత్ర ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఏడాదిగా సాగుతున్న జగన్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. నాలుగున్నరేళ్ల టీడీపీ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారంకావటంలేదని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నాటకాలు ప్రారంభించార న్నారు. రాష్ట్రంలో పలు ప్రభుత్వశాఖల్లో రెండు లక్షలకుపైగా ఖాళీలుంటే, కేవలం 1,500 భర్తీకే నోటిఫికేషన్ ఇవ్వటం శోచనీయమన్నారు. 2019 ఎంతో కీలకమైనదని, అవినీతి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

ఏపీ భవిష్యత్ మార్చనున్న ప్రజాసంకల్ప యాత్ర : వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర రాష్ట్ర భవిష్యత్‌ను మార్చనుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ చెప్పారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, కొత్త సంవత్సరం రాష్ట్ర చరిత్రలంటే చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, జనసేన నేత పవన్ కల్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి సీబీఐ, ఐటీ రాకూడదంటూ చంద్రబాబు ఆంక్షలు పెట్టటం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన టీడీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో కరవును, ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటంలేదని విమర్శించారు.

ఏడో వేతన సవరణ ప్రకారం జీతాలు ఇవ్వాలి

ఏఐఎఫ్‌పీటీవో జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దేశంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేసే అధ్యాపకులకు తక్షణమే 7వ వేతన సవరణ ప్రకారం జీతాలు ఇవ్వాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ అఫ్ పాలిటెక్నిక్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐఎఫ్‌పీటీవో) జాతీయ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ డిమాండు చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 7వ వేతన సవరణకు సంబంధించిన నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. దేశంలో ఉన్న ఐఐటీ, ఎన్ఐటీ, ఐఏఎం, యూజీసీ కింద ఉన్న విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న అధ్యాపకులందరికీ ఏడో వేతన సవరణ ప్రకారం జీతాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఒక్క పాలిటెక్నిక్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులకు మాత్రమే 7వ వేతన సవరణ అమలు చేయకపోవడం దారుణమని తెలిపారు. నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతోపాటు 2016 జనవరి నుంచి ఉన్న బకాయిలను కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడో వేతన సవరణ ఉత్తర్వులు వెలువడకపోవడం వలన దేశంలో 1.50 లక్షల మంది అధ్యాపకులు నష్టపోతున్నారని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.



కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

వర్ల రామయ్య, సురేంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక సంస్కరణలు ప్రవేశపెట్టినట్లు సంస్థ చైర్మన్ వర్ల రామయ్య, వైస్ చైర్మన్, ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం ఆర్టీసీ హౌస్‌లో కేకును కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంఘాలు, కార్మికుల సమన్వయంతో సంస్థ గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. యాజమాన్యంతో స్నేహపూరిత వాతావరణంలో మెలగడం ద్వారా కార్మికుల శ్రేయస్సు సాధ్యపడుతుందన్నారు. సిబ్బంది అహర్నిశలూ కష్టించి పని చేయడం వల్లే నష్టాలను చాలా వరకూ తగ్గించగలిగామన్నారు. కార్మికులు ఆనందంగా ఉంటేనే సంస్థ పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. కొత్త సంవత్సరం సిబ్బందిలో నూతనోత్తేజాన్ని నింపుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్లను మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నిధులు అరకొర..

పనులు నత్తతో పోటీ!

- ఐదేళ్లుగా సాగుతున్న డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు
- ప్రస్తుత అంచనా రూ. 1503.71 కోట్లు
- మరో రూ. 75 కోట్లు పెరుగుదల
- ఇదీ వీబీఎన్ రైలు మార్గం తీరు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం ఏళ్ల తరబడి సాగడం వల్ల అంచనా వ్యయం గణనీయంగా పెరుగుతోంది. ఏటా బడ్జెట్‌లలో అరకొరగా నిధులను కేటాయిస్తుండడంతో ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్వీఎన్ఎల్) చేపట్టిన విజయవాడ - గుడివాడ - భీమవరం - నరసపూర్, గుడివాడ - మచిలీపట్నం, భీమవరం - నిడదవోలు మార్గాల డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులే ఉదాహరణగా నిలుస్తున్నాయి. బ్రాంచ్ లైన్‌గా వ్యవహరించే ఈ మార్గాన్ని డబ్లింగ్ చేసి, విద్యుద్దీకరించడం వల్ల ప్రధాన మార్గంలో నిడదవోలు-విజయవాడ సెక్షన్‌లో ఏవైనా అవాంతరాలు ఏర్పడితే ప్రత్యామ్నాయంగా ఈ మార్గం ఉపయోగపడనుంది. ఈవిషయమై అనేక ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, రైల్వేకార్మిక సంఘాలు పాలకులకు విజ్ఞప్తులు చేయడంతో 2012లో రైల్వేశాఖ డబ్లింగ్, విద్యుద్దీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 221 కిలోమీటర్ల మార్గాన్ని డబ్లింగ్, విద్యుద్దీకరించేందుకు రూ. 1009 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించింది. ఏటా చాలా తక్కువ మొత్తంలో నిధులను కేటాయిస్తుండడంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయి. సదరు కాంట్రాక్టరు బిల్లులు జాప్యం అవుతున్నాయనే నెపంతో మధ్యలోనే పనులు నిలిపివేయడంతో కొన్నాళ్లపాటు సాగలేదు. బీజేపీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం 2014 సంవత్సరంలో అధికారంలోకి రావడంతో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈనేపథ్యంలో ప్రస్తుతం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,428.70 కోట్లుగా దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అయితే ఆర్వీఎన్ఎల్ వెబ్‌సైట్‌లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,503.71 కోట్లుగా పేర్కొంది. ఈ మధ్య కాలంలోనే అంచనా వ్యయంలో రూ. 75 కోట్లు వ్యత్యాసం కన్పిస్తోంది. వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భరించాల్సి ఉంది. పనులు జాప్యం కావడంతో అంచనా వ్యయం పెరిగి తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై కూడా భారం పడుతోంది.

ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు 849.71 కోట్లు

గత నాలుగేళ్ల కాలంలో ఈప్రాజెక్టుకు రైల్వేశాఖ రూ. 623.06 కోట్లను కేటాయించింది. ఇక 2018-19 సంవత్సరానికి రూ.226.65 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకూ రూ. 200 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఇంతవరకూ రూ. 849.71 కోట్లు కేటాయించినట్లయింది. ఈ ప్రాజెక్టును మొత్తం ఐదు దశల్లో పూర్తి చేయాలని ఆర్వీఎన్ఎల్ ప్రణాళిక రూపొందించింది. మోటూరు - భీమవరం టౌన్ మధ్య 2013 సంవత్సరంలో, మిగిలిన దశల పనులు 2016లో ప్రారంభమయ్యాయి. వివిధ సెక్షన్లలో మట్టి పనులు, పెద్ద, చిన్న వంతెనల నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని చోట్ల పురోగతిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పలు స్టేషన్లలో కొత్త భవనాలు, ప్లాట్‌ఫారాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, పైకప్పుల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. యార్డ్ అధునీకరణ, సర్క్యూట్ ఏర్పాట్లు, ఇండోర్ పనులు, లెవిల్ క్రాసింగ్ గేట్ల నిర్మాణం వంటి పనులు నిర్దేశించిన గడువులోపు పూర్తి చేస్తామని చెబుతున్నారు. మోటూరు - మండవల్లి - కైకలూరు - ఆకివీడు మధ్య 38 కిలోమీటర్ల మార్గాన్ని రాబోయే ఫిబ్రవరి నాటికి సిద్ధం చేస్తామని, మార్చి నుంచి రాకపోకలు ప్రారంభం కాగలవన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ-మోటూరు మార్గాన్ని 2019 అక్టోబరు నాటికి, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం- నరసపూర్, భీమవరం టౌన్-నిడదవోలు పనులు 2020లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు.

2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

- కొత్త సంవత్సరంలో ఏపీకి బంగారు భవిష్యత్తు
- జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి మంగళవారం నుంచే శ్రీకారం చుట్టామని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విజయవాడ జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ జనసైనికులు ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేయాలన్నారు. కొత్త సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు బంగారు భవిష్యత్తు ఉండాలనీ, ఆ భవిష్యత్తు పునర్నిర్మాణంలో జనసేన కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యకర్తలు అందరూ కష్టపడి పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సమసమాజ స్థాపన కోసం ఏర్పడిన పార్టీ అన్నారు. అనంతరం తెలుగు రాష్ట్రాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు పాల్గొన్నారు.

కొంత గందరగోళం

జనసేన పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరుగుతుండగా ఒకే పర్యాయం పార్టీ నేతలు వేదికపైకి రాగా కొంత గందరగోళం నెలకొంది. వీరిని నియంత్రించే క్రమంలో బౌన్సర్లకు, కార్యకర్తలకు నడుమ స్వల్ప తోపులాట జరిగింది.

పెన్నా అహోబిలం రిజర్వాయర్ నుంచి

నీటిని విడుదల చేయాలి

ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం లేఖ రాశారు. ఈ మేరకు ఆయన లేఖను పత్రికలకు విడుదల చేశారు. సకాలంలో నీటిని విడుదల చేయకపోవడం వలన కుడి కాలువ పరిధిలో ఉన్న చెరువులు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. నీటిని విడుదల చేయాలని గత కొన్ని రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అనంతపురము జిల్లాలో కరవు తాండవిస్తోందని, ఈ నేపథ్యంలో నీటిని విడుదల చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పీఏబీఆర్ కుడి కాలువ కింద చెరువులను నింపేందుకు నీరు విడుదల చేస్తున్నారని, ఈ ఏడాది ఇప్పటికీ విడుదల చేయకపోవడం వలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని లేఖలో స్పష్టం చేశారు. గత ఏడాది తరహాలో 2.5 టీఎంసీల నీటిని విడుదల చేస్తే చెరువులు నిండటంతోపాటు బావులు, బోర్లలో నీటిమట్టం పెరుగుతుందన్నారు. తద్వారా గ్రామీణ ప్రజల నీటి కష్టాలు కూడా తీరుతాయని పేర్కొన్నారు. వెంటనే పీఏబీఆర్ కుడి కాలువ కింద చెరువులకు 2.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు.



30వ విజయవాడ పుస్తక మహోత్సవానికి ముఖ్య అతిథులుగా వచ్చిన మహాత్మాగాంధీ మనుమడు ఆచార్య రాజమోహన్ గాంధీ, ఆచార్య ఉషా గాంధీ దంపతులకు స్వాగతం పలువుకుతున్న విశాంధ్ర విజ్ఞాన సమితి జీఎం పి. హరినాథరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు, ఏఎన్‌యూ ఆచార్యులు నన్నపనేని అంజయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ మనోహర్ నాయుడు



ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య. ఇంకా రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీనియర్ నేత పల్లా సూర్యారావు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, ఆయన కుమారుడు రంగనాగ్ తదితరులు

విలువలున్న పత్రిక విశాలాంధ్ర

హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప

విశాలాంధ్ర -సామర్లకోట : ఆరు దశాబ్ధాలుగా విలువలకు కట్టుబడి పనిచేస్తున్న పత్రిక విశాలాంధ్ర అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలోని తన నివాసంలో మంగళవారం నూతన సంవత్సర వేడుక వేదికపై పెద్దాపురం నియోజకవర్గ విశాలాంధ్ర క్యాలెండర్‌ను చినరాజప్ప కుమారుడు నిమ్మకాయల రంగనాగ్‌తో కలిసి ఆవిష్కరించారు. పత్రికారంగంలో విశాలాంధ్రకు తనదైన శైలి ఉందని రాజప్ప అన్నారు. ఎల్లప్పుడు విలువలను కాపాడుతూ పేదల పక్షాన పనిచేస్తుందని తెలిపారు. ప్రజాసమస్యలను అధికారులతోపాటు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేయడంలో ముందుంటుందన్నారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి నరాలశెట్టి సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల నాయకులు గుమ్మల రామకృష్ణ, యువజన నాయకులు బిక్కిన రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇదో చారిత్రక ఘట్టం

- ఏపీ హైకోర్టు ప్రారంభంలో సీఎం చంద్రబాబు
- న్యాయవ్యవస్థ గౌరవం పెంపొందించాలి : జస్టిస్ ఎన్వీ రమణ
- కొత్త చరిత్ర మొదలైంది : చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్‌తో చంద్రబాబు, ఇతర న్యాయమూర్తులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జనవరి 1వ తేదీన నవ్యాంధ్రప్రదేశ్‌లో హైకోర్టును ప్రారంభించడం ఒక చారిత్రాత్మకఘట్టంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం తాత్కాలిక హైకోర్టు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ, హైకోర్టు ఛీఫ్ జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్‌లతో కల్సి సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌కు తాను తొలి ముఖ్యమంత్రిగా, నరసింహన్ తొలి గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టగా, హైకోర్టు ఛీఫ్ జస్టిస్‌గా ప్రవీణ్‌కుమార్ వ్యవహరించడం చరిత్రాత్మకమైన ఘట్టంగా పేర్కొన్నారు. ప్రజల వద్దకే న్యాయవ్యవస్థ దరిచేరాలనే ఉద్దేశ్యంతోనే అమరావతి రాజధాని ప్రాంతంలో హైకోర్టు కార్యకలాపాల నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. హైకోర్టు విభజనకు చాలా తక్కువ సమయమిచ్చినప్పటికీ, ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సిబ్బందికి ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీఎం హోదాలో తాను ఇచ్చిన పిలుపుకు స్పందించి రైతులు స్వచ్ఛందంగా 33వేల ఎకరాల భూములను అందించారని, వారి ఆకాంక్షల మేరకు అమరావతి రాజధాని నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. అదే తరహాలో హైకోర్టు భవనాల నిర్మాణాలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకొని సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

కోర్టును ఒక ఆదర్శవంతమైన సంస్థగా రూపుదిద్దడంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజలు సహకరించి వ్యవహరించనప్పుడే సాధ్యమవుతుందన్నారు. హైకోర్టు నిర్వహించాల్సిన విధులు క్లిష్టతరంగానూ, అదే సమయం లోనూ సునితంగానూ ఉంటాయన్నారు. వ్యక్తికి-వ్యక్తికి, వ్యక్తికి-ప్రభుత్వానికి వచ్చే వ్యాజ్యాలు విచారించి న్యాయాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత మనపై వుందన్నారు. ఈ కర్తవ్యాన్ని నిష్కర్షగా నిర్వహించాల్సి వుందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటమే కాకుండా రాజ్యాంగంలో నిబిడీకృతమైన అంశాలకు కూడా తగు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తీర్పు వెల్లడించే సమయంలో న్యాయమూర్తులు స్వతంత్రంగానూ, నిష్కర్షగానూ వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనువైన సంఘ నిర్వహణకు నిర్మించబడిన సంస్థల్లో న్యాయ సంస్థ కూడా ఒకటన్నారు. ప్రజలకొరకు సృష్టించబడిన ఈ ఉన్నత న్యాయవ్యవస్థకు వున్న ప్రతిష్టను మరింత పెంచేలా, న్యాయస్థానాల ప్రాధాన్యతను పెంపొందించేలా అందరం పనిచేయాలన్నారు. ఈనెల 21వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగయ్ చేతుల మీదుగా అమరావతి రాజధానిలో తాత్కాలిక హైకోర్టు భవనాలను ప్రారంభించి పూర్తిస్థాయిలో కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. హైకోర్టు ప్రారంభాన్ని పురస్కరించుకొని తొలుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగయ్ సందేశాన్ని రమణ చదివి వినిపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ విభాగం కార్యకలాపాలు విస్తృతం అయ్యాయని, ఇవి మరింత బలోపేతం అవడం పట్ల ఎంతో సంతోషం కల్గిస్తుందన్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దేశంలోనే న్యాయవ్యవస్థలో పిన్న వయస్సు కల్గి వుందన్నారు. మన న్యాయ వ్యవస్థ నిస్సందేహంగా గర్వించదగినదిగా వుండాలని, దీనికి మనపై ఎంతో బాధ్యత వుందని తెలియజేశారు. న్యాయవ్యవస్థలో న్యాయవాదులు జవాబుదారీగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత వుందని సందేశంలో గొగయ్ పేర్కొన్నారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి హైకోర్టు గుంటూరు కేంద్రంగా పనిచేసిందని, తదుపరి 1956లో హైదరాబాద్‌కు తరలించినట్లు గుర్తు చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశాక తిరిగి అమరావతి రాజధాని ప్రాంతంలో హైకోర్టు కార్యకలాపాలకు శ్రీకారం చుట్టడం ఆనందకరమన్నారు. దాదాపు 62 ఏళ్ళ తర్వాత తిరిగి విజయవాడలో అమరావతి రాజధాని కేంద్రంగా హైకోర్టు కార్యకలాపాలు చేపట్టడం చారిత్రాత్మకమైన ఘట్టంగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్‌చంద్ర పునీత, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ పాల్గొన్నారు.

సంపాదకీయం

హసీనా విజయం

బంగ్లాదేశ్ ఎన్నికల్లో మరోసారి ప్రధానమంత్రి షేక్ హసీనానేతృత్వంలోని అవామీలీగ్ ఘన విజయం సాధించింది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇద్దరు మహిళా నేతలు ప్రత్యర్థులుగా ఆ దేశ రాజకీయాలను శాసిస్తున్నారు. వీరిలో హసీనా తనదే పైచేయి అని మరోమారు నిరూపించింది. మొత్తం 300స్థానాలున్న పార్లమెంటుకు జరిగిన 11వ సార్వత్రిక ఎన్నికల్లో అవామీలీగ్ నేతృత్వంలోని మహాకూటమికి 288 సీట్లు లభించాయి. అవామీలీగ్ సొంతంగా 259సీట్లు గెలిచింది. మొత్తం పోలైన ఓట్లలో 82శాతం ఈ కూటమికి దక్కాయి. ఖలీదా జియా నాయకత్వంలోని ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో విపక్ష పార్టీలతో కూడిన జాతీయ ఐక్యతా కూటమి(ఎన్‌యూఎఫ్) 15శాతానికిపైగా ఓట్లతో ఏడు సీట్లు, ఇతరులు మూడు సీట్లు గెలుచుకున్నారు. ఒక స్థానంలో ఎన్నికలు వాయిదా పడగా, మరోస్థానంలో అభ్యర్థి మరణంతో ఫలితాలను ప్రకటించలేదు. బంగ్లాదేశ్‌లో ప్రశాంతంగా ఎన్నికలు జరగడం ప్రజాస్వామ్య సుస్థిరతకు సూచిక అయితే, అవామీలీగ్ మళ్లీ విజయం సాధించడం భారత్‌కు అనుకూలమైన పరిణామంగా చెప్పవచ్చు.

బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం సాధించిన తర్వాత నాలుగేళ్లకే తిరుగుబాటు చేసిన సైనికాధికారులు బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్‌ను, ఆయన భార్య, ముగ్గురు కుమార్తెలను హత్యచేశారు. ఆయన మరో కుమార్తే షేక్ హసీనా. ఆమె తన భర్తతోపాటు ఆరేళ్లు భారత్‌లో ప్రవాస జీవితం గడిపి 1981లో అవామీలీగ్ అధ్యక్షురాలుగా ఎన్నికైంది. ఆ ఏడాది మే 17న స్వదేశానికి చేరుకున్నారు. సైనిక నియంత హుస్సేన్ మొహమెద్ ఎర్షాద్‌ను అధికారం నుంచి తొలగించేందుకు రాజకీయ కూటమి ఏర్పాటు చేశారు. మరోసైనిక నియంత జియా ఉర్ రెహ్మాన్ మరణానంతరం బీఎన్‌పీ అధ్యక్ష బాధ్యత చేపట్టిన ఆయన సతీమణి ఖలీదా జియాతో చేతులు కలిపి 1990లో ఆయనను పదవీచ్యుతుణ్ణి చేశారు. అప్పటినుంచి వీరిద్దరి మధ్యే బంగ్లాదేశ్ రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. 1966లో హసీనా తొలిసారిగా ప్రధానిగా ఎన్నికయ్యారు. 2001లో ఖలీదా జియా అధికారాన్ని కైవసం చేసుకొన్నారు. 2008లో హసీనా భారీ మెజార్టీతో అధికారం దక్కించుకున్నారు. అధికార పార్టీ అక్రమాలు, విపక్షాల అణచివేత, హక్కుల ఉల్లంఘన తారస్థాయికి చేరిందంటూ 2014 ఎన్నికలను ఖలీదా జియా పార్టీ బహిష్కరించింది. ఈ విజయంతో హసీనా అధికారానికి రావడం ఇది నాలుగోసారి. కాగా వరుసగా ప్రధాని పదవి చేపట్టడం ఇది మూడోసారి. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య స్థాపనలో, దేశాభివృద్ధిలో హసీనా నిర్వహించిన చారిత్రక పాత్ర ఆమెకు ఈ ఎన్నికల్లో విజయాన్ని వశం చేసింది. ఈ ఎన్నికల్లో భారత వ్యతిరేకత ఎక్కువగా పనిచేస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. దీనికి కారణం మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలు దెబ్బతినడం, అసోంలో పౌర జాబితా తయారీ కారణంగా బంగ్లాదేశ్‌కు చెందిన ఒక మతం వారి భవిష్యత్తు ఆందోళనకరంగా మారుతున్నదనే ప్రచారం, రోహింగ్యాల సమస్యపై మియన్మార్‌తో కలిసి బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా భారత్ వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు రావడం. అంతేకాదు, మన దేశంలో గోరక్షణ పేరిట సాగుతున్న దాడులు ఆ దేశంలో ఆందోళనకు కారణమైంది. భారత్ తన పెట్టుబడులు పెంచుకుంటూ బంగ్లాదేశ్‌పై పెత్తనం చలాయించేందుకు ప్రయత్నిస్తున్నదనే ప్రచారం సాగింది. కానీ ఇవేమీ అవామీలీగ్ విజయంపై ప్రభావం చూపలేకపోయాయి. ఐరాస నివేదిక ప్రకారం బంగ్లా మహిళలు అక్షరాస్యతలో ముందున్నారు. పురుషుల్లో అక్షరాస్యత 91శాతం ఉండగా, మహిళలలో అది 94శాతం ఉంది. వారి సగటు జీవిత కాలం 73ఏళ్లు ఉంది. పాఠశాలలో చేరే బాలికల శాతం ఎక్కువగా ఉంది. తీవ్రవాదం తగ్గుముఖం పట్టడం, రోహింగ్యాలకు ఆశ్రయం ఇవ్వడం, భారత్‌తోపాటు చైనాతోనూ సత్సంబంధాలు నెరపడం అవామీలీగ్‌కు ఎన్నికల్లో సానుకూలాంశాలుగా పనిచేశాయి. మరోవైపు బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా అవినీతి కేసులో జైలుశిక్ష అనుభవిస్తుండడంతో పార్టీకి దిశానిర్దేశం కరవైంది. ఆమె పెద్ద కుమారుడు తారిక్ రహమాన్‌కు అవినీతి కేసులో శిక్ష పడింది. అయితే ఆయన లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నారు. దీంతో బీఎన్‌పీని నడిపే బాధ్యత డాక్టర్ కమల్‌హుస్సేన్‌పై పడింది. ఆయన బీఎన్‌పీ నేత కాదు, కూటమిలోని పార్టీ నేత. అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన న్యాయవేత్త. దేశ మొదటి న్యాయశాఖ మంత్రి. విపక్ష కూటమి బలహీనతలు పక్కనపెడితే ఈ ఎన్నికలు జరిగిన తీరుపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ముందు నుంచీ ఎన్నికలు సక్రమంగా జరిగే అవకాశాలు లేవంటూ విపక్ష ఎన్‌యూఎఫ్ ఆరోపిస్తూనే ఉంది. దీనికి తోడు ఈ ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదంటూ కొన్ని అంతర్జాతీయ సంస్థలు కూడా అభిప్రాయ పడుతున్నాయి. దాదాపు వంద మంది అభ్యర్థులు పోలింగ్‌కు ముందే తాము పోటీ నుంచి తప్పుకుంటున్నామని ప్రకటించారు. పోలింగ్ సందర్భంగా పలుచోట్ల హింసాయుత ఘటనలు చోటుచేసు కున్నాయి. దాదాపు 17మంది చనిపోయారు. ఎన్నికల్లో అవకవతకలు ఆరోపణలు ఎలా ఉన్నా, ఆ పేరుతో హసీనా గెలుపును తక్కువచేసి చూడకూడదు. బంగ్లాదేశ్‌లో ఇప్పుడిప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలు కుదుటపడుతున్నాయి. సైనిక జోక్యం లేకుండా క్రమబద్ధంగా ఎన్నికలు జరుగుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థకు అలవాటు పడుతున్నందుకు బంగ్లాదేశ్ రాజకీయపక్షాలను, ప్రజలను అభినందించవలసిందే.

చురక

కొత్త పొత్తులు కొలువుదీరే
కొత్త సాలు రాజకీయం
కవ్వింపులు కలహాలు
కాగలవా మటుమాయం

అసహనం అభద్రత
అంతరించే మంచి కాలం
అధికారం మార్పు జరిగి
అవతరిచునా జనజాలం

– వేల్పుల నారాయణ

బతుకే భారమవుతున్న వేళ..

అంతర్జాతీయం


బుడ్డిగ జమిందార్

ప్రపంచమంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో కుటుంబ వ్యక్తిగత సమాజ జీవితం గడుపుకొందామని నూతన సంవత్సరం సందర్భంగా కోరుకొంటుంటాము. కానీ ప్రపంచ జనాభాలో నేడు 75 కోట్ల ప్రజానీకం, అంటే 6వ వంతు మంది మాత్రం తమతమ దేశాలనుండి శరణార్థులుగా వెళ్లిపోవాలని కోరుకొంటున్నారని ఇది పెట్టుబడిదారీ ఆర్థిక సమాజం. నవీనయుగంలో యిచ్చిన బహుమతి అని గల్లప్ స్టడీసెంటర్ పేర్కొంది. దీనికిగల రెండు ప్రధాన కారణాలను విశ్లేశించగా మొదటిగా సామ్రాజ్యవాద యుద్ధాలు ప్రధాన కారణంకాగా, రెండవ కారణంగా కార్పొరేట్ కంపెనీల నిలువుదోపిడీలు అని గల్లప్ స్టడీ సెంటర్ పేర్కొన్నట్లు ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ ఆన్‌లైన్ పత్రిక రాసింది. ఇదివరకు ఎన్నడూలేని విధంగా గడచిన 25 సంవత్సరాల నుండి అనగా సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రపంచీకరణ పర్యవసానంగా జరుగుతున్న విపత్కర ధోరణుల ప్రభావంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆఫ్రికా ప్రాంతంలోని సబ్‌సహార భూభాగం నుండి జనాభాలోని 3వ వంతు వారి సొంతగడ్డనుండి ఎక్కడికైనా పోవాలనుకొంటున్నారు. ఈ ప్రాంతంలో ఫ్రెంచ్, డచ్, బెల్జియం, అమెరికా కార్పొరేట్ సంస్థలు అక్కడి అపార ఖనిజ సంపదను, ముడిచమురు నిక్షేపాలను కొల్లగొట్టటం ఒకవైపు వ్యవసాయం, అడవులు ఎందుకూ పనికిరాకుండా చేయటంతో కాలుష్యంతో పాటుగా ఉపాధిని కోల్పోతూ దేశభూభాగమంతా ఎడారిమయమై పోతున్నది. సగటు మనిషి ఆయుష్షు 46 సంవత్సరాలకు పడిపోగా, జనాభా ఆదాయం రోజుకు 2 డాలర్లకంటే తక్కువకు పడిపోయి జీవితాల్ని వెళ్లబుచ్చుకొంటున్నారు. లాటిన్ అమెరికా దేశాల్లో అమెరికా చొరబాట్లను తట్టుకోలేక, నియంతల పాలనలతో విసిగివేసారి, ప్రపంచబ్యాంకు-ఐఎమ్ -ఎఫ్ షరతులకు బలైపోయిన ప్రజానీకంలో 27 శాతపు ఆదేశ ప్రజలు వారివారి దేశాలను వదలి బయటకు వలసలకై అన్వేషిస్తున్నారు.

తూర్పు యూరపుదేశాల్లో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరంచేసి కారుచౌకగా అమ్మటంవలన, ప్రైవేటు కంపెనీల లాభార్జన ధ్యేయంగా ఉత్పత్తి చేయటం సాంఘిక అవసరాలకు ప్రైవేటు కంపెనీలు ఉపయోగపడకపోవటంతో 26 శాతం ప్రజలు వేరేదేశాలకు వెళ్లిపోవాలని అనుకొంటున్నారని గల్లప్‌స్టడీస్ తెలియజేస్తున్నది. పరిన్ గల్ఫ్‌వార్ నుండి నేటివరకూ మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికాలో కురిపిస్తున్న అమెరికా బాంబుల వర్షాన్ని, క్షిపణులదాడుల్ని తట్టుకోలేక 24 శాతం ప్రజానీకం సురక్షిత దేశాలకు పారిపోవాలను కొంటున్నారు. ఈ 13 మధ్య ప్రాచ్య దేశాల్లోని 50 శాతం ఆ పైఎక్కువమంది వయోజనుల జీవితాల్ని నెగ్గుకురావటం బహు కష్టంగా ఉందని గల్లప్ స్టడీ సెంటర్ పేర్కొంది.


శరణార్థుల ఫైల్ ఫొటో

యూరపుదేశాల్లో ఆభరణాలకు అవసర మయ్యే వజ్రాల కోసం కార్పొరేట్ సంస్థలు సియేరాలియోన్ దేశంలో సాగిస్తున్న రక్తపాతాన్ని తట్టుకోలేక అక్కడి 71 శాతం వయోజనులు వారివారి దేశాలను వదిలిపారిపోవాలనుకుంటున్నారు. శతాబ్దకాలం నుండి అమెరికా ఆక్రమణలకు గురైన హైతీదేశంలో 63 శాతం ప్రజానీకం దేశంలో ఉండాలనుకోవటంలేదు. 1980, 1990 సంవత్సరాల్లో జరిగిన అంతర్యుద్ధ ఫలితాలతో ఉక్కిరిబిక్కిరైన 52 శాతం సాల్వడార్ ప్రజలు, 47 శాతం హోండూరస్ ప్రజానీకం అక్కడి హింస, దారిద్ర్యం, అవినీతి బారినపడిన 47 శాతం జనాభా శరణార్థులుగా వలసలకు పయన మవ్వాలనుకొంటున్నారని గల్లప్ స్టడీ సెంటర్ తెలియజేసింది.

మరొకవైపు శరణార్థుల బారినుండి ఉత్తర అమెరికా దేశాలైన అమెరికా, కెనడాల ప్రభుత్వాలు, ఐరోపా యూనియన్ ప్రభుత్వాలు కూడా బలమైన శరణార్థ వ్యతిరేక చట్టాలను చేస్తూ, మితవాద ఫాసిస్టు పార్టీలు బలపడుతూ శరణార్థ సహాయం పేరుతో అక్కడి స్థానిక కార్మికులకు కూడా తక్కువ వేతనాలిస్తూ కార్పొరేట్ సంస్థలు దోచుకొంటున్నాయి. శరణార్థుల సంఖ్యలను ఈయూ దేశాలు తగ్గించుకొంటూ దానికి బదులుగా ఉత్తర ఆఫ్రికాదేశాల్లో శరణార్థుల కోసమై కాన్సంట్రేషన్ షెడ్స్ క్యాంపులను కట్టటానికి నిర్ణయం తీసుకొన్నారు. అంటే యుద్ధాలను సృష్టించి, దోపిడీలు పెంచి అక్కడి ప్రజల్ని కాన్సంట్రేషన్ క్యాంపుల్లోకి పంపిస్తున్నారన్నమాట. ఎంత విచిత్రం ఈ పెట్టుబడిదారీ ఆర్థిక సమాజం. ఆగస్టు నెలలో శరణార్థ దరఖాస్తు చేసుకొనే అవకాశాల్ని ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్ తీసివేశాడు. ఇటలీ అంతరంగ మంత్రి 5 లక్షల శరణార్థులను వెనుక్కి పంపిస్తానంటున్నాడు. యు.కె.లోని ప్రభుత్వం బ్రెక్సిట్‌ను ఆసరాగా చేసుకొని అక్కడ తూర్పుయూరపు దేశాల్నుంచి వచ్చి స్థిరపడిన శరణార్థులను వెనక్కి తరలించే యోచనలో ఉంది. జర్మనీలో నియోఫాసిస్టు పార్టీ 'జర్మనీ ప్రత్యామ్నాయ పార్టీ' శరణార్థుల వ్యతిరేక ప్రదర్శనచేసి ఉన్న శరణార్థులను తరిమివేయాలని నూతనంగా దేశంలోకి అడుగుపెట్టనీయకూడదని నాటి హిట్లర్ నినాదాలను జనాల్లోకి బలంగా ప్రచారం చేస్తున్నది. 2018 ఏప్రిల్ నెలలో శరణార్థుల కుటుంబాల్లోని పిల్లలను ట్రంప్ ప్రభుత్వం వేరుచేసింది. ప్రత్యేక జైళ్లలో పెట్టింది. వీటిని యస్-మెక్సికో సరిహద్దులో నెలకొల్పింది. జాతీయవాదం ముసుగులో ప్రపంచదేశాలు శరణార్థుల వ్యతిరేక నిర్ణయాలు తీసుకొంటున్నాయి. ఈ నినాదంతో అధికారంలోకి రావటానికి ప్రయత్నిస్తున్నాయి. టర్కీ, గ్రీసువంటి అనేక దేశాల్లో తలదాచుకోటానికి వస్తున్న శరణార్థులను జైళ్లలో పెడుతున్నారు. సామ్రాజ్యవాద యుద్ధాలకు కార్పొరేట్ దోపిడీలకు ఐఎంఎఫ్-ప్రపంచబ్యాంకులకు వ్యతిరేక పోరాటమే శరణార్థుల సమస్యకు పరిష్కారంకాగలదు.

వ్యాసరచయిత : ఆలిండియా ప్రోగ్రెసివ్‌ఫోరం కార్యవర్గ సభ్యులు, సెల్ : 9849491969

ఆత్మలను పలికించేదే ..

రాజకీయాలు దిగజారిపోతున్నాయనడానికి రుజువుగా, ముందుగా చెప్పుకోవలసింది నాయకులు మాటాడే భాష! దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, సమరయోధులూ, ఉన్నత విద్యావంతులూ చట్టసభల్లో ఉండేవారు. ఏ వేదిక మీదనైనా వారు సంస్కారవంతంగా మాట్లాడేవారు. ప్రత్యర్థులను విమర్శించినా, ముచ్చటగా ఉండేది. భాష, మనసులోని భావోద్వేగాలకు ధ్వనిరూపం. మహాత్మాగాంధీని, బ్రిటిష్ ప్రధాని చర్చిల్ 'హాఫ్ నేక్డ్ ఫకీర్' (అర్ధనగ్న సన్యాసి) అని అవహేళన చేస్తే, ఆనాడు యావత్ భారతమే భగ్గుమంది. ఆ మాటలో అసభ్యత, అశ్లీలం లేదు. కానీ, చర్చిల్ దురహంకారాన్ని బయటపెట్టింది. దీనివల్ల, గాంధీజీ నిరాడంబరతకు మరింత వన్నె పెరిగింది. చర్చిల్ వ్యక్తిత్వం మసకబారింది.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా, మన రాజకీయాల్లో మర్యాదస్తుల భాషే మన్ననలందుకుంది. కాస్త విద్యలేని వారు కూడా వివేకం కోల్పోలేదు. 1962 చైనా-భారత్ యుద్ధంలో కొంత భూభాగాన్ని మనం కోల్పోయాం. లోక్‌సభలో దీనిపై చర్చ జరిగింది. పచ్చగడ్డి కూడా మొలవని ప్రాంతాన్నే గదా! కోల్పోయాం.. నష్టమేముంది? అనే రీతిలో ఆనాటి విదేశాంగ మంత్రి చాలా తేలిగ్గా ఒక ప్రశ్నకు జవాబిచ్చారు. ప్రతిపక్ష నేత రామమనోహర్ లోహియా లేచి, "మన ప్రధాని (నెహ్రూ) నెత్తిన ఒక్క వెంట్రుక కూడా మొలవదు. అంతమాత్రాన దాన్ని వదులుకుంటామా? చులకనగా చూస్తామా?" అనగానే, నెహ్రూతో సహా సభ యావత్తూ నవ్వులతో విరితోటయిందట! ఇలాంటి విమర్శలేవీ! సహృదయంతో స్వీకరించిన వారేరీ! ఇప్పుడు!? అనిపిస్తోంది ఎవరికైనా!

ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లోనూ సభ్యత, సంస్కారం కోల్పోకుండా విమర్శలూ, ప్రతివిమర్శలూ హేతుబద్ధంగా, సరదాగా, నర్మగర్భంగా ఉండేవి. గౌతు లచ్చన్న విమర్శలు కాస్త ఘాటుగా ఉన్నా, అవే ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. కమ్యూనిస్టు నాయకులు సుందరయ్య, నాగిరెడ్డి, చెన్నమనేని రాజేశ్వరరావు, వేములపల్లి శ్రీకృష్ణ, ధర్మభిక్షం, నర్రా రాఘవరెడ్డి వంటి వాళ్లు మాట్లాడితే, అధికార పక్షం వాళ్లు కూడా శ్రద్ధగా వినేవారు. 1958లో రెవెన్యూ పద్దులపై శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ ఎం.ఎల్.ఏ. నిచ్చెర్ల రాములు మాట్లాడుతూ, "రెవెన్యూ మంత్రిగారు (కళా వెంకటరావు) మాట్లాడేది కొండ నాలుకనుంచా! కొననాలుకనుంచా?" అని వ్యంగ్యంగా అడిగారట! దానికి కళావెంకటరావు కూడా దీటుగా జవాబిస్తూ, 'శ్లేష్మం అడ్డపడితే తప్ప, ఎవరూ కొండ నాలుకతో మాట్లాడరు. ఒకవేళ, అలా మాట్లాడటం ఎవరికైనా వస్తే నేర్చుకోవడానికి సిద్ధం" అన్నారట! ఇలా ఉండేది, ఆనాటి తరం రాజకీయ నాయకుల భాష!



ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో ఎన్టీఆర్ భాష ఒక సంచలనం. ప్రజలు బాగా అసహ్యించుకుంటున్న కాంగ్రెస్‌ను, ఆయన కటువైన మాటలతో విమర్శిస్తుంటే, ప్రతి సభలోనూ కరతాళ ధ్వనులు హోరెత్తిపోయేవి. 'కుక్కమూతి పిందెలు' వంటి వ్యాఖ్యలు చేస్తే, అవే కటువుగా సాగేవి. కానీ, జనం హర్షించేవారు. అధికారంలో ఉన్ననాడూ, లేనినాడూ ఎన్టీఆర్ ఎన్ని 'వేషాలు ' వేసినా, కాంగ్రెస్ నాయకులు కూడా మరీ, దిగజారి మాట్లాడింది లేదు. అయితే, ఇరుపక్షాల భాషలో 'కటువు' పెరిగింది. వై.ఎస్., చంద్రబాబు హయాంలో ఇది తీవ్రమైనా, సంస్కారం హద్దులు దాటడం అరుదు.

రాజకీయాల్లో తెలుగు భాషనీ, ఆంధ్రజాతినీ అత్యంత దారుణంగా దిగజార్చిన చరిత్ర నిస్సందేహంగా కేసీఆర్‌దే! ప్రత్యేక తెలంగాణా ఉద్యమాల్లో చెన్నారెడ్డి కూడా, ఇంతగా దిగజారిపోలేదు. ఆయన వెనుక ఉన్నవారు, కొంత అశ్లీలమైన భాషతో రెచ్చగొట్టారు తప్ప, చెన్నారెడ్డి మర్యాద గీత దాటలేదు. తెలంగాణా కోసం కేసీఆర్ ఉద్యమం ప్రారంభించినప్పుడు, భవిష్యత్‌లోనూ, మరో నాయకుడు మాట్లాడని అశ్లీల, అసభ్య, కుసంస్కార పదజాలమంతా వాడేశారు. అలాగనీ, ఆయనేమీ చదువులేనివాడు కాదు. మంచి చదువరి. నాలుగు భాషల్లో మాట్లాతాడూ! నాలుక చీరేస్తానని కూడా అంటాడు. "సన్నాసులు, దద్దమ్మలు, చవటలు, ముండమోపిలు" వంటి పద ప్రయోగాలన్నీ కాంగ్రెస్, టిడిపిలపై సంధించాడు. తెలంగాణా ఏర్పడకముందు, 'ఆంధ్రోళ్లు' అంటూ, ఎన్ని రకాలుగా అవమానించాడో, అందరికీ తెలుసు. సంక్రాంతికి ఊళ్లకు వెళ్లిన వాళ్లని తిరిగి రానివ్వమన్నాడు. రామోజీ ఫిల్మ్‌సిటీని లక్ష నాగళ్లతో దున్నిస్తానన్నాడు. ఎన్నికల్లో గెలిచిన తరువాత, రామోజీరావు ఇంటికి వెళ్లి టీ తాగి వచ్చాడు. 'థూ నీ బతుకు చెడ' అని ఈ మధ్య చంద్రబాబునన్నాడు గదా! రామోజీతో టీ తాగినప్పుడు, అదే మాట ఎవరైనా, ఆంధ్రావాళ్లు అన్నారా? లేదు గదా! సంస్కారం ఎవరి దగ్గరనుంచి ఎవరు నేర్చుకోవాలే!

తెలంగాణ ఎన్నికల్లో రెండో సారి గెల్చిన తర్వాత, చంద్రబాబుని ఒక ముఖ్యమంత్రి అని కూడా గౌరవించకుండా, ముఖ్యమంత్రి స్థాయిలోనే ఎంత నీచమైన భాషను కేసీఆర్ వాడాడో! అందరూ చర్చించుకుంటున్నారు. 'తెలుగు తల్లా! అదెవత్తి? ఎవడికి పుట్టింది" అనగలిగిన అతడి నోటినుంచి మర్యాదస్తుల భాష వస్తుందనుకోవడం భ్రమ. ఆయన, తెలిసి చేస్తున్న అమర్యాదకరమైన భాషా దాష్టీకమిది! ఆయన 'ఉర్దూ' బాగా మాట్లడతాడు. ఆ భాష మాతృక ఏదో, ఆయన చెప్పగలడా? అసలు, ఉర్దూలోనే, కేసీఆర్ కళ్లు తెరిపించగల ముచ్చట్లెన్నో ఉన్నాయి. హైద్రాబాద్ శాసనసభలో, బూర్గుల ముఖ్యమంత్రిగా ఉన్నపుడు, ఫూల్‌చంద్ గాంధీ అనే నాయకుడు ఆరోగ్య శాఖామంత్రిగా ఉండేవారట! ప్రముఖ కవీ, కమ్యూనిస్టు మగ్దుం మొహియుద్దీన్ ఒక సందర్భంలో మాట్లాడుతూ, 'ఫూల్ చన్దే కాంట్ బహుత్' (పూలు కొంచెం– ముళ్లేమో ఎక్కువ) అనగానే, సభలో నవ్వులు విరిశాయట! ఏం నేర్చుకున్నాడో, ఉర్దూనుంచి కేసీఆర్! ఉర్దూలోనే కొన్ని సామెతలున్నాయి. ఆయనకు ఖచ్చితంగా వర్తిస్తాయి. అవేమిటంటే –

"గర్జోనే వాలే బాదల్ నహీ బరస్తే"
(గర్జించే మేఘాలు కురవవు)

"అల్లాహ్ మొహర్బాన్ తో గధా బీ పహిల్వాన్" (అల్లాహ్ దయతలిస్తే, గాడిద కూడా వస్తాదవుతుంది)

తెలంగాణ ప్రజలు, 'అల్లాహ్'గా మారి తీర్పు ఇచ్చారు. కానీ, 'చరాగ్ తలే అంధేరా" (దీపం కింద చీకటి) అని చూసుకొని సరిదిద్దుకోకపోతే, తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలోనే కాదు, దేశ రాజకీయ చరిత్రలోనే, "అత్యంత అసభ్య, అశ్లీల రాజకీయ భాషావేత్త'గా కేసీఆర్ పేరు నిలిచిపోవడం ఖాయం. ముక్తాయింపుగా, తెలంగాణలో జన్మించిన భారత సాహితీ 'విశ్వంభరుడు' సినారె కవిత కూడా గుర్తు చేసుకోవడం ధర్మం.

'ఆత్మలను పలికించేదే అసలైన భాష'

రచయిత సెల్ : 73968 16430

ప్రత్యేక హోదాకు పంగనామాలు

చంద్రబాబు, మోడీ పిల్లి మొగ్గలు


వి. శంకరయ్య

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానిమోడీ వివిధ దశలలో అనుసరించిన అపసవ్య విధానాలతో ఏపీకి ప్రత్యేకహోదా అందని మానుపండులాగా మిగిలింది. ప్రస్తుతం ఈ పాప పంకిలం కడుగుకునేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కసరత్తుకు ప్రజాధనం కోట్లాది రూపాయలు అదనంగా దుర్వినియోగమౌతోంది. ప్రత్యేకహోదా కథా కమామీషు ఒకసారి పరిశీలిస్తే....

ప్రత్యేక హోదా అన్న విధానం 1969లో వెలుగులోనికి వచ్చింది. ఆర్థికంగా కాలు నిలదొక్కుకోలేని రాష్ట్రాలకు కేంద్రం ఆర్థిక మద్దతు పన్నులవాటా పంపకం ద్వారా ప్రత్యేకంగా ఆదుకోవాలని 5వ ఆర్థిక సంఘం సిఫార్సులతో ఈ విధానం కార్యరూపం దాల్చింది. తొలుత అసోమ్, నాగాలాండ్, జమ్మూకాశ్మీర్లకు కల్పించారు. తదుపరి అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరామ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ ఎనిమిది రాష్ట్రాలను కలిపి మొత్తం 11 రాష్ట్రాలకు ప్రత్యేకహోదా అమలు జరిపారు. ఏ ఒక్క సందర్భంలో ఏ రాష్ట్రానికి గానీ చట్టం ద్వారా ప్రత్యేకహోదా అమలు జరపలేదు. ప్రణాళిక సంఘం రూపొందించిన ప్రతిపాదనలను జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించడం ద్వారా అమలులోకి తెచ్చారు. కానీ దురదృష్టమేమంటే ఏపీ అంశానికొచ్చే సరికి చట్టంలో పొందుపర్చలేదని బీజేపీ నేతలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుసహా తొలిరోజుల్లో కాంగ్రెస్ పార్టీని తిట్టిపోశారు. ఈరోజు బీజేపీ నేతలుగానీ, ముఖ్యమంత్రిగానీ ఎన్ని రకాలుగా మాట్లాడినా అవన్నీ పక్కనబెడితే ప్రత్యేకహోదా ఏరాష్ట్రానికి అమలు జరగని విధంగా ఏపికి మాత్రం చట్టంలో లేదని రాష్ట్ర విభజన తొలిరోజుల్లో వీరందరూ వాదించి ఏపి ప్రజలను కోలుకోలేని దెబ్బకొట్టారు. ఆ రోజుల్లో ముఖ్యమంత్రితో పాటు బీజేపీకి చెంది కీలకపాత్ర వహించిన మరొక నాయకుడు ఈ వంతపాట పాడటమే కాకుండా ప్రత్యేక హోదాకు పన్నుల రాయితీకి సంబంధం లేదనే వితండవాదం తెరమీదకు తెచ్చారు.

ఒకవేళ చట్టంలో విధిగా వుండాలని ఆ రోజుల్లో వీరందరూ భావించివుంటే పోలవరం ముంపు మండలాలను ఏపీలో చేర్చుతూ ఆర్డినెన్స్ జారీ చేసిన సమయంలోనే ప్రత్యేక హోదా కూడా అందులో ఎందుకు జత చేయలేదనే ప్రశ్నకు బీజేపీ నేతల నుండి, ముఖ్యమంత్రి నుండి సమాధానం లేదు. వాస్తవమేమంటే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రానికి లేదు. అది సాధించాలనే పట్టుదల ముఖ్యమంత్రికి అంతకన్నాలేదు. ఇందుకు ఈ నిదర్శనాలు చాలు. 2016 సెప్టెంబర్లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన సందర్భంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రత్యేక ప్యాకేజీకి పట్టుబడితే పోలవరానికి నిధులు రావని ప్రత్యేకహోదా ఇచ్చి పన్నులు రాయితీలు ఇవ్వకపోతే ఎలా అని ఎదురు ప్రశ్నలు వేసిన రోజులున్నాయి. దీనితో పాటు శాసనసభలో ప్రత్యేక ప్యాకేజీని స్వాగతిస్తూ తీర్మానించారు. తదుపరి రాజకీయావసరాలకోసం ముఖ్యమంత్రి మాటలు మార్చడం అందరికీ తెలుసు.

అంతేకాదు. తొలినుండి కూడా వామపక్ష ప్రజాతంత్ర శక్తులు, ప్రత్యేక హోదా సాధన నేతలు అఖిలపక్షాన్ని కేంద్ర వద్దకు తీసుకెళ్ళమని ఎంత మొత్తుకున్నా ముఖ్యమంత్రిలో చలనంలేదు. ఏపని చేస్తే తనకు తన పార్టీ నేతలకు, పార్టీకి ఏమేరకు లబ్ది చేకూరుతుందనే అంశాలు అంచనా వేసుకోవడంలోనే ముఖ్యమంత్రి ఈ నాలుగేళ్ళకాలం గడిపేసి ముసలితనంలో ముదిమి ఎక్కువైనట్లు ప్రస్తుతం ఆరాటపడుతున్నా ఇసుమంత కూడా ఫలితం దక్కలేదు. ప్రత్యేకహోదాకు మంగళం పాడటానికి 14వ ఆర్థిక సంఘం సిఫార్సులకు లింకు పెట్టడం మరోమోసం. 14వ ఆర్థికసంఘం సిఫార్సులు అమలులోవున్నా కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రత్యేకహోదా అనుభవిస్తున్న రాష్ట్రాలకు 2017 జూలై 1వ తేదినుండి 2027 మార్చి వరకు పదేళ్ళకాలం పారిశ్రామిక రాయితీలకోసం 27,413 కోట్ల రూపాయలు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించినప్పుడు ఏపీకి కూడా అదేవిధంగా ఎందుకు మంజూరు చేయలేదు? ఇక్కడ సమస్య అదికాదు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలనే ఉద్దేశం కేంద్రానికి లేదు. విభజనచట్టంలో లేదని, 14వ ఆర్థికసంఘం సిఫార్సులు అడ్డు అని చెప్పి తప్పించుకున్నది.

14వ ఆర్థిక సంఘం ఏం చెప్పింది? 2015-16 ఆర్థిక సంవత్సరం నుండి కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న సాధారణ కేంద్ర మద్దతు, ఇతర అదనపు కేంద్ర మద్దతు, ప్రత్యేక కేంద్ర మద్దతు, ప్రత్యేక ప్రణాళికా మద్దతు ఈ నాలుగు పథకాలను ఆర్థిక సంఘం రద్దుచేసింది. బాధాకరమైన విషయమేమంటే కొందరు ఆర్థికసంఘ సభ్యుల ప్రకటనలు వాస్తవానికి దూరంగా వున్నాయి. సాధారణ రాష్ట్రాలకు ప్రత్యేకహోదాగల రాష్ట్రాలకు మధ్య ఎలాంటి తేడా లేకుండా ఒకవైపు సిఫార్సులు చేసి తాము ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వవద్దని చెప్పలేదని చేసిన ప్రకటనలు ఎలావున్నాయంటే నపుంసకునితో పెళ్ళిచేసి కాపురం చేయమన్నట్లుంది. గమనార్హమైన మరో అంశమేమంటే 13వ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు 2014-15 కేంద్ర బడ్జెట్లో ఈ నాలుగు పద్దుల క్రింద రూ. 46,410 కోట్లు ఖర్చు చేసి వున్నారు. అంతేకాకుండా 2014-15 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేక హోదాగల రాష్ట్రాలలో పన్నుల రాయితీల వలన రూ. 17,284 కోట్లు కేంద్రం నష్టపోయింది. ఈ తరహారాయితీలు ఏపికి ఇచ్చివుంటే రెట్టింపు ఆదాయం కేంద్రం కోల్పోవలసి వచ్చినా ఏపీ మాత్రం ఆర్థికంగా ఎంతోకాలు నిలదొక్కుకొనేది.

రాజకీయ లబ్ధిలేనిదే ప్రధానిమోడీ చిల్లిగవ్వ కూడా ఏ రాష్ట్రానికి విదల్చని నేపథ్యంలో అన్నీ తెలిసీ ముఖ్యమంత్రి ఎందుకు మిన్నకుండిపోయారు? 2014 ఫిబ్రవరి 20వ తేదీ రాజ్యసభలో ప్రత్యేక హోదా హామీ ఇచ్చిన అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కేంద్ర మంత్రివర్గంలో ఆమోదించి, ప్రణాళికా సంఘానికి ప్రతిపాదనలు పంపారు. 2014లో ప్రధాని పదవి చేపట్టిన మోడీ దాదాపు సంవత్సరకాలం ప్రణాళికా సంఘాన్ని ఆచేతనాస్థితిలో పెట్టి తుదకు రద్దుచేసి తదుపరి నీతిఅయోగ్ తెరమీదకు తెచ్చారు. ఈ సంవత్సరకాలం ముఖ్యమంత్రి ప్రణాళికా సంఘం వద్ద పెండింగ్ లోవున్న ప్రత్యేకహోదా ప్రతిపాదనల గురించి అసలు పట్టించుకోలేదు. దీనికితోడు 2017 జూలైలో ప్రత్యేకహోదా రాష్ట్రాలకు పన్ను రాయితీలు కల్పిస్తూ కేంద్ర మంత్రివర్గం తీర్మానిస్తే 2018 మార్చికిగానీ ముఖ్యమంత్రికి మెలుకువరాలేదు. తన రాజకీయ ప్రయోజనాలు నేరవేరవని తెలిసిన తర్వాత గానీ నాలుగేళ్ల తర్వాత గానీ ఏపీకి కేంద్రం చేస్తున్న ద్రోహం ముఖ్యమంత్రికి గుర్తుకు రాలేదు.

ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తే కలిగే రాయితీలు ఒకసారి పరిశీలిద్దాం. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే రాష్ట్రంలో నెలకొల్పబడే పరిశ్రమలకు వందశాతం ఎక్సైజ్ సుంకం మినహాయింపు వుంటుంది. నూరు శాతం ఆదాయపు పన్ను రాయితీ వుంటుంది. పరిశ్రమ యంత్రసామగ్రిపై మూలధన పెట్టుబడి రాయితీ ముప్పైశాతం వుంటుంది. ఇందుకు గరిష్ట పరిమితిలేదు. రవాణా సబ్సిడీ పథకం క్రింద ఇతర రాష్ట్రాలనుండి వచ్చే ముడి సరుకు రవాణాపై తొంభైశాతం రాయితీ రాష్ట్రంలో రవాణా జరిగితే యాభైశాతం రాయితీ ఏదైనా పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభించిన నాటి నుండి పదేళ్ళపాటు వర్కింగ్ కాపిటల్‌పై మూడు శాతం రాయితీ సమగ్ర బీమా పథకం క్రింద వంద శాతం రాయితీ తిరిగి చెల్లింపు వుంటుంది. విదేశీదాతలు ఇచ్చే రుణంలో తొంభైశాతం రాయితీ పదిశాతం రుణం. ఈ రుణం కూడా పదేళ్ళలో చెల్లించుకోవచ్చు. అంతేకాదు. కేంద్ర ఇచ్చే నిధుల మురిగిపోకుండా రక్షణ వుంటుంది. ఇవి గతంలో ప్రత్యేకహోదా పొందిన రాష్ట్రాలు పొందిన నిధుల రాయితీల ప్రణాళిక. 2017 జూలై 1వ తేదీ కేంద్రం ప్రత్యేకహోదాగల రాష్ట్రాలకు ఇచ్చిన రాయితీల కంపెనీలలో తెలుగుదేశం రాజ్యసభ సభ్యులకు చెందిన కొన్ని కంపెనీలు కూడా లబ్ధిపొందడం కొసమెరుపు. కానీ ఏపీ ప్రజలకు మాత్రం కష్టాలు కన్నీళ్ళే మిగిలాయి.

విశ్రాంత పాత్రికేయుడు, సెల్ : 9848394013





నూతన సంరంభం
హిమాచల ప్రదేశ్ రాజధాని సిమ్లాలో నూతన సంవత్సర సంరంభం దృశ్యం ఇది. 2019 కటౌట్లతో యువత శిఖరం వద్ద సందడి చేశారు.

నలభై శాతం... మించనీయవద్దు!

కొత్త సంవత్సరం ప్రారంభమైంది. కొత్త సంవత్సరం... కొత్త నిర్ణయాలు... కొత్త తీర్మానాల్లో భాగంగా ఇంటి బడ్జెట్‌నూ వేసుకునే ఉంటారు. ఏదేమైనా ఖర్చు తగ్గించుకోవాలని తీర్మానించేసుకునే ఉంటారు. మరి అందుకోసం తీసుకోవలసన జాగ్రత్తలేమిటో, అనుసరించాల్సిన ప్రణాళిక ఏమిటో రాసి పెట్టుకున్నారా! ఆచరించేందుకు సంసిద్ధమయ్యారా? ఇంటి బడ్జెట్, ఖర్చుల తగ్గింపు అంటే ఈ రోజుల్లో ముందుగా మాట్లాడుకోవాల్సింది క్రెడిట్ కార్డు గురించే. అవును...డబ్బులు చేతిలో పడకుండానే అమాంతం మింగేసే ఆధునిక తురుపు ముక్క ఈ క్రెడిట్ కార్డు. పొదుపు, మదుపు లేకుండా...భవిష్యత్తు సొమ్మును కళ్ళారా చూసుకోకుండానే ఖర్చు చేసేసే మాయా దండం ఈ క్రెడిట్ కార్డు. అవసరం ఏదైనా, ఎంతటిదైనా ....నేటి తరం క్రెడిట్ కార్డు అంటోంది. ఫలితం అప్పులు... మోయలేని భారాలు...ఏటికేడు పెరుగుతున్న ఆర్థిక సమస్యలు...ఏదైనా అవసరానికి సరిపడ ఉపయోగించుకుంటే అమృతం...అదనంగా వాడితే విషం...ఇది క్రెడిట్ కార్డుకూ వర్తిస్తుంది. ఇందంతా ఎప్పుడు సరైన అవగాహన లేనప్పుడు...అందుకే కొత్త సంవత్సరం ప్రారంభం వేళ...ఈ క్రెడిట్ కార్డుని ఉపయోగించే విధానాలు... తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఓ లుక్కేద్దాం.



మీరు క్రెడిట్ కార్డు వాడుతున్నారా? ఈ నెల ఎంత ఖర్చు చేశారో లెక్క చూసుకున్నారా? ప్రతి బిల్లునూ క్రెడిట్ కార్డుపైనే చెల్లించడం వల్ల లాభాల మాట ఎలా ఉన్నా.. క్రెడిట్ స్కోరు విషయంలో చిక్కులు తప్పకపోవచ్చు. మరి కార్డును వాడేప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. వాటి గురించి వారు తెలిపిన వివరాలు ఇవి.

ప్రతి క్రెడిట్ కార్డుకూ కొంత పరిమితి ఉంటుంది. ఆ పరిమితి మొత్తం వినియోగించుకున్నా ఇబ్బందేమీ ఉండదు. కానీ.. రుణ వినియోగ నిష్పత్తి పెరుగుతున్న కొద్దీ అటు ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్‌పైనా, ఇటు క్రెడిట్ స్కోరు, రుణ చరిత్రపైనా ప్రభావం పడుతుంది. ఉదాహరణకు మీకు రెండు క్రెడిట్ కార్డులు ఉన్నాయి. అందులో ఒకదానికి రూ.1,00,000, మరోదానికి రూ.50,000 పరిమితి ఉందనుకుందాం. ఇప్పుడు ఈ రెండు క్రెడిట్ కార్డులతోనూ కలిపి రూ.75,000 వరకూ కొన్నారనుకుంటే.. అప్పుడు మీ రుణ వినియోగ నిష్పత్తి 50శాతం అవుతుంది. మీకు ఉన్న రుణ అనుమతిలో ఎంత శాతం వినియోగించుకున్నారనేదే ఇక్కడ ప్రధానం.

ఏదేని రుణం కావాలంటే.. క్రెడిట్ స్కోరు, రుణ చరిత్ర ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. దీన్ని నిర్ణయించడంలో క్రెడిట్ కార్డుల పాత్ర ఎంతో ఉంటుంది. కాబట్టి, రుణ వినియోగం 40శాతానికి మించి లేకుండా చూసుకోవడమే ఎప్పుడూ అవసరం. క్రెడిట్ కార్డును తక్కువగా వినియోగించుకోవడం, తరచూ దానిపై ఆధారపడకపోవడం ఆర్థిక క్రమశిక్షణకు గుర్తు. తక్కువ రుణ వినియోగం క్రెడిట్ స్కోరు పెరిగేందుకు ఉపయోగపడుతుంది. ఫలితంగా కొత్త రుణం కావాలన్నా.. క్రెడిట్ కార్డు తీసుకోవాలన్నా ఎంతో సులభం అవుతుంది. ఒకవేళ మీరు కార్డుపై ఎక్కువగా ఖర్చు చేస్తుంటే.. రుణ సంస్థలు మిమ్మల్ని కాస్త ఇబ్బందిపెట్టే రుణగ్రహీతగా పరిగణిస్తాయి.

ఒకవేళ మీ క్రెడిట్ కార్డు వాడకం ప్రతిసారీ 40శాతాన్ని మించిపోతుంటే.. జాగ్రత్తలు తీసుకోవాల్సిన తరుణం ఆసన్నమయ్యిందన్నమాట.





బాకీ చెల్లించేయండి..

క్రెడిట్ కార్డులపైన బిల్లు ఎప్పటికప్పుడు చెల్లించేయాలి. బాకీ ఎక్కువగా ఉంటే.. మీ అప్పు మొత్తం కూడా పెరుగుతూనే ఉంటుంది. గత నెల బిల్లు బాకీ.. ఈ నెల బిల్లులో కలిసిందంటే.. చిక్కులు కొని తెచ్చుకున్నట్లే. ముందుగా ఆ భారాన్ని వదిలించుకోండి. బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ లేదా పెద్ద బిల్లు మొత్తాన్ని ఈఎంఐలోకి మార్చుకోవడం ద్వారా తొందరగా బాకీని తీర్చేందుకు వీలవుతుంది. ఒకవేళ మొత్తం బిల్లును ఒకేసారి చెల్లించడం సాధ్యం కాకపోయినా.. కొంతకొంత చెల్లించినా.. మీ రుణ వినియోగ శాతం తగ్గుతూ వస్తుంది.

పరిమితి అధికంగా..

మీరు తరచూ అధిక మొత్తంలో క్రెడిట్ కార్డును వినియోగిస్తుంటే.. కార్డు పరిమితిని పెంచుకోవడమే మేలు. తక్కువ పరిమితితో ఉన్న కార్డు అవసరాలకు సరిగా ఉపయోగపడకపోగా.. మీ రుణ చరిత్రపై ప్రభావం చూపిస్తుంది. క్రెడిట్ కార్డుపైనే ఎక్కువగా ఆధారపడితే.. మరో కొత్త కార్డును తీసుకోవడం కూడా మంచిదే. కొత్త కార్డు ఇవ్వాలంటే.. క్రెడిట్ స్కోరు కీలకంగా మారుతుంది. ఒకవేళ మీ స్కోరు సరిగా లేకపోతే.. కార్డు ఇవ్వడానికి నిరాకరించవచ్చు.

గమనిస్తూ ఉండండి..

మంచి క్రెడిట్ స్కోరు కావాలంటే.. క్రెడిట్ కార్డు బిల్లును ఎప్పటికప్పుడు సమయానికి చెల్లిస్తే చాలు అనే భావన కూడా ఉంటుంది. ఇక్కడ బిల్లు సరిగా చెల్లిస్తున్నామా లేదా అనేదానికన్నా.. ఎంత పరిమితి వరకూ వాడుతున్నామనేదే కీలకం.. మీ దగ్గర ఒకటికి మించి క్రెడిట్ కార్డులుంటే.. ప్రతి దానిలోనూ 40శాతానికి మించి వాడకుండా జాగ్రత్త పడండి. వీలైన చోట నగదు, నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్ కార్డును వాడండి. ఇలా క్రెడిట్ కార్డు వినియోగాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి.

పాతవి ఉన్నాయా?

రెండు మూడు క్రెడిట్ కార్డులున్నప్పటికీ.. కొన్నిసార్లు ఒకదానినే వాడుతూ.. మిగతా వాటిని పక్కన పడేస్తుంటాం. కార్డు వాడకం పెరిగినప్పుడు ఇలా పక్కన పెట్టిన కార్డులనూ వినియోగంలోకి తెచ్చుకోవాలి. రుణ వినియోగం ఎక్కువగా ఉన్నప్పుడు మీ దగ్గర ఉన్న క్రెడిట్ కార్డులను రద్దు చేసుకోవాలని చూడొద్దు. అలా చేస్తే.. మీ మొత్తం రుణ పరిమితి తగ్గిపోతుంది. ఫలితంగా తక్కువ మొత్తంలో కార్డు వాడినా.. అప్పు శాతం అధికంగానే ఉంటుంది. ఇది మంచిది కాదు. కాబట్టి, ఉన్న కార్డులను సమర్థంగా వాడుకోవడమే ఎప్పుడూ అవసరం.

క్రెడిట్ కార్డు ఉపయోగించేది ఒక వ్యక్తే కావచ్చు...కానీ దీనిని విచ్చలవిడిగా వాడడం వల్ల నష్టపోయేది ఒక కుటుంబం అనే విషయాన్ని గుర్తు పెట్టుకోండి. క్రెడిట్ కార్డు ఉంది కదాని ఎడాపెడా వాడేయడం వల్ల పెరిగే రుణభారం తాలూకూ చికాకుల ప్రభావం సదరు వ్యక్తి నుంచి మొత్తం కుటుంబంపైన పడుతుంది. దీంతో ఇల్లు ఆర్థికంగా ఇల్లు గుల్ల అవడమే కాదు మనుషుల మధ్య సంబంధాలూ దెబ్బతింటాయి. సో, మనకు తెలియకుండానే ఆత్మీయాతానుబంధాలకు గండి కొడుతుంది...ఈ క్రెడిట్‌కార్డు. దీనిని బట్టి మనకు అర్థమయ్యే విషయం...క్రెడిట్ కార్డు సరిగా వాడితే....సదరు వ్యక్తికి లాభమే కాదు...ఆనందంగా ఉంటాడు...తద్వారా కుటుంబం బాగుంటుంది...కుటుంబం బాగుంటే....కుటుంబాల నెలవైన సమాజం బాగుంటుంది... సమాజం బాగుంటే....మొత్తం దేశం బాగుంటుంది... అబ్బో... క్రెడిట్ వాడకం వెనక...... ఇన్ని నిజాలు ఉన్నాయా... అనిపిస్తోంది కదా...!! అవును...ఇదంతా తరచి చూస్తే కనిపించే వాస్తవం మరి!! మరి ఇకనైనా క్రెడిట్ కార్డుని...సందర్భోచితంగా వాడతారా...ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తారా...మీ కుటుంబంతో పాటు...దేశానికీ గొప్ప మేలు చేస్తారా!!! నిర్ణయం మీ చేతుల్లోనే...క్రెడిట్ కార్డు మీ చేతుల్లోనే....!!!

కోకకు కొంగొత్త మెలికలు!


సంప్రదాయ రీతిలో చీరలు వాడివాడి బోర్ కొట్టేసిందా? కోకలు కట్టికట్టి విసుగొచ్చేసిందా? చీరలే కట్టుకోవాలి...అయినా కొంగొత్తగా కనిపించాలనిపిస్తోందా? కోకలోనే కొత్త హంగులు చూపించాలనిపిస్తోందా? అయితే ఇలా చేసి చూడండి.

- చీరకు కుచ్చిళ్ళు పెట్టడం మామూలే. దీనిని మర్చిపోయి కుచ్చిళ్ళతోనే వస్తున్న చీరలను కట్టేయండి. చిన్నప్పుడు కట్టిన కుచ్చిళ్ళ గౌనులను ఇవి గుర్తుచేయడం ఖాయం. నేడు ట్రెండీ శారీ అంటే ఈ కుచ్చిళ్ళ చీరలే. ఇందులోనూ చాలా రకాలు వస్తున్నాయి. పల్లూలో కుచ్చిళ్ళు, పొడవాటి బ్లౌజుకి చివరన కుచ్చిళ్ళు, చీరకు చివరలో కుచ్చిళ్ళు ...ఇలా రకరకాల రూపాల్లో ఈ చీరలు వస్తున్నాయి. ఈ కుచ్చిళ్ళ చీరల్లోనే పువ్వులు, ప్రింట్లు, ప్లెయిన్ వైవిధ్యభరితంగా విభిన్న రకాలుగా వస్తున్నాయి.






- గాగ్రా లేదా పొడవాటి స్కర్టుల మీద వేసే క్రాప్ టాప్‌లను బ్లౌజులుగా ధరించి దానిమీద చీర కట్టేయండి. చీరకు కొత్త లుక్ కాదన్నా వస్తుంది. కొత్తదనం కోరుకునేవారికి ఇది కూడా మంచి ఛాయిస్.
- ధోతీ శారీస్, పాంట్ స్టైల్ శారీస్ చూశారా? కట్టారా? నేటి ట్రెండ్‌లో ఇవీ భాగమే. వీటికీ మంచి ఆదరణ కనిపిస్తోంది. మామూలు చీరలకు కొత్త స్టైల్ ఇవ్వాలనుకున్నవాల్ళు నిస్సందేహంగా వీటిని కట్టేయవచ్చు. సంప్రదాయ చీరను, పశ్చిమాది ఫ్యాంట్‌తో జోడించడం మంచి కాంబినేషనే అంటోంది నేటి యువతి.
- చీర మీద షర్ట్ బ్లౌజ్ వేశారా. లేదంటే ఇప్పుడు వేసి చూడండి. చీరకి కొత్త లుక్ వస్తుంది. స్మార్ట్ కాలర్, గీతలతో వచ్చే షర్ట్ బ్లౌజు కొత్తగానే కాదు నిండుగానూ కనిపిస్తుంది. వీటిని ఆఫీసులకూ వేసుకెళ్ళవచ్చు సంకోచం లేకుండా, బిడియపడకుండా.
- మీకు నడుము భాగం బాగా ఎక్కువగా ఉందా? అయితే దానికి అందంగా చూడచక్కని బెల్ట్ పెట్టేయండి. బెల్ట్ అంటే మామూలుగా వచ్చే మోడ్రన్ బెల్టు పెట్టుకో వచ్చు లేదంటే చీరలతో పాటే మ్యాచింగ్‌గా వస్తున్న బెల్ట్‌లనూ వాడుకోవచ్చు.
- మరీ కొత్తగా కనిపించానుకుంటే బ్లౌజుల స్థానంలో షార్ట్ కుర్తాలనూ కట్టేయవచ్చు. దాని మీద కట్టే చీర భలే చూడముచ్చటగా ఉంటుంది. కొత్తదనం కోరుకునేవాళ్ళు దీనిని తప్పనిసరిగా ట్రై చేయాల్సిందే. ఈ షార్ట్ కుర్తాల్లోనూ అబ్బో ఎన్ని వెరైటీలో. మీ మనసుకు నచ్చిన, మీ ఒంటికి నప్పిన కుర్తా డిజైన్‌ను ఎంచుకోవడమే మీరు చేయాల్సిన పని.





ఇడ్లీపిండి పులుపు రాకుండా..

- ఫ్రైడ్ రైస్ చేసేటప్పుడు బియ్యంలో ఒక స్పూన్ నూనె, నాలుగు చుక్కల నిమ్మరసాన్ని చేర్చితే అన్నం పొడిపొడిలాడుతూ వస్తుంది.
- వేయించిన వేరుశెనగలను పొడి చేసి తాలింపుల్లో అరస్పూన్ చేర్చితే రుచిగా ఉంటాయి.
- ఇడ్లీపిండి పులుపు రాకుండా ఉండాలంటే అందులో చిన్న అరటి ఆకును ఉంచండి.
- చికెన్‌ని ఉడికించేటప్పుడు ఒక కోడిగుడ్డును చేర్చితే రుచిగా ఉంటుంది.
- తాలింపు చేసేటప్పుడు అప్పుడప్పుడు నీళ్ళు చల్లుతూ ఉంటే...కూరలు అంటుకోవు.
- కూరగాయలను ఉడికించేటప్పుడు పాత్రను మూసి ఉంచితే పోషకాలు పోవు. కూరగాయలు త్వరగానూ ఉడుకుతాయి.
- దుస్తుల మీద కాఫీ, టీ మరకలు పడినప్పుడు వేడినీటిలో నానబెట్టి ఉతకాలి.
- ఇంట్లోని ఎలక్ట్రానిక్ స్విచ్‌ల్లో మరకలు ఉంటే నెయిల్ పాలిష్ రిమూవర్‌ని ఉపయోగించండి.





పిల్లల డైట్...!

- పీచుపదార్థం ఎక్కువగా ఉండే చిరు ధాన్యాలు, తృణధాన్యాలు, ఓట్స్ తప్పకుండా ఉండాలి
- గింజ ధాన్యాలనూ పిల్లల ఆహారంలో భాగంగా చేయాలి.
- తాజా పండ్లు, కూరగాయలు ఇవ్వాలి.
- పెరుగు లాంటి పాల ఉత్పత్తులనూ ఎక్కువగా అందించాలి.
- గుడ్లు తప్పనిసరిగా పెట్టాలి.

చిన్నారులకు పెట్టకూడనివి....

- ఫాస్ట్‌ఫుడ్స్.
- సోడా, సాఫ్ట్ డ్రింక్స్ లాంటి కార్బోనేటెడ్ డ్రింకులు.
- చిప్స్, స్వీట్లు, నూడిల్స్ లాంటి ప్రాసెస్డ్ ఫుడ్స్.
- జున్ను లాంటి కొవ్వుపూరిత పదార్థాలు.
- నూనె, మసాలా పదార్థాలు.



నేను - సుడిగుండం

(నవల) 3

పి.చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575

నాకు బడిలో స్నేహితులున్నారు. చుట్టుపక్కల వారి పిల్లలున్నారు. నాకంటూ స్వంత మనుషులు లేరనే బాధ వుంది.

మా ఇద్దరు మావయ్యలు అప్పటికి విడిపోలేదు. వారి పిల్లలందరూ కలిసే వుంటారు. అప్పుడు ఆ ప్రేమలు వేరు. తగాదాలు వేరు. అదో ప్రపంచం.

ఓసారి నరసయ్య మావయ్య ఏదో పెళ్లికి నన్ను తీసుకు వెళ్లాడు. ఆ పెళ్లికి మా పెదమావయ్య వచ్చాడు. తనతో చిన్నమావయ్య కూతురు కూడా వచ్చింది. నరసయ్య మావయ్య దూరంగా ఆయన్ని చూపించి "నీ పెద్ద మావయ్య' అన్నాడు. ఆయనకు విషయం తెలిసే వుంటుంది. అయినా నన్ను పలకరించ లేదు.

ఇద్దరు అమ్మాయిలు దూరంగా నిలబడి నన్ను చూస్తారు తప్ప నా దగ్గరకు రాలేదు. బహుశా పెద్ద మావయ్య హెచ్చరిక అయి వుంటుంది. అయినా నాకు సంతోషంగానే అనిపించింది.

అప్పుడు నరసయ్య మావయ్యకి కూడా పిల్లలు వుంటే అందరం కలిసి ఆడుకునే వాళ్లం కదా అనిపించింది. అలాంటిది ఇప్పుడు జరుగుతుంటే నా మంచి రోజులు కరిగిపోవటం ఏమిటనిపించింది.

ఆ తర్వాత నరసయ్య మావయ్యే ఈ అనుమానం తీర్చాడు.

"మనుషులకి పిల్లలు పుట్టడంతో స్వార్థం మొదల వుతుంది. అందులో ఆడపిల్ల పుడితే ఇంకా భయపడతారు. వారిని పెంచి, పెళ్లి చేసేదాకా వారిలో అశాంతే. అందుకోసం కోరికలు చంపుకుంటారు. చిన్నప్పటి నుంచే వారికి నగలు చేయించాలి. డబ్బులు సమకూర్చాలి. అందుకే చాలా మంది ఓ ఆడపిల్లతో సరి పెట్టుకుంటారు. ఇంకా వారి కోసం ఎన్ని తప్పులయినా చేస్తుంటారు. చివరకు లోకాన్ని మార్చాలను కున్నవారు కూడా పిల్లల విషయంలో రాజీ పడుతుంటారు. కొందరు అందుకోసం పెళ్లి చేసుకోరు. చేసుకున్నా పిల్లల్ని కనరు.

మనం కొన్ని సహజం అనుకుంటాం. వారు అనుకోరు. అందరూ తమ బిడ్డలే అనుకుంటారు. అలాంటి వారి గురించి నేను విన్నాను. నాకు లోకం పోకడ గురించి కొంతవరకే



తెలుసు.

ఇప్పటిదాకా నాకు పిల్లలు లేరు కాబట్టి నిన్నూ - అమ్మని ప్రేమగా చూసుకుంటున్నాను. ఇక మీ గురించి పట్టించుకోను అనుకుంటారు. అలాంటిది వుండదురా. నేను ఈ లోకాన్ని మార్చలేకపోవచ్చు. నేను మారను."

"మీ నాన్న జబ్బు పడిన రోజుల్లో మీ ఇద్దరి గురించి నా దగ్గర బాధ పడేవాడు. నేను బతకననిపిస్తోంది. అసలు నేను పెళ్లి చేసుకోవాల్సింది కాదు. మా అమ్మ ఓ మాట అంది. నీకు ఇద్దరు బావలున్నారు. అంతకంటే అండ ఎలా దొరుకుతుంది. ఒక్క చెల్లెల్ని ప్రాణంగా చూసుకుంటారు అని. నా ఒంట్లో శక్తి వుందని ధీమాగా వుండేవాడిని. ఇంత తొందరగా ఇలా అవుతుందని నేను అనుకోలేదు. మా అమ్మ చనిపోయినప్పుడు కూడా రాని దుఃఖం దిగులూ ఇప్పుడు నాలో వుంది" అంటూ మావయ్య చేతులు పట్టుకుని భోరున ఏడ్చాడంట.

ఆయన మాటలు వింటుంటే నాకు తెలియకుండా దుఃఖం విరుచుకు పడింది. మావయ్య నా కళ్లు తుడిచాడు.

"మీ నాన్నకి చెప్పిందే నీకు చెబుతున్నాను. నువ్వు నా పెద్దకొడుకువి. పుట్టబోయే వారు నీ తర్వాతే, ఈ మాటకు నేను కట్టుబడి వుంటాను." అనీ భుజం మీద చెయ్యి వేసాడు.

నాకు దుఃఖమూ - సంతోషం ఏకకాలంలో కలిగాయి. కొన్ని స్పర్శలు, కొన్ని సందర్భాలు అలాంటివి. ఎంత ఓదార్పు. ఎంత నమ్మకం!

అయినా నేనూ, అమ్మా ఈ ప్రపంచంలో ఇద్దరం మాత్రమే. మేం మాత్రమే దురదృష్టవం తులమా! మాకంటే ఎంతో దారుణంగా బతుకుతున్న వారిని ఆ వయసులోనే చూసాను.

మా అత్తయ్య నన్ను దగ్గరకు తీసుకుంది.

"నేను అమ్మని అవుతున్నానంటే నువ్వు మా ఇంటిలో అడుగుపెట్టిన వేళా విశేషమే అల్లుడూ" అంది.

\- - - -

అయిదు నెలలు గడిచిపోయాయి.

అత్తకు నొప్పులు రావటంతో ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. మావయ్య పక్కన నేను వున్నాను. లోపల అమ్మ వుంది. తొలి కాన్పు. అందులోనూ ఆలస్యంగా గర్భం వచ్చింది. నేను మావయ్య ముఖంలో పలుకుతున్న భావాల్ని గమనిస్తున్నాను. ముఖం గంభీరంగా వుంది. అందులో ఏదో భయం, ఆందోళన - అవన్నీ ఇప్పటికీ గుర్తున్నాయి.

నాలో నా తరహా ఆలోచనలు...

అత్తయ్య చనిపోతుందా!

పుట్టబోయే వారు బతకరా?

మృత్యువు ఇద్దరినీ బలి తీసుకుంటుందా?

అలాంటి క్షణాల్లో అమ్మ బయటకు వచ్చింది.

"ఆడపిల్ల పుట్టింది అన్నయ్యా. వదినా, పాప క్షేమంగా వున్నారు"

అప్పుడు మావయ్య ముఖం వెలిగిపోయింది.

నాలోనే చిత్రమైన భావన. అబ్బాయి పుడితే మేం కలిసి ఆడుకునే వాళ్లం కదా అని. ఆడపిల్లయితే ఏమవుతుంది అనుకున్నాను అంతలోనే.

"నీ మంచి రోజులన్నీ అయిపోతున్నాయి" అన్న మాటలు నా చెవుల దగ్గర హోరులా వినిపిస్తున్నాయి.

\- - - -

నాకు బడి అయిపోయాక మావయ్య ఇంటికి పరుగులు తీసుకుంటూ వెళ్లేవాడ్ని. అక్కడ మావయ్యగారి అమ్మాయిని ఆడించటం, ఉయ్యాల వూపటం, పాటలు పాడటం చేసేవాడిని.

పాపకు పేరు పెట్టటానికి మావయ్య ఆలస్యం చేసాడు. ఓరోజు నన్నే అడిగాడు. "ఏం పేరు పెడదాం అల్లుడూ" అని

"వెన్నెల, బాగుందా?" అన్నాను.

"వెన్నెల ఎప్పుడూ బాగుంటుంది. ఇంకేదన్నా ఆలోచిస్తాను అప్పటిదాకా వెన్నెల అని పిలుచుకుందాం" అన్నాడు.

నాకు మా అమ్మా - నాన్నలు 'రాము' అని పేరు పెట్టారు. అందరూ రాముడూ అని పిలిచేవారు. మా మావయ్య మాత్రం ఏ రోజూ 'ఒరేయ్' అనలేదు. అల్లుడూ అనే పిలుపు.

నాకు ఆ పేరు నచ్చలేదు.

నాకు రాముడి గురించి, రామాయణం గురించి తర్వాత తెలిసింది. ఆ పుస్తకాలు చదువుతుంటే బాగున్నాయి అనిపించేది. అప్పట్లో నా అవగాహన తక్కువ. అందులో మానవ సంబంధాలున్నాయి. తర్వాత చదివిన డిటెక్టివ్ పుస్తకాల కంటే ఎక్కువ ఉత్కంఠ వుండేది. ముఖ్యంగా ఆమిత్' నన్ను విపరీతంగా ఆకర్షించేది.

వేల సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథాలు ఇన్ని తరాలుగా ప్రజల్ని ఆకర్షించటం ఆశ్చర్యమే. నాకు బాణాలు వేయటం నేర్చుకోవాలని పించింది అప్పుడే. చిన్న కిరీటం లాంటిది తయారు చేసుకుని విల్లు చేతిలో పట్టుకునే వాడిని.

రామాయణంలో నాకు నచ్చిన పాత్ర లక్ష్మణుడు. అప్పుడు మా మేనమామలు గుర్తొచ్చేవారు. లక్ష్మణుడు లాంటి తమ్ముళ్లు వుంటారా? వుంటే ఎంత బాగుంటుంది!

మావయ్యలంటే గుర్తొచ్చింది.

వెన్నెల పుట్టిందని తెలిసి మహదానంద పడ్డా రంట. తమ్ముడికి చాల కాలం తర్వాత అమ్మాయి పుట్టిందని కాదు.

"ఇప్పుడు నరసయ్యగారి అసలు రూపం బయటికి వస్తుంది" అంటూ వ్యంగ్యంగా మాట్లాడుకు న్నారంట. అయినా మనుషుల్ని కాదనుకున్నాక వారి గురించి మాట్లాడుకోవటం ఎందుకు? మనుషులు ఈ బలహీనత నుంచి బయట పడరా?

నాకు అప్పుడో అనుమానం వచ్చింది.

వాళ్లు తమ అమ్మాయిల్నయినా ప్రేమిస్తున్నారా? రేపు అమ్మని వదిలించుకున్నట్లు వారిని కూడా అలానే....!

తర్వాత వెన్నెలకి నరసయ్య మావయ్య 'సుచిత్ర' అని పేరు పెట్టాడు. నేను మాత్రం వెన్నెలా అనేవాడిని.

\- - - -

వెన్నెలకి మూడు సంవత్సరాల వయసు వస్తున్న ప్పుడు మావయ్యకి విపరీతంగా జ్వరం వచ్చింది. అది టైఫాయిడ్ అని తేల్చారు. అప్పటిదాకా అణచుకుంటున్న భయాలన్నీ విరుచుకు పడ్డాయి. నాన్నలానే మావయ్య కూడా చనిపోతాడా? నా దురదృష్టం వెన్నెలకి కూడా పాకుతుందా?

నిద్రలో అవే కలలు

మావయ్య చనిపోయినట్లు, లక్ష్మి అత్త నన్ను దగ్గరకు తీసుకుని "ఇదేం కర్మ రాముడూ" అని భోరున ఏడుస్తున్నట్లు.

నేను దేవుడికి మొక్కుకున్నాను.

"మావయ్యని మా వెన్నెలకి దూరం చేయొద్దు. నేను తిరుమల కొండకు వచ్చి నా తలనీలాలు ఇస్తాను" అంటూ

అమ్మ మావయ్య దగ్గర వుండి అన్ని సేవలూ చేసింది.

అలాంటి సమయంలో ఇంకో వార్త తెలిసింది. లక్ష్మి అత్త మరోసారి గర్భం దాల్చిందని. ఆ తర్వాత నాకు తెలిసింది. మావయ్యకు ఇంకో బిడ్డకు జన్మనివ్వటం ఇష్టం లేదని.

"మనకి రాము వున్నాడు. సుచిత్ర వుంది. ఇంకా మనకి పిల్లలు అవసరమా? అని. తగిన జాగ్రత్తలు తీసు కుంటే బాగుండేది అని వాపోయాడు. అబార్షన్ చేయిం చుకుంటే ఎలా వుంటుందనే ఆలోచన చేసాడు.

అమ్మ ఒప్పుకోలేదు.

"అన్నయ్యా ఇంతకుముందు పిల్లలు కావాలనుకున్నప్పుడు పుట్టలేదు. ఇప్పుడు ఇంకొకరు పుట్ట బోతున్నారు. కాదనటానికి మనమెవరం. అందులోనూ రాము కోసం పుట్టబోయే వారిని కడుపులోనే చిదిమేయాలనుకోవటం నాకు నచ్చటం లేదు. ఆ పాపం మాది అవుతుంది. నువ్వు మాకు ఎంత నమ్మకం యిచ్చావో రేపు నా కొడుకు కూడా వాళ్లకి అంత అండగా వుంటాడని నా నమ్మకం"

టైఫాయిడ్ జ్వరం అప్పట్లో అంత ప్రమాదకరం. మావయ్య జంకి వుంటాడు. సహజంగా నా మీదున్న ప్రేమ, ఖర్చులు పెరగటం ఆయన్ని అలా మాట్లాడించి వుంటాయి. రెండు నెలల తర్వాత కోలుకున్నాడు. ఆ జ్వర ప్రభావంతో మావయ్య వెంట్రుకలు రాలిపోయాయి. జుత్తు బాగా పలచబడి ఆయనకి కొత్త రూపం వచ్చింది.

(ఇంకా ఉంది)

ఐఐటీల్లో...హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్



దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు)లు అత్యున్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ పట్టభద్రులను అందిస్తున్నాయి. అంతేకాకుండా బీటెక్ కోర్ సబ్జెక్టులకు అదనంగా ఆర్ట్స్, సోషల్ సైన్స్, హ్యుమానిటీస్ సబ్జెక్టులను ఎలక్టివ్స్‌గా చేర్చి.. ఇంజనీరింగ్ విద్యార్థులకు సమాజంపై అవగాహన కలిగేలా చేస్తున్నాయి. ఐఐటీలు ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సులకే పరిమితం కాకుండా.. సమాజంలోని సమస్యల పరిష్కారం గురించి అధ్యయనం చేసే సోషల్ సైన్సెస్‌లో పీజీ, పీహెచ్‌డీ కోర్సులను ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో వివిధ ఐఐటీల్లో అందుబాటులో ఉన్న సోషల్ సైన్సెస్ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల గురించి తెలుసుకుందాం...

ఐఐటీ మద్రాస్- హెచ్‌ఎస్ఈఈ 2019

ఐఐటీ మద్రాస్ నిర్వహించే హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఎంట్రన్స్ ఎగ్జామ్(హెచ్‌ఎస్ఈఈ)కు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. తాజాగా హెచ్‌ఎస్ఈఈ- 2019 నోటిఫికేషన్ విడుదలైంది.

హెచ్‌ఎస్ఎస్ :

ఐఐటీ మద్రాస్ ఏర్పడిన తొలినాళ్లలోనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(హెచ్‌ఎస్ఎస్)ను ఏర్పాటు చేశారు. హెచ్‌ఎస్ఎస్ డిపార్ట్‌మెంట్.. డెవలప్‌మెంట్ స్టడీస్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఫిల్మ్‌స్టడీస్, హెల్త్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, హిస్టరీ, ఫిలాసఫీ, పాలిటిక్స్ అండ్ సోషియాలజీ స్పెషలైజేషన్లకు సంబంధించి నిష్ణాతులైన ఫ్యాకల్టీని కలిగుంది. మొదటి నుంచి మల్టిడిసిప్లినరీ దృక్పథం కలిగిన హెచ్‌ఎస్ఎస్ డిపార్ట్‌మెంట్.. అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ స్థాయిల్లో ఎలక్టివ్ కోర్సులతోపాటు పోస్ట్ డాక్టోరల్ కోర్సులను అందిస్తోంది. 2006-07 నుంచి ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సును ప్రారంభించింది.

ప్రత్యేకత :

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో నైపుణ్యాలున్న వారికి ప్రాధాన్యం పెరుగుతోంది. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు వీలుగా.. ఐఐటీ మద్రాస్ ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సును విభిన్న స్పెషలైజేషన్ల (స్ట్రీమ్‌లు) కలయికతో ప్రత్యేకంగా రూపొందించింది. కోర్సులో భాగంగా విద్యార్థులను క్రిటికల్ థింకింగ్, రీసెర్చ్, ఐడియాస్, పీపుల్, సొసైటీ, ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ కండిషన్ తదితర అంశాల్లో నిపుణులుగా తీర్చిదిద్దుతారు. తద్వారా మానవ వనరుల పరంగా విశ్వవిద్యాలయాలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లు, పబ్లిక్, ప్రైవేట్ రంగ కంపెనీల అవసరాలకు తగ్గ మానవ వనరుల కొరత తీర్చేందుకు ఐఐటీ మద్రాస్ కృషిచేస్తోంది.

కోర్సులు-సీట్లు..

ఇంటి గ్రేటెడ్ ఎంఏ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్ (23 సీట్లు).

ఇంటిగ్రేటెడ్ ఎంఏ ఇన్ ఇంగ్లిష్ స్టడీస్ (23 సీట్లు).

కోర్సు వ్యవధి : ఐదేళ్లు

ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సులో మొత్తం 46 సీట్లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఎస్ఈఈ ద్వారా పైన పేర్కొన్న రెండు స్ట్రీముల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తొలి రెండేళ్ల పాటు విద్యార్థులందరికీ ఒకేరకమైన కరిక్యులం ఉంటుంది. అనంతరం స్వీయ ప్రాధాన్యతలు, తొలి మూడు సెమిస్టర్లలో అకడమిక్ ప్రతిభ, అందుబాటులో ఉన్న సీట్లను పరిగణలోకి తీసుకొని విద్యార్థులను రెండు స్ట్రీములుగా విభజిస్తారు.

అర్హత: ఐఐటీ మద్రాస్ అందించే ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సుల్లో చేరేందుకు అర్హత ఇంటర్ లేదా తత్సమానం.

పరీక్ష విధానం :

రాత పరీక్షలో ప్రతిభ ద్వారా ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తారు. రాత పరీక్షలో భాగంగా హెచ్‌ఎస్ఈఈ ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లో రెండు పార్టులుగా ఉంటుంది. పార్ట్ 1 మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. పార్ట్ 2లో ఎస్సే రైటింగ్ ఉంటుంది. పరీక్ష సమయం 30 నిమిషాలు.

పార్ట్ 1 అంశాలు: టాపిక్స్: ఇంగ్లిష్ అండ్ కాంప్రహెన్షన్ స్కిల్స్, అనలిటికల్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, ఇండియన్ ఎకానమీ, ఇండియన్ సొసైటీ అండ్ కల్చర్, వరల్డ్ అఫైర్స్, ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎకాలజీ.

పార్ట్ 2: జనరల్ టాపిక్‌పై ఎస్సే రాయాల్సి ఉంటుంది.

ముఖ్యసమాచారం..

హెచ్‌ఎస్ఈఈ-2019 : ఏప్రిల్ 21, 2019.

పరీక్ష ఫీజు : ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ విద్యార్థులకు రూ.1200, ఇతరులకు రూ.2400

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం : హైదరాబాద్.

దరఖాస్తులు ప్రారంభం : డిసెంబర్ 12, 2019.

దరఖాస్తులకు చివరి తేది : జనవరి 23, 2019.

వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రారంభం : మార్చి 20, 2019.

వెబ్‌సైట్ : http://hsee.iitm.ac.in

ఐఐటీ ఖరగ్‌పూర్ :

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల ప్రయాణంలో తొలి అడుగు.. ఐఐటీ ఖరగ్‌పూర్. ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ రెండు పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను ఆఫర్ చేస్తోంది. అవి.. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఇన్ ఎకనామిక్స్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం). ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఎకనామిక్స్ కోర్సులోకి జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా అభ్యర్థులు ప్రవేశాలను ఖరారు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్ : www.iitkgp.ac.in

ఐఐటీ బాంబే :

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్... బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (ఎకనామిక్స్), ఎంఫిల్-ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్, పీహెచ్‌డీ కోర్సులను అందిస్తోంది. అప్లయిడ్ ఎకనామిక్స్ అనాలసిస్ నిపుణులను తీర్చిదిద్దే ఉద్దేశంతో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (ఎకనామిక్స్) కోర్సును ఐఐటీ బాంబే 2017లో ప్రారంభించింది. విద్యార్థులను బిజినెస్ అండ్ పబ్లిక్ పాలసీ, డెవలప్‌మెండ్ అడ్మినిస్ట్రేషన్, డెసిషన్ మేకింగ్ ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. దీంతోపాటు హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్‌కు సంబంధించి ఎంఫిల్-ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్, పీహెచ్‌డీల్లోకి సైతం ఐఐటీ బాంబే అడ్మిషన్ కల్పిస్తోంది.

వెబ్‌సైట్ : http://www.iitb.ac.in

ఐఐటీ గువహటి :

ఐఐటీ గువహటి... ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్ కోర్సును 2009 నుంచి అందిస్తోంది. హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కోణంలో డెవలప్‌మెంట్ అంశాలను అర్థం చేసుకునేలా ఈ కోర్సును రూపొందించారు. ఫిబ్రవరి లేదా మార్చిలో ఎంట్రన్స్ నోటిఫికేషన్ విడుదల చేసి.. జూన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అందుబాటులో ఉన్న మొత్తం సీట్లు 48. అదే విధంగా ఐఐటీ గువహటి.. పీహెచ్‌డీ ఇన్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌ను కూడా అందిస్తోంది. ఎకనామిక్స్, ఇంగ్లిష్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, సోషియాలజీ, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, పొలిటికల్ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీలోకి ప్రవేశం కల్పిస్తోంది. నెట్ లేదా గేట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

వెబ్‌సైట్ : www.iitg.ac.in

ఐఐటీ రూర్కీ :

ఐఐటీ రూర్కీ.. ఎంఎస్సీ ఎకనామిక్స్ కోర్సును అందిస్తోంది. మొత్తం 30 సీట్లు అందుబాటులో ఉన్నాయి. జాయింట్ అడ్మిషన్ టెస్ట్(జామ్) ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ప్రవేశాలను ఖరారు చేస్తారు. దీంతోపాటు ఇంగ్లిష్, ఫైన్‌ఆర్ట్స్, ఎకనామిక్స్, సైకాలజీ, సోషియాలజీ స్ట్రీముల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తోంది. ఎంఎస్సీ ఎకనామిక్స్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాలసీ విశ్లేషకులు, ఆర్థిక సలహాదారులు, పరిశోధకులు, కన్సల్టెంట్‌లుగా అవకాశాలు అందుకునే వీలుంది.

వెబ్‌సైట్ : www.iitr.ac.in

ఐఐటీ కాన్పూర్ :

ఐఐటీ కాన్పూర్... ఎకనామిక్స్, ఇంగ్లిష్, ఫైన్ ఆర్ట్స్, ఫిలాసఫీ, సోషియాలజీ సబ్జెక్టుల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను ఆఫర్‌చేస్తోంది. ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఇన్ ఎకనామిక్స్, పీహెచ్‌డీలను ఆఫర్‌చేస్తోంది. ఐఐటీ కాన్పూర్ అందించే బీఎస్ ప్రోగ్రామ్ ఇన్ ఎకనామిక్స్‌లో అడ్మిషన్ కోసం విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

వెబ్‌సైట్ : www.iitk.ac.in



ఐఐటీ ఢిల్లీ :

ఐఐటీ ఢిల్లీ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.. ఎకనామిక్స్, లిటరేచర్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, పాలసీ, సైకాలజీ, సోషియాలజీ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశం కల్పిస్తోంది. దీంతోపాటు బీటెక్ విద్యార్థులకు సమ్మర్‌లో రూరల్ ఇంటర్న్‌షిప్‌లు, ఎకనామిక్స్, లింగ్విస్టిక్స్, లిటరేచర్, ఫిలాసఫీ, సైకాలజీ, సోషియాలజీల్లో ఆబ్జెక్టివ్ కోర్సులను ఆఫర్‌చేస్తోంది.

వెబ్‌సైట్ : http://hss.iitd.ac.in

ఐఐటీ గాంధీనగర్ :

ఐఐటీ గాంధీనగర్... రెండేళ్ల ఎంఏ ఇన్ సొసైటీ అండ్ కల్చర్ కోర్సును అందిస్తోంది. దాంతోపాటు హిస్టరీ, లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, సైకాలజీ, సోషల్ ఎపిడిమాలజీ అండ్ సోషియాలజీ, పొలిటికల్ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సును ఆఫర్‌చేస్తోంది. దీన్ని పూర్తిగా రెసిడెన్షియల్ కోర్సుగా అందిస్తోంది.

వెబ్‌సైట్ : www.iitgn.ac.in

ఐఐటీ హైదరాబాద్ :

ఐఐటీ హైదరాబాద్... మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ (ఎంఫిల్).. ఆంత్రోపాలజీ అండ్ సోషియాలజీ, ఇంగ్లిష్, కల్చరల్ స్టడీస్, సైకాలజీ, ఎకనామిక్స్‌లో అందిస్తోంది. దాంతోపాటు పీహెచ్‌డీలోకి అడ్మిషన్ కల్పిస్తోంది.

వెబ్‌సైట్ : www.iith.ac.iin

ఐఐటీ పాట్నా :

ఐఐటీ పాట్నా... ఎంఎస్సీ ఎకనామిక్స్ కోర్సును అందిస్తోంది. దీంతోపాటు ఎకనామిక్స్ ఇంగ్లిష్ లింగ్విస్టిక్స్ సోషియాలజీ హ్యూమన్ రిసోర్స్‌మేనేజ్‌మెంట్ పబ్లిక్ హెల్త్‌లో పీహెచ్‌డీలోకి ప్రవేశాలు కల్పిస్తోంది.

వెబ్‌సైట్ : www.iitp.ac.in

ఐఐటీ తిరుపతి :

ఐఐటీ తిరుపతి... హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆఫర్‌చేస్తోంది. ఇంగ్లిష్: కల్చరల్ స్టడీస్, ఫిల్మ్ స్టడీస్, కంపారిటివ్ లిటరేచర్ ఇతర సంబంధిత విభాగాలుబీ ఎకనామిక్స్: డెవలప్‌మెంట్ ఎకనామిక్స్, కంపారిటివ్ పొలిటికల్ ఎకానమీ, డెవలప్‌మెంట్ స్టడీస్ వంటి సంబంధిత విభాగాలుబీ అదేవిధంగా ఫిలాసఫీ: సోషల్ అండ్ పొలిటిక్ ఫిలాసఫీల్లో పీహెచ్‌డీలోకి ప్రవేశం కల్పిస్తోంది.

వెబ్‌సైట్ : http://iittp.ac.in

ఉద్యోగావకాశాలు

వివిధ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

1. ఏపీ బాయిలర్స్ సర్వీస్‌లో బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్లు : 3

అర్హత : మెకానికల్/ ప్రొడక్షన్/ పవర్ ప్లాంట్/ మెటలర్జికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

వయసు : జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్/ మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ కాంపిటీటివ్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం : జనవరి 4, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 25, 2019.

2. అసిస్టెంట్ కమిషనర్ : 7 (ఏపీ ఛారిటబుల్ అండ్ హిందు రెలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ సర్వీస్)

అర్హత : లా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అడ్వకేట్‌గా మూడేళ్ల అనుభవం ఉండాలి.

వయసు : జులై 1, 2018 నాటికి 28-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ కాంపిటీటివ్ ఎగ్జామ్/ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం : డిసెంబర్ 28, 2018.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 19, 2019.

3. అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు : 3 (ఏపీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ సర్వీస్)

అర్హత : ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల ప్రాక్టికల్ అనుభవం ఉండాలి.

వయసు : జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : స్క్రీనింగ్ టెస్ట్/ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, రాత/ ఓరల్ కాంపిటీటివ్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం : జనవరి 3, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 25, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : https://psc.ap.gov.in

ఇండియన్ రైల్వేలో 798 ఉద్యోగాలు



భారతీయ రైల్వేకు చెందిన వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌లో **798 కానిస్టేబుల్ (యాన్సిల్లరీ) పోస్టుల** భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత : పోస్టును బట్టి మెట్రిక్యులేషన్/ ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.

వయసు : 18-25 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : ఎస్సీ, ఎస్టీ, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళలు, మైనార్టీ, ఈబీసీలకు రూ.250, ఇతరులకు రూ.500.

దరఖాస్తుకు ప్రారంభతేదీ : జనవరి 1, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 30, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : www.indianrailways.gov.in

విశాలాంధ్ర బిజినెస్

186.24 ▲	47.55 ▲	00 ◀◀	బంగారం (విశాఖపట్నం)	- 100 ▲	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	30,170	వెండి (విజయవాడ)	41,300	
36,254.57	10,910.10	30,010	ప్రొద్దుటూరు 30,140	39,400	ప్రొద్దుటూరు 41,463	69.45
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఎయిర్‌టెల్	319.50	2.24
హెచ్‌డీఎఫ్‌సీ	2,009.00	2.07
హెచ్‌పీసీఎల్	256.70	1.36
ఎస్-బ్యాంక్	185.90	1.35
భారతీ ఇన్‌ఫ్రాటెల్	263.50	1.25

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎం&ఎం	773.35	-3.79
హిండాల్కో	222.75	-1.53
విప్రో	326.65	-1.27
ఇండియాబుల్స్	852.60	-1.07
హెచ్‌యుఎల్	1,824.80	-1.02

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	69.94	69.45
యూరో	80.21	79.85
పౌండ్	88.81	88.55
ఆస్ట్రేలియా డాలర్	49.40	49.05
సింగపూర్ డాలర్	51.21	50.97

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,210	32,310
చెన్నై	30,210	32,310
బెంగళూరు	29,680	31,743
ముంబై	30,650	32,780
విజయవాడ	30,010	32,600
విశాఖపట్నం	30,170	31,650
ప్రొద్దుటూరు	30,140	31,650
ముడి చమురు		52.28





హ్యాపీగా... జాలీగా...!

నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కొత్త సంవత్సరం కొత్త ఆశలు చిగురిస్తూ ఆకాంక్షలు నెరవేరాలన్న భావన సర్వత్రా వ్యక్తమైంది. నూతన సంవత్సర 2019 వేడుకలు అంబరాన్నంటాయి. 2018కి వీడ్కోలు చెబుతూ.. కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ చిన్నాపెద్దా అంతా వేడుకగా జరుపుకొన్నారు. బాణాసంచా వెలుగులతో, డీజేల హోరులో, డ్యాన్సులతో అంతటా కోలాహలంగా కనిపించింది. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆట, పాటలతో ఫుల్ గా ఎంజాయ్ చేశారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వేడుకల్లో పాల్గొన్నారు. డీజే సౌండ్స్‌కు అనుగుణంగా డ్యాన్సులతో ఉల్లాసంగా గడిపారు. ఏ గ్రామం వెళ్లినా, ఏ పట్టణం దరిచేరినా చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా ఇంటిల్లిపాది కేరింతలు కొడుతూ వేడుకల్లో మునిగితేలారు.... పాడారు... ఆడారు. నల్గొండ, మెదక్, యాదాద్రి భువనగిరి, జనగాం, కొమురంభీం ఆసిఫా బాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో యువతీ యువకులు పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఆనందపారవశ్యంలో మునిగిపోయారు. నూతన సంవత్సరం సందర్భంగా పబ్బులు, క్లబ్‌లు, రిసార్ట్స్, పేరొందిన స్టార్ హోటళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రజలు, ప్రముఖులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో అంబరాన్ని అంటే విధంగా సంబరాలు జరుపుకున్నారు. సంగీత వాయిద్యాల హోరు, బాణాసంచా పేలుళ్లు, రహదారుల్లో రయ్యిరయ్యిన సాగుతున్న వాహనాల హోరు మధ్య వేడుకలు కన్నుల పండువగా జరుపుకోవడం విశేషం. 12 గంటలు దాటాక కేకుల్ని కట్ చేసి, మిఠాలను ఒకరికొకరు తినిపించుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని సందడి చేశారు. కేరింతలు కొట్టారు.

మిక్స్‌డ్ కల్చర్‌గా చెప్పుకునే భాగ్యనగరంలో న్యూఇయర్ వేడుకలను చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్నారు. యూత్ పార్టీలతో ఫుల్‌గా ఎంజాయ్ చేశారు. పబ్బులు, రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన న్యూఇయర్ ఈవెంట్లు కలర్ ఫుల్‌గా సాగాయి. హైదరాబాద్ లోని గచ్చిబౌలి, హైటెక్స్, ఎన్ కన్వెన్షన్‌లో న్యూఇయర్ సెలబ్రే షన్స్ గ్రాండ్‌గా జరిగాయి. రాజధానిలో న్యూఇయర్ వేడుకల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో సందడే సందడి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దైవదర్శనానికి భక్తులు బారులు తీరారు. తెల్లవారు జాము నుంచే దేవాలయాల్లో భారీ క్యూలైన్లు కనిపించాయి. తమ ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కొత్త సంవత్సరంలో తమ కోరికలు నెరవేరాలని పూజలు చేశారు. అంతా మంచేజరగాలని భక్తులు కోరుకున్నారు. భద్రకాళి, ధర్మపురి, యాదాద్రి, కొమరవెల్లి మల్లన్న, భద్రాద్రి, బాసర, వేములవాడ ఆలయాలు నూతన సంవత్సర శోభతో కళకళలాడాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి కొలువై ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రికి హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం నాలుగు గంటల పాటు క్యూలో నిలుచున్నారు. భారీ సంఖ్యలో భక్తులు తమ ఇష్టదేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రాజరాజేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాది రాములోరి ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మెదక్ చర్చిలో కూడా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కొత్త సంవత్సర వేడుకలను పురస్కరించుకొని చిలుకూరు బాలాజీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం 10గంటల వరకు సాధారణంగా కనిపించిన భక్తుల సంఖ్య అనంతరం ఒక్కసారిగా పెరిగిపోయింది. నగరంలోని పలు ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ముఖ్యంగా బిర్లా మందిర్‌కు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపారులు ఇలా వివిధ రంగాలకు చెందిన వారంతా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నగరవ్యాప్తంగా ఉన్న పలు ఆలయాల్లో కూడా భక్తుల రద్దీ పెరిగింది. నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో నూతన శోభను సంతరించుకుంది.

స్టాక్‌మార్కెట్లు : ఆరంభంలో లాభాలు

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల అండ



ముంబై : ఏడాది ఆరంభంలో దేశీయ మార్కెట్లు 0.5శాతం లాభాల్లోముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాలతో ట్రేడింగ్ ఆరంభంలో సూచీలు కాస్త తడబడినా.. చివరి గంటల్లో వెల్లువెత్తిన కొనుగోళ్లు మార్కెట్లకు ముందుకు నడిపించాయి. ఫలితంగా సూచీలు లాభాలను దక్కించుకున్నాయి. సెన్సెక్స్ దాదాపు 200 పాయింట్లు ఎగబాకగా.. నిఫ్టీ మళ్లీ 10,900 పాయింట్ల స్థాయిని దాటింది. ఈ ఉదయం సూచీలు ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యస్ బ్యాంకు, ఎస్‌బీఐ, ఐసిఐసీఐ బ్యాంకు షేర్ల అండంతో మార్కెట్లు లాభాల్లో ముగిసాయి. ఐటీ, ఆటోమొబైల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో ఆరంభ ట్రేడింగ్‌లో మార్కెట్లు కాస్త తడబడ్డాయి. ఒక దశలో నష్టాల్లో సాగాయి. అయితే చివరి గంటల్లో బ్యాంకింగ్, వినియోగ రంగాల షేర్లలో కొనుగోళ్ల అండతో సూచీలు కోలుకున్నాయి. లాభాల బాట పట్టాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 186 పాయింట్లు లాభపడి 0.52శాతంతో 36,254 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48 పాయింట్ల లాభంతో 0.44 శాతంతో 10,910 వద్ద ముగిసింది. నిఫ్టీ, నిఫ్టీ ఫైనాన్షి యల్ సర్వీసుల సూచీలు 1శాతం లాభించాయి. బీఎస్ఇ మిడ్‌కాప్ 0.08 శాతం నష్టాల్లో నమోదు కాగా, స్మాల్‌కాప్ 0.41 శాతంతో పెరిగాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 69.65గా కొనసాగుతోంది.

సెక్టరల్ సూచీల్లో, టెలికాం 2శాతంపైగా లాభాల్లో నమోదు కాగా, ఫైనాన్స్, బ్యాంక్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఐటి, టెక్ లాభాల్లో నమోదయ్యాయి. మెటల్, ఆటో, బేసిక్ మెటీరియల్స్, ఎఫ్ఎమ్‌సీజీ నష్టాల్లో నమోదయ్యాయి. భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డిఎఫ్‌సీ, ఎస్‌బీఐ, బీపీసీఎల్, యస్ బ్యాంకు, హెచ్‌డీ ఎఫ్‌సీ బ్యాంకు టాప్ గెయినర్స్ కాగా ఎమ్ అండ్ ఎమ్, టాటా స్టీల్, హిందాల్కో, ఇండియా బుల్స్, హౌసింగ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ మేజర్ లూజర్స్‌గా నమోదయ్యారు. వచ్చేవారం ప్రకటించనున్న కార్పొరేట్ ఫలితాలపై మదుపరులు దృష్టి సారించనున్నట్లు తెలు స్తోంది. 2019లో మొదటి ఆరునెలల్లో మార్కెట్లు తీవ్ర ఊగిసలాటలకు లోనుకావచ్చునని అంచనా... సెన్సెక్స్, నిఫ్టీ 5.91శాతం, 3.15శాతం లాభపడ్డాయి. ఎన్ఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ, ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, భారత్ పెట్రోలియం, భారతీ ఇన్‌ఫ్రా టెల్ షేర్లు లాభపడగా., మహీంద్రా అండ్ మహీంద్రా, హిందాల్కో, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, హిందుస్థాన్ యునిలివర్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టపోయాయి.

అంతర్జాతీయ మార్కెట్లు : ఆసియా, యూరప్ ఫైనాన్షి యల్ మార్కెట్లు మంగళవారం సెలవు ప్రకటించాయి. ఫైనాన్షియల్ క్రైసిస్‌తో అమెరికా మార్కెట్లు అత్యంత హీన మైన సంవత్సరంగా నమోదయ్యాయి. ఎస్ అండ్ పి 500 ఇండెక్స్ 0.9శాతం పెరగగా, నాస్డాక్ కాంపోజిట్ 0.8 శాతం వృద్ధిని నమోదుచేసింది. డౌ 265 పాయింట్లు నమోదు కాగా రస్సెల్ 2000 0.8శాతం లాభాన్ని నమోదు చేసింది. స్టాక్స్ యూరప్ 600 ఇండెక్స్ 0.4 శాతం నమోదు చేసింది.

అంటు వ్యాధులపై అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నగరంలో అంటు వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తత అవసరమని అపోలో ఆసుపత్రికి చెందిన హెమెటో అంకాలజీ, స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్ కన్సల్టెంట్ డా.పద్మజ లోకిరెడ్డి తెలిపారు. వ్యాధి నిరోధకత లోపించిన వారిలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి వారు ప్రాణాంతక వ్యాధుల బారిన సైతం పడే అవకాశం ఉందన్నారు. లుకేమియా రోగులతో పాటు కేన్సర్ వ్యాధికి కీమో థెరపీ చికిత్స తీసుకుంటున్నవారు, దీర్ఘకాలంగా డయాబెటిస్‌తో బాధపడుతున్నవారు, అవయవ మార్పిడి చికిత్స చేయించుకున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

టైర్ల రంగం ఏటా 7-9 శాతం వృద్ధి

ముంబై : టైర్ల డిమాండు ఐదేళ్ల పాటు ఏటా 7-9 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ సానుకూల అంచనాలే నిదర్శనమని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. ఇదే కాలంలో సామర్థ్య విస్తరణపై టైర్ల పరిశ్రమ రూ.20,000 కోట్ల మేర పెట్టుబడులు పెడుతుందని పేర్కొంది. ముడి చమురు ధరలు తగ్గడం, సహజ రబ్బర్ ధరలు స్థిరంగా ఉండడం వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ భాగంలో మార్జిన్లు మెరుగుపడతాయని నివేదికలో పేర్కొంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా ఉండగా, 2021 నాటికి మూడో స్థానానికి చేరుతుందని ఇక్రా అంచనా వ్యక్తం చేసింది. ఏటా 5.9 శాతం చొప్పున ఈ రంగం వృద్ధి చెందుతూ 2026 నాటికి -251.4-282.8 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అభిప్రాయపడింది. కేరళ వరదలు, రుణాల కఠినతరం, బీమాకు సంబంధించి నియంత్రణ పరమైన మార్పులు, వడ్డీ రేట్ల పెరుగుదల, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావం (ఐదేళ్ల బీమా) డిమాండ్‌పై చూపించినప్పటికీ... ఇప్పటి వరకు చూసుకుంటే మొత్తం మీద చాలా విభాగాల్లో అమ్మకాలు బలంగానే ఉన్నాయని, ఇది టైర్ల డిమాండ్ వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందని పేర్కొంది.



పెరిగిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ : కొత్త ఏడాది మొదటి రోజున బంగారం, వెండి ధరలు పైకి ఎగబాకాయి. వినియోగదారుల నుంచి డిమాండు పెరగడంతో ఈరోజు బులియన్ మార్కెట్లో పది గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర రూ.200 పెరిగి రూ.32,470కి చేరింది. అదే బాటలో వెండి ధర కూడా పెరిగింది. కేజీ వెండి ధర రూ.150 పెరిగి రూ.39,250గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి వెండికి డిమాండు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. 2018లో బంగారం ధరలు ఏడాది మొత్తంలో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధరపై రూ.1870 దాకా పెరిగింది. దాదాపు 6.15శాతం పెరిగినట్లు. 2017 డిసెంబరు 30వ తేదీన పది గ్రాముల బంగారం ధర రూ. 30,400గా ఉండగా 2018 చివరకు అది రూ.32,270కి చేరింది. అలాగే 2018లో కేజీ వెండి ధరపై రూ.880 దాకా తగ్గింది. అంటే దాదాపు 2.2శాతం తగ్గింది. 2017 డిసెంబరు 30వ తేదీ నాటికి కేజీ వెండి ధర రూ.39,980గా ఉండగా 2018 చివరకు రూ.39,100కి చేరింది.

రియల్ మీ ఆఫ్‌లైన్ సేల్స్ విస్తరణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌లలో ఒకటైన రియల్ మీ ఈ నూతన సంవత్సరంలో ఆఫ్‌లైన్ సేల్స్‌ను 150 నగరాలకు విస్తరించనున్నట్లు రియల్ మీ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాధవ్ తెలిపారు. యంగ్ బ్రాండ్‌గా రియల్ మీ వినియోగదారులకు అత్యుత్తమైన అనుభూతిని కలిగించేందుకు కట్టుబడి ఉందన్నారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఆదరణ కారణంగా విస్తరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. గతంలో తమ ఉత్పత్తుల అమ్మకం కోసం రిలయన్స్ స్టోర్లతో ఒప్పందం కుదుర్చుకుని, 1300కు పైగా స్టోర్లలో అమ్మకాలు సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 10 నగరాల్లో తమ సేవలను అందిస్తున్నామని, ప్రతి త్రైమాసికానికి 50 నగరాల చొప్పున విస్తరించనున్నామని, అలాగే దేశవ్యాప్తంగా 20 వేలకు పైగా ఔట్‌లెట్లను ఏర్పాటు చేసి అన్నిరకాల స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామన్నారు. రియల్ మీ తన యు1లో 2 లక్షలకు పైగా ఫస్ట్ సేల్ చేసిందని, సెల్ఫీ ప్రోలో 3+32 జీబీ విభాగం అమ్మకాలు అమెజాన్లో పెద్ద ఎత్తున ఆదరణ లభించిందని తెలిపారు.



స్టీల్ వినియోగంలో 7 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : దేశీయ స్టీల్ వినియోగం 2019-20లో 7 శాతానికి పైగా పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టడమే దీనికి కారణమని పేర్కొంది. ముఖ్యంగా అందుబాటు ధరల్లో ఇళ్లు, విద్యుత్ పంపిణీ, రైల్వేలకు 2018-19 బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చినందున, మధ్య కాలంలో దేశీయంగా స్టీల్ వినియోగ వృద్ధి సానుకూలంగా ఉంటుందని, దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధి నమోదవడమే కాకుండా, రానున్న ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో వృద్ధికి అవకాశం ఉంటుందని ఇక్రా అంచనా వేసింది. డిమాండు ఆశాజనకం గానే ఉన్నప్పటికీ... దేశీయ స్టీల్ పరిశ్రమ ఉత్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.5-3 శాతం మధ్యే ఉండొచ్చని, చౌక దిగుమతులే ఇందుకు కారణమని పేర్కొంది. చైనా స్టీల్ డిమాండు మితంగానే ఉండడం, అధిక సరఫరా పరిస్థితులు సమీప కాలంలో ఈ రంగానికి సవాళ్లని అంచనా వేసింది. మరీ ముఖ్యంగా, అంతర్జాతీయ మార్కెట్లో స్టీల్ ధరలు గణనీయంగా తగ్గడంతో దిగుమ తులు చౌకగా మారాయని, ఈ రకమైన దిగుమతులు దేశీయ మార్కెట్‌కు చేరడం మొదలైతే దేశీయంగా ధరలపై అధిక ఒత్తిడి ఉంటుందని పేర్కొంది.

గృహరుణంపై వడ్డీ రాయితీ 2020 మార్చి వరకూ పొడిగింపు



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద మధ్యాదాయ వర్గాల (ఎంఐజీ) వారికి ఇస్తున్న క్రెడిట్ లింక్డ్ సబ్సిడీని (సీఎల్ఎస్ఎస్) 2020 మార్చి వరకు పొడిగిస్తున్నట్టు కేంద్ర మంత్రి హర్‌దీప్ పూరి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సంతకాలు కూడా జరిగాయి. ఈ పథకం కింద గృహ రుణం తీసుకున్న వారికి రూ.2.67 లక్షల వరకు వడ్డీ సబ్సిడీని ఇస్తారు. డిసెంబర్ 30 నాటికి 3,39,713 మంది లబ్ధిదారులు సీఎల్ఎస్ఎస్‌ను వినియోగించుకున్నట్టు మంత్రి తెలి పారు. తొలుత వడ్డీ రాయితీతో కూడిన రుణ పథకాన్ని 2017 డిసెంబరు వరకు ఏడాది కాల పరిమితితో కేంద్రం తీసుకొచ్చింది. నూతన నిర్మాణం, తిరిగి కొనుగోలు చేసే గృహాలపైనా దీన్ని పొందేందుకు వీలు కల్పించింది. ఆ తర్వాత దీన్ని 2019 మార్చి వరకు పొడిగించింది. తాజాగా దీన్ని మరో ఏడాది పొడిగించేందుకు నిర్ణయించింది. వార్షికంగా రూ.6-12 లక్షల మధ్య ఆదాయం కలిగిన వారు 20 ఏళ్ల కాలానికి సంబంధించి రూ.9 లక్షల రుణం మొత్తంపై 4 శాతాన్ని రాయితీగా పొందొచ్చు. రూ.12-8 లక్షల మధ్య ఆదాయం ఉన్న వారికి వడ్డీ రాయితీ మూడు శాతమే లభిస్తుంది.

చలి పంజా...!

- కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- అర్లి-టీ, మెదక్‌ల్లో వందేళ్ల రికార్డు
- మరో ఐదురోజులూ గజగజే

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో చలి పులి పంజా విసిరింది. ఉత్తర, ఈశాన్య భారతం నుంచి వీస్తోన్న అత్యంత శీతల గాలుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. దీంతో గతంలో అత్యల్ప ఉష్ణోగ్రతల రికార్డులన్నీ చెరిగిపోతున్నాయి. పెథాయ్ తుపాను తర్వాత ఆదిలాబాద్ జిల్లా ఈ శీతాకాలంలో మరో కాశ్మీర్‌ను తలపిస్తోంది. భీంపూర్ మండలం అర్లి-టి గ్రామంలో వందేళ్లలో లేనంత స్థాయిలో తెల్లవారు జామున 2.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమో దైంది. ఇక్కడ డిసెంబరు 27న 3.5 డిగ్రీలు నమోదు కాగా తాజాగా ఆ కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు చెరిగిపోయింది. ఇక, మెదక్‌లోనూ అత్యల్ప ఉష్ణోగ్రత 5.8 డిగ్రీలుగా నమోదైంది. మెదక్‌లోనూ గత వందేళ్లలో లేనంత కనిష్ఠ ఉష్ణోగ్రత ఇదే కావడం విశేషం. ఇక్కడ, 1979లో వాతావరణ నమోదు కేంద్రం ఆరంభించిన తరవాత 2017, డిసెంబరు 20న అత్యల్ప ఉష్ణోగ్రత 6.8 డిగ్రీలుగా నమోదైంది. ఉత్తరాది నుంచి వీచే చలిగాలుల ప్రభావం ఆదిలాబాద్ జిల్లాల్లో తీవ్రంగా ఉంది. దక్షిణాదికి ముఖద్వారంలా ఉండటంతో శీతలగాలుల ప్రభావం అక్కడ అత్యధికంగా ఉంటోంది. ఆదిలాబాద్ మండలం కేంద్రంలో 3.1, బేలలో 3.4, తలమడుగు, జైనథ్ మండలాల్లో 4.11 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో విద్యా సంస్థల పనివేళల్లో కూడా మార్పు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పాఠశాలలు పనివేళలను మార్పు చేస్తూ అధికార యంత్రాంగం ఉపశమన చర్యలు తీసుకుంది. ఉత్తర తెలంగాణలో గడ్డకట్టే స్థాయి చలికి ప్రజలను ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కుమరం భీం జిల్లా గిన్నెధారిలో 3.1, సిర్పూరులో 3.2, లింగాపూర్‌లో 4, ఆదిలాబాద్ జిల్లా బేలలో 3.4, రాంనగర్‌లో 4.1, ఆదిలాబాద్‌లో 3.7, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 3.4, సంగారెడ్డి జిల్లా అల్గోల్‌లో 4.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ రాత్రిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. సాయంత్రమైతే చాలు జనం బయటకు రావడానికి వణుకుతున్నారు. విశాఖ మన్యంపై చలి పంజా విసిరింది. చింతపల్లిలో 1.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత్త నమోదైంది. చలితో గిరిజనులు



గజగజ వణుకుతున్నారు. పాడేరు, అరకు, రంప చోడవరంలోనూ సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలికి తట్టుకోలేక నెల వయసున్న పసికందు మృతిచెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టిలో చోటుచేసుకుంది. కంగ్టికి చెందిన అమృత్, సావిత్రి దంపతులకు ముగ్గురు ఆడపిల్లల తరువాత నెల కిందట కుమారుడు జన్మించాడు. చలిగాలులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడ్డ ఆ శిశువు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తక్షణమే ఆ చిన్నారిని హైదరాబాద్ లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శిశువు మృతిచెందినట్లు తల్లిదండ్రులు చెప్పారు.

రైల్వేబోర్డ్ చైర్మన్‌గా వినోద్ బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : భారత రైల్వే బోర్డు చైర్మన్‌గా వినోద్ కుమార్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో మంగళవారం వినోద్ బాధ్యతలు చేపట్టారు. రైల్వే ప్రయాణికుల భద్రత, రైల్వే అభివృద్ధిపై దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. బుల్లెట్ రైళ్లను పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు. సోమవారం వరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా వినోద్ కుమార్ యాదవ్ బాధ్యతలు నిర్వర్తించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎంను రైల్వే బోర్డు చైర్మన్‌గా నియమించడం ఇదే ప్రథమం. బోర్డ్ చైర్మన్ పదవితో పాటు భారత ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా ఆయన నియమితులయ్యారు. వినోద్ కుమార్ 1980వ బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే సర్వీస్ అధికారి. రైల్వేతో పాటు భారత ప్రభుత్వ పరిశ్రమల శాఖ, రైల్ వికాస్ నిగమ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఆయన పనిచేశారు. రైల్వే బోర్డు చైర్మన్‌గా ఉన్న అశ్వినీ లోహాని సోమవారం పదవీ విరమణ చేయడంతో వినోద్ కుమార్ బోర్డ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.



సరైన నిర్వహణ పద్ధతులతో

చౌడు నేలల్లోనూ అధిక దిగుబడులు

చౌడు నేలల్లో రైతు పెట్టిన పెట్టుబడులకు సరైన లాభాలతో దిగుబడులను ఇచ్చేది వరి పంట ఒక్కటే. చౌడు భూముల్లో వరి పంట సాగుచేసేటప్పుడు సరైన నిర్వహణ పద్ధతులు పాటిస్తే ఈ నేలల నుంచి కూడా మంచి దిగుబడులు పొందవచ్చు. రబీలో ఎలాంటి వరి రకాలను చౌడు భూముల్లో సాగుచేస్తే ఆశించిన లాభాలు వస్తాయనే విషయాలపై శాస్త్రవేత్తల సూచనలు ఈ విధంగా ఉన్నాయి.



చౌడును తట్టుకునే వరి రకాలు :

- 101, 103, స్వర్ణ, చైతన్య, దీప్తి, వికాస్, సీఎస్ఆర్-13, స్వర్ణముఖి, వేదగిరి, ఎంటీయూ 1001 (విజేత), ఎంటీయూ 1061 (ఇంద్ర), ఎంటీయూ 1010 (కాటన్‌దొర సన్నాలు) రకాలు కొంతవరకు చౌడును తట్టుకోగలవు.

విత్తన మోతాదు ఎక్కువే ఉండాలి :

- ఈ భూముల్లో విత్తనం సరిగా మొలక రాదు. ఈ కారణంగా సూచించిన విత్తన మోతాదు కన్నా ఎక్కువ అనగా ఎకరానికి 35 కిలోల చొప్పున విత్తనాన్ని నారుమడికి వాడాలి.

విత్తనశుద్ధి అవసరం :

- విత్తనశుద్ధిని ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండిజమ్ చొప్పున విధిగా కలపాలి.

ముదురు నారుమడినే ఉంచుకోవాలి :

- 30-35 రోజుల వయసుగల ముదురు నారునే పంట పొలంలో నాటుకోవాలి. ఈ ముదురు నారుకు లవణాలను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటుంది.

నీటి యాజమాన్యం ఇలా :

- జిప్సం, సూపర్ ఫాస్పేట్ ఎరువులను దమ్ములో వేసి వారం రోజులు నీరు నిల్వ కట్టాలి. మురుగు కాలువల ద్వారా నీటిని బయటకు తీసివేయాలి. కొత్తనీరు పెట్టుకోవాలి.

అనుకూలమైన వరి రకాలు ఎంచుకోవాలి

సూక్ష్మ పోషకాల నివారణ ఇలా :

- ఈ నేలల్లో ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు జింక్, ఇనుము, మాలిబ్డినం తక్కువ శాతంలో ఉంటాయి. వీటి లోప లక్షణాలు పంటమీద వెంటనే కనిపిస్తాయి. ప్రధానంగా ఈ నేలలో వేసిన వరిలో ఎక్కువ నారుమడుల్లో ఇనుప ధాతు లోపం కనిపిస్తాయి. నారుమడిలోని ఇనుపధాతు లోప నివారణకు ఒక లీటరు నీటికి 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ లేదా ఫెర్రస్ అమ్మోనియం సల్ఫేట్, దీనికి 0.75 గ్రాముల సిట్రిక్ కలిపి పిచికారీ చేయాలి. ఒకసారి ఎకరాకు 20 కిలోల ముడి జింక్‌ను ఆఖరి దమ్ములో వేసుకోవాలి. దమ్ములో వేసుకోలేనప్పుడు వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు రెండు శాతం జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలి.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- ఇలాంటి భూముల్లో వేసవి దుక్కులు వేయకూడదు.
- వరినాట్లు దగ్గరదగ్గరగా వేసుకోవాలి.
- పంటకాలంలో నేలను ఆరబెట్టరాదు.
- ఆరబెడితే నేల ఎండినప్పుడు నేలలోని లవణాలు నీటి ద్వారా పైకి రావడం వల్ల పంట పెరుగుదల దెబ్బతింటుంది.
- ఈ భూముల్లో నత్రజనిని అందించే ఎరువులు యూరియా, అమ్మోనియం సల్ఫేట్ రూపాల్లో ఫాస్ఫేట్ మూలకాన్ని సూపర్ ఫాస్ఫేట్ రూపంలో అందించాలి.
- ఈ భూముల్లో వేసిన వరికి చీడపీడలు ఎక్కువగా ఆశిస్తూ ఉంటాయి. జాగ్రత్తగా పంటను పరిశీలించి, ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడులు పొందవచ్చు.

పురుగు, తెగులు మందులు

మోతాదు మించి వాడొద్దు

అపరాల సాగులో కొంతమంది రైతులు కలుపు మందులతో పాటు పురుగుమందులు, తెగులు మందులను కలిపేసి వాడుతుంటారు. అలా చేస్తే ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు చేతికి అందకపోయే ప్రమాదం ఉంది. నిర్ణీత మోతాదులో కాకుండా అధిక మోతాదులో మందులను వాడినా ఆశించిన రీతిలో దిగుబడులు రాకపోగా, నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాలపై శాస్త్రవేత్తల సూచనలు ఈ విధంగా ఉన్నాయి.



- అపరాల పంటపై మిక్సింగ్ పిచికారీతో నష్టపోయే ప్రమాదం
- అవగాహనతోనే అధిక దిగుబడులు సాధ్యం

మోతాదుకు మించి వాడితే నష్టమే

మాగాణి భూముల్లో మినుము ఆకు విచ్చుకునే దశ నుంచి పూత దశల్లో ఉంది. తమ పక్కన వాడుతున్న రైతులను అనుసరించి కొందరు రైతులు కలుపు మందుల్ని రెండు, మూడు రకాలు కలిపి పైరుపై స్ప్రే చేసేస్తున్నారు. మోతాదుకు మించి కూడా వాడుతున్నారు. దానివల్ల ఆకులు వడలిపోవడం, ఎండిపోవడం కూడా జరుగుతోంది. మరికొంతమంది రైతులు కలుపు మందులతో పాటు పురుగుమందులు, తెగులు మందుల్ని కలిపి వాడటం వల్ల పైరులో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి.

పాటించాల్సిన సూచనలు

పైరుపై కలుపు మందును పిచికారీ చేయాలనుకున్నప్పుడు ఏదో ఒక మందును వ్యవసాయ శాస్త్రవేత్తలు లేక స్థానిక వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎంచుకోవాలి. కలుపును కూలీలతో తీయించుకోవచ్చు. ఎక్కువగా కలుపు ఉండటం వల్ల కూలీల ఖర్చు అధికమవుతుందని అనుకుంటే కలుపు నివారణ మందులనే పిచికారీ చేసుకోవాలి. దుకాణదారులు తమ మందుల అమ్మకం కోసం సూచించే కలుపు మందులను వాడితే నష్టపోతారు. కలుపు మందులు వాడేటప్పుడు ఏ విధమైన ఇతర మందులనూ కలపకూడదు. మోతాదుకు మించి కలుపు మందులను వాడినా పైరుకు దెబ్బే. పైరు 30-50 రోజుల మధ్య నీటి లభ్యతను బట్టి ఒకటి లేక రెండు తడులు పెట్టాలి. లేదా రెండు శాతం యూరియా లేదా ఒక శాతం పొటాషియం నైట్రేట్ లేదా ఒకశాతం 19-19-19 ద్రావణాన్ని పిచికారీ చేయాలి. వీటిని స్ప్రే చేసేటప్పుడు ఏ విధమైన ఇతర మందులను వాడరాదు.

లద్దె పురుగు ఆశిస్తే భారీ నష్టం

అపరాల సాగులో పొగాకు లద్దె పురుగు వల్ల నష్టం అధికంగా ఉంటుంది. ఈ పురుగు వల్ల పైరుకు అపార ననష్టం వాటిల్లడంతో రైతుకు ఆశించిన రీతిలో దిగుబడులు అందకుండా పోతున్నాయి. దీని నివారణకు సంబంధించి శాస్త్రవేత్తల సూచనలు ఈవిధంగా ఉన్నాయి.



సర్వం హరించే లద్దెపురుగు

ఈ పురుగు ఆకుల కింది భాగంలో గుడ్లను సముదాయంగా పెట్టుకుని, రక్షణగా వెంట్రుకలతో కప్పివేస్తుంది. గుడ్ల నుంచి వెలువడిన లద్దె పురుగులు గుంపులుగా ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల్లోని పత్రహరితాన్ని గోకి తినేస్తాయి. దీనివల్ల తెల్లగా జల్లెడగా ఆకులు మారిపోతాయి. పెద్ద పురుగులు అయిఏ ఏకంగా ఆకుల్ని పూర్తిగా కొరికి తినేస్తాయి. ఈ పురుగులు పూత, పిందెలు, కాయల్ని కూడా తినేస్తాయి. లద్దె పురుగులు పగటిపూట నెర్రెల్లో ఉండి రాత్రిపూట మాత్రమే బయటకు వచ్చి, పైరుకు నష్టం చేకూరుస్తాయి.

నివారణ చర్యలివి

ఈ పురుగు నివారణకుగాను గుడ్ల సముదాయంతో ఉన్న ఆకులను గుర్తించి, వాటిని తొలగించి, నాశనం చేయాలి. పురుగు తొలి దశలో మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ ఒక గ్రామును లీటరు నీటిల కలిపి పిచికారీ చేయాలి. పెద్ద పురుగు ఉండి, వీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు విషపు ఎరను ఉపయోగించాలి. దానికిగాను 5 కిలోల తవుడులో అరకిలో బెల్లంతో పాటు అర లీటరు మోనోక్రోటోఫాస్ లేదా అర కిలో కార్బరిల్‌ను సరిపడా నీటితో కలిపి ముద్దగా చేయాలి. దానిని చిన్నచిన్న ఉండలుగా చేసుకుని, మొక్కల మొదళ్ల దగ్గర ఉంచితే పెద్ద పురుగులను నివారించవచ్చు.

వెండితెరపై సంక్రాంతి సందడి



కాల గమనంలో మరో ఏడాది కరిగిపోగా, సరికొత్త ఆశలతో, ఆశయాలతో మరో సంవత్సరం ముందుకొచ్చింది. జనవరి ఫస్టు వచ్చిందంటే, వెను వెంటనే గుర్తొచ్చేది తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి. రంగవల్లికలు.. కోడి పందేలు.. హరిదాసు సంకీర్తనలు.. కొత్త అల్లుళ్ల కేరింతలు.. ఇలా ఎన్నో సరదాలనూ, సంతోషాలనూ పంచుతుంది సంక్రాంతి. ప్రజలకే కాదు.. తెలుగు చిత్ర పరిశ్రమకు కూడా ఇదే పెద్ద పండగ. తెలుగువారికి సంక్రాంతి సరదాలలో కొత్త సినిమా ఎప్పుడో చేరిపోయింది. మరి అలాంటి సంక్రాంతికి ఈసారి వెండితెరపై సందడి చేయబోతున్న చిత్రాలేంటో ఓసారి చూద్దామా!

'యన్‌టిఆర్'తో తొలి అడుగు!

తెలుగువారి అభిమాన నటుడు నందమూరి తారకరామారావు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో ఆయన చేయని పాత్రలేదంటే అతిశయోక్తికాదు. ఈసారి సంక్రాంతికి బాలకృష్ణ రూపంలో ఎన్టీఆర్ మన ముందుకు రాబోతున్నారు. ఎన్టీఆర్ జీవిత కథ ఆధారంగా బాలకృష్ణ టైటిల్‌రోల్ పోషిస్తున్న చిత్రం 'యన్.టి.ఆర్.' క్రిష్ దర్శకుడు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం 'కథానాయకుడు' జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎన్టీఆర్ సినీ రంగ ప్రవేశం నుంచి ఆయన ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే వరకూ జరిగిన సంఘటనలకు క్రిష్ దృశ్యరూపం ఇవ్వనున్నారు. ఎన్టీఆర్ బయోపిక్ కావడం ఒక ఎత్తయితే, ఇందులో చిత్ర పరిశ్రమలోని ఎంతోమంది నటులు పలు పాత్రల్లో తళుక్కున మెరవనుండటం మరొక ఎత్తు. చంద్రబాబుగా రానా, అక్కినేని నాగేశ్వరరావుగా సుమంత్, హరికృష్ణగా కల్యాణ్‌రామ్, రేలంగి పాత్రలో బ్రహ్మానందం, సావిత్రిగా నిత్యామేనన్, శ్రీదేవిగా రకుల్ ప్రీత్ సింగ్, జయసుధగా పాయల్ రాజ్‌పుత్, కె.వి.రెడ్డిగా క్రిష్, దాసరి నారాయణరావుగా చంద్ర సిద్ధార్థ నటిస్తుండగా, ఎన్టీఆర్ సతీమణి బసవతారకం పాత్రలో విద్యాబాలన్ అలరించేందుకు సిద్ధమయ్యారు.



ఇప్పటికే విడుదల చేసిన టీజర్, ట్రైలర్‌లకు విశేష స్పందన వస్తోంది. ఈ సినిమాకు కీరవాణి సంగీత దర్శకులు.

సాఫ్ట్ టైటిల్‌తో మాస్ హీరో!

హీరోకు మాస్ ఇమేజ్ తీసుకొచ్చే దర్శకుల్లో బోయపాటి శ్రీనివాస్ ఒకరు. తన రెండో చిత్రం 'మగధీర'తోనే మాస్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న యువ కథానాయకుడు రామ్‌చరణ్. వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం 'వినయ విధేయ రామ'. కియారా అద్వాణీ కథానాయిక. వివేక్ ఒబెరాయ్ ప్రతినాయకుడు. ప్రశాంత్, ఆర్యన్ రాజేష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జనవరి 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టైటిల్ చూసి సాఫ్ట్‌గా ఉందనుకున్న వారు ట్రైలర్ చూసి షాకయ్యారు. రామ్‌చరణ్‌ను మెగా అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో ఆ స్థాయిలో సినిమాలో చూపించబోతున్నట్లు ట్రైలర్‌ను చూస్తేనే అర్థమవుతోంది. టీజర్, ట్రైలర్లలో రామ్‌చరణ్ యాక్షన్ సన్నివేశాలు, డైలాగ్‌లు అభిమా నులను విశేషంగా ఆకట్టుకుం టున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ప్రధాన ఆకర్షణ.








వరుణ్ వెంకీల ఫన్.. ఫ్రస్ట్రేషన్

కథా నచ్చితే మరో కథానాయ కుడితో తెర పంచుకునేందుకు ఎప్పుడూ ముందుండే హీరో వెంకటేష్. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'గోపాల గోపాల' చిత్రాలతో ఈ విషయాన్ని చెప్పకనే చెప్పారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరిద్దరు కలిసి నటించిన చిత్రమే 'ఎఫ్2': ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్. తమన్నా, మెహరీన్ కథానాయికలు. అనిల్ రావిపూడి దర్శకుడు. 'సంక్రాంతి అల్లుళ్లు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌ను చూస్తే, సినిమాను ఆద్యంతం నవ్వులు పంచేలా తీర్చిదిద్దినట్లు అర్థమవుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు.

రజనీ అభిమానులకు డబుల్ ధమాకా!


2018లో '2.ఓ'తో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న అగ్ర కథానాయకుడు రజనీకాంత్. తలైవా చిత్రం ఎప్పుడు విడుదలవుతుందా? అని ఎదురు చూసే అభిమానులకు 'పేట'తో అటు సంక్రాంతి, ఇటు రజనీ చిత్రంతో డబుల్ కా మీటా అందినట్లయింది. 'పిజ్జా', 'జిగర్తాండ' వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన యువ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రజనీ నటిస్తుండటం విశేషం. విజయ సేతు పతి, సిమ్రన్, త్రిష కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

అజిత్ 'విశ్వాసం'



తమిళ ప్రేక్షకులతో పాటు, తెలుగువారికి సుపరిచితుడైన నటుడు అజిత్. ఇటీవల ఆయన నటించిన చిత్రాలు తెలుగులోనూ విడుదలవుతున్నాయి. శివ దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం 'విశ్వాసం'. నయనతార కథానాయిక. జగపతిబాబు ప్రతినాయ కుడు. కాగా, ఇటీవల విడుదల చేసిన తమిళ ట్రైలర్‌కు విశేష స్పందన వస్తోంది. ఈ చిత్రం తమిళనాట జనవరి 10న విడుదల కానుంది. తెలుగులో ఈ సినిమా విడుదలపై ఇంకా స్పష్టత రాలేదు. కానీ సంక్రాంతి బరిలో ఉందనే సినీ వర్గాలు చెబుతున్నాయి.

నాని..'జెర్సీ' ఫస్ట్‌లుక్ విడుదల



నేచురల్‌స్టార్ నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'జెర్సీ'. గౌతమ్ తిన్ననూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కాగా.. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఈరోజు విడుదల చేశారు. నాని తెలుపు రంగు జెర్సీలో క్రికెట్ ఆడి బాగా అలసిపోయి కూర్చున్నట్లుగా కన్పించారు. ఇందులో ఆయన జి.అర్జున్ అనే క్రికెటర్ పాత్రలో నటిస్తున్నారు. 1990ల కాలం నేపథ్యంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

'36 ఏళ్ల వయసులో క్రికెట్ రంగంలో నిరూపించుకోవడానికి అతని వద్ద ఏమీ లేదు. కలల్ని, ఆశయాల్ని వదులుకోవాల్సి వచ్చింది. 1996-97లో రంజీ ట్రోఫీ సీజన్‌లో అతను ఆడినప్పుడు బ్యాటింగ్ పట్ల అతనికున్న ఆసక్తి బయటపడింది' అని పేర్కొంటూ లుక్‌ను పంచుకున్నారు నాని. ఇందులో నానికి జోడీగా శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. 'దేవదాస్' తర్వాత నాని నటిస్తున్న చిత్రమిది.



వెరైటీ పోస్టర్‌తో 'బ్రోచేవారెవరురా'

ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి.. ఊళ్ళోవారందరి దిష్టి ఈ 2019లో ఎవ్వరికి తగలకూడదని ఆశిస్తూ శుభంభూయాత్ !! అంటూ ఓ వెరైటీ పోస్టర్ విడుదల చేశారు. బ్రోచేవారెవరురా టీం. మెంటల్ మదిలో వంటి చిత్రాన్ని తెరకెక్కించిన వివేక్ ఆత్రేయ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా ఇందులో శ్రీ విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. చిత్రంలో నివేదా థామస్ .. నివేదా పేతురాజ్ కథానాయికలుగా నటించనున్నారు. సత్యదేవ్ .. ప్రియదర్శి .. రాహుల్ రామకృష్ణ ఈ సినిమాలో ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన కాన్సెప్ట్ తో రూపొందుతోన్న ఈ సినిమా, అన్నివర్గాల ప్రేక్షకులకు ఆకట్టుకుంటుందని టీం చెబుతుంది. అయితే టైటిల్ పోస్టర్‌ని బట్టి చూస్తుంటే సినిమా ఖచ్చితంగా వినూత్నంగా ఉంటుందని ప్రేక్షకులు భావిస్తున్నారు. బ్రోచేవారెవరురా అనే చిత్ర టైటిల్‌కి 'చలనమే చిత్రము .. చిత్రమే చలనము' అనేది ట్యాగ్ లైన్‌గా ఉంచారు. ఈ చిత్రంపై పూర్తి డీటైల్స్ త్వరలోనే రానున్నాయి.

తిరువారూర్ ఉప ఎన్నికలో స్టాలిన్ పోటీ?



చెన్నై : తమిళనాడులోని తిరువారూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గతేడాది ఆగస్టు 7న డీఎంకే నేత, తిరువారూర్ ఎమ్మెల్యే కరుణానిధి మరణించగా ఆ సీటు ఖాళీ అయింది. సిట్టింగ్ స్థానం దక్కించుకోవడానికి డీఎంకే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో పోటీ చేయాలంటూ స్టాలిన్‌పై సీనియర్లు, నేతలు ఒత్తిడి తెస్తున్నారు. సులువుగా గెలిచే సీటు కావడంతో అక్కడ గెలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపవచ్చని సీనియర్ నేతలు ఆశిస్తున్నారు. ప్రస్తుతం డీఎంకే చీఫ్ స్టాలిన్ చెన్నైలోని కోళత్తూర్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. స్టాలిన్ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఓఎస్‌డీ కుమార్‌పై క్రమశిక్షణ చర్యలు : రైల్వేశాఖ నిర్ణయం



న్యూఢిల్లీ : రైల్వే మంత్రి పియూష్ గోయల్‌ను అవమానించడమే కాకుండా ప్రభుత్వ సీనియర్ అధికారుల విజ్ఞతను ప్రశ్నించే విధంగా వ్యాసం రాసిన ఓఎస్‌డీపై రైల్వేశాఖ మండిపడింది. ఆయనపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు డీఓపీటీకి లేఖ రాసింది. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఓఎస్‌డీ; ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్ (ఐఆర్‌పీఎస్) 2005 బ్యాచ్ అధికారి సంజీవ్‌కుమార్‌ను తక్షణమే తమ పరిధిలోకి పంపాల్సిందిగా డీఓపీటీ శాఖకు రాసిన లేఖలో రైల్వే బోర్డు కార్యదర్శి రజనీష్ సహాయ్ కోరారు.'ఐఆర్‌పీఎస్ సంజీవ్ కుమార్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు రైల్వేబోర్డు దృష్టికి వచ్చింది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ రైల్‌సమాచార్.కామ్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ నేషనల్ వీల్స్. కామ్'లలో ప్రచురితమైన వ్యాస్యాన్ని సంజీవ్ కుమార్ రాశారు. ఈ వ్యాస్తం ఏ మాత్రం రుచించకపోగా, సీనియర్ల విజ్ఞతను ప్రశ్నించేలా ఉంది. రైల్వేశాఖ మంత్రి పియూష్ గోయల్‌ను అవమానించేలా ఉంది. కాబట్టి కుమార్‌పై తగిన చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందుకు రైల్వేబోర్డు చైర్మన్ కూడా అంగీకరించారు' అని సహాయ్ తన లేఖలో పేర్కొన్నారు.

విలక్షణ నటుడు ఖాదర్‌ఖాన్ ఇకలేరు

కెనాడాలో కన్నుమూత... అంత్యక్రియలూ అక్కడే



ముంబై : బాలీవుడ్ సీనియర్ నటుడు, రచయిత ఖాదర్ ఖాన్ (81) ఇకలేరు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కెనడాలో తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు ఖాదర్ ఖాన్ కుమారుడు సర్ఫరాజ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులందరూ కెనడాలోనే ఉన్నందున అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు. 'డిసెంబరు 31 సాయంత్రం ఆరు గంటలకు మా తండ్రి కన్నుమూశారు. చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 16-17 వారాలుగా ఆసుపత్రిలో ఉన్నారు. పరిస్థితి విషమించి శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కెనడాలోనే అంత్యక్రియలు జరుపుతామ'ని పీటీఐ వార్తా సంస్థతో సర్ఫరాజ్ చెప్పారు. ఖాదర్ ఖాన్ మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ సంతాపం ప్రకటించారు. తన అద్భుత నటనతో వెండి తెరకు మరింత మెరుగులు దిద్దారని మోడీ పేర్కొన్నారు. రచయితగా కూడా గొప్ప సినిమాలు అందించారని కొనియాడారు. ఖాదర్ ఖాన్ మరణ వార్త కలచివేసిందని అమితాబ్ అన్నారు. గొప్ప ప్రతిభావంతుడిని కోల్పోవడం బాధాకరమని ట్వీట్ చేశారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన దో ఔర్ దో పాంచ్, ముకద్దర్ కా సికిందర్, మిస్టర్ నట్వర్‌లాల్, సుహాగ్, షహేన్‌షా సినిమాలు ఘన విజయం సాధించాయి. ఆఫ్ఘనిస్థాన్ కాబూల్‌లో జన్మించిన ఖాదర్ ఖాన్ 1973లో వచ్చిన 'దాగ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. 300లకు పైగా చిత్రాల్లో నటించారు. 250పైగా సినిమాలకు మాటలు రాశారు. మాటల రచయితగా ఆయన మొదటి సినిమా 'జవానీ దివానీ'. హాస్య పాత్రలకు పేరు గాంచిన ఖాన్.. దర్శకుడు డేవిడ్ ధావన్ సినిమాల్లో ఎక్కువగా నటించారు. అమితాబ్‌తో పాటు రాజేశ్ ఖన్నా, జితేంద్ర, ఫిరోజ్ ఖాన్, అనిల్ కపూర్, గోవిందా తదితర ప్రముఖ నటులతో కలసి ఆయన నటించారు. కడుపుబ్బ నవ్వించే కామెడీ, సాఫ్ట్ విలనీ పండించడంలో మంచి పేరు తెచ్చుకున్నారు. 'బోల్ రాధా బోల్', 'ఖూన్ భరి మాంగ్', 'బీవీ హో తో ఐసీ', 'మై ఖిలాడి తూ అనారీ', 'జుడ్వా', 'దుల్హే రాజా', 'హసీనా మాన్ జాయేగి' వంటి పలు బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించారు. చివరిగా 2015లో హో గయా దిమాగ్ కా దహి' చిత్రంలో నటించారు.

రాష్ట్రపతి సంతాపం

ఖాదర్ ఖాన్ మృతికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతాపం తెలిపారు. భారత సినీ పరిశ్రమకు ఖాదర్ ఖాన్ విశిష్ట సేవలందించారని రాష్ట్రపతి ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. కామిక్ పాత్రల నుంచి విలన్ పాత్రల వరకూ ఖాదర్ ఖాన్ ఎంతో ప్రత్యేకత కనబరచే వారని, రచయితగా కూడా చక్కటి చిత్రాలకు పని చేశారని రాష్ట్రపతి గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అసోం ఎన్‌ఆర్‌సీకి

30 లక్షల మంది తిరిగి దరఖాస్తు




గువహాటి : జాతీయ పౌర నమోదు(ఎన్‌ఆర్‌సీ) నవీకృత తుది ముసాయిదాలో గల్లంతయిన 40.7 లక్షల మంది ప్రజలకుగాను సోమవారం సాయంత్రానికి దాదాపు 30 లక్షల మంది చేర్పు కోసం తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. ఐదు నెలల క్రితం అసోం ఎన్‌ఆర్‌సీ ప్రచురితమయ్యింది. సోమవారం(డిసెంబరు 31న) వాదనలు, అభ్యంతరాలు ముగిశాయి. తుది లెక్కింపు, పూర్తి వివరాలు మంగళవారం ఉదయానికి తెలిసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ దశలో ముసాయిదాలో చేర్చబడిన ఇతరుల పౌరసత్వంపై సందేహాలు వ్యక్తం చేస్తూ 600 అభ్యంతరాలు వచ్చాయి. సెప్టెంబరు 25న ప్రచురితమైన పూర్తి ముసాయిదా నుంచి మినహాయించిన 3.29 కోట్ల మందికిగాను 40.07 లక్షల మందికి మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే డిసెంబరు 15తో ముగిసింది. కానీ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సుప్రీంకోర్టు, డిసెంబరు 31 వరకు తుది గడువును పొడిగించింది. అటుతర్వాత అసోం ప్రభుత్వం మాట్లాడుతూ డిసెంబరు 5, 9 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజలు, అధికారులు విలువైన సమయాన్ని కోల్పోయారని పేర్కొంది. ఎన్‌ఆర్‌సీ అధికారులు మాట్లాడుతూ గత రెండు వారాలుగా దరఖాస్తుల సంఖ్య పెరిగిందన్నారు. ఆదివారం నాటికి పూర్తి ముసాయిదా నుంచి మినహాయించిన 30 లక్షల మంది దరకాస్తు చేసుకున్నారని తెలిపారు. సోమవారం మరిన్ని దరఖాస్తులు రావడంతో తిరిగి దరఖాస్తు చేసుకున్నది 75 శాతంగా ఉన్నట్లు వారు వివరించారు.

గువహాటికి చెందిన కార్యకర్త ఎ.బి.ఖంద్కార్ మాట్లాడుతూ కేంద్రం జారీ చేసిన ప్రామాణిక కార్యాచరణ విధానం నుంచి ఒక నిబంధనను తొలగించిన తర్వాత దరఖాస్తుల సంఖ్య పెరిగిందన్నారు. కాగా 2015, ఆగస్టు 31 తర్వాత పొందిన ధ్రువీకరణ పత్రాలు అంగీకరించబడవని ఆ నిబంధన పేర్కొంది. 'అయితే ఆ నిబంధనను తొలగించడంతో ఇతరులకు తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది. దీని అర్థమేమిటంటే, తుది ముసాయిదాలో తిరస్కరించబడిన వాస్తవ దరఖాస్తులో వీరు తమ పూర్వీకులుగా పేర్కొనడం నుంచి దరఖాస్తుదారులు వ్యక్తిని మార్చలేరని ఆయన వివరించారు. సైబర్ కేఫ్‌లు, లేదా ఎన్‌ఆర్‌సీ సేవా కేంద్రాలపై ఆధారపడిన నిరక్షరాస్యుల్లో కొన్ని కేసుల్లో ఇతరులకు వారసత్వంగా ఇతరులతో సంబంధం కలిగిన అదే వారసత్వం కలిగిన వ్యక్తిని ఉపయోగించారు. అయితే కొన్ని కేసుల్లో మోసపూరితంగా వ్యవహరించగా, అనేక కేసుల్లో మాత్రం అదే ప్రాంతానికి చెందిన లేదా ఒక పేరు కలిగిన వారసత్వం వ్యక్తి వినియోగించారు. కాగా శరణార్థి సర్టిఫికెట్ సహా ఇతర ధ్రువీకరణ పత్రాలు, 1971, మార్చి 24 వరకు ఉన్న ఓటరు జాబితా, 1951 ఎన్‌ఆర్‌సీలో ఎవరైతే ఒక వారసత్వ వ్యక్తి ఉన్నారో అది నవీకరించబడుతుంది.

సిల్చార్‌లోని కార్యకర్త, న్యాయవాది ధర్మానంద దేవ్ మాట్లాడుతూ 'వాదనలు, అభ్యంతరాలకు సంబంధించి అవగాహన కార్యక్రమం లేదా ప్రచారం కొరవడటం గుర్తించడం జరిగింది. ఇక క్షేత్రస్థాయిలోని అధికారుల్లో అత్యధికులకు కోర్టు ఆదేశాల పట్ల నిర్లక్ష్యం కనబరించారు. అనేక ఎన్‌ఆర్‌సీ సేవా కేంద్రాల్లో పత్రాలు తిరస్కరించడం అసాధారణంగా ఉంది' అని తెలిపారు. వాదనలు, అభ్యంతరాల ప్రక్రియ తర్వాత ఈ కసరత్తుకు సంబంధించిన తుది గడువు 2019, జూన్‌గా ఉన్నట్లు అధికారులు చెప్పారు. పూర్తి ముసాయిదాలో ప్రచురితమైన పేర్లను సరిదిద్దేందుకు జనవరి 2 నుంచి 31 వరకు ఎన్‌ఆర్‌సీ సేవా కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఫిబ్రవరి 15 నుండి ప్రారంభం కానుంది. మిగిలిన 10 లక్షల మంది ఎటువంటి అభ్యంతరాలు దాఖలు చేయకపోవడంపై మీడియా ప్రశ్నించగా వారంతా అసలైన పౌరులు కాకపోవచ్చునని, తిరిగి ప్రయత్నించకపోవచ్చునని అధికారులు శ్రేణులు వెల్లడించాయి.

ఇంధనం తగ్గుబాట...!



న్యూఢిల్లీ : కొత్త ఏడాదిలో ఇంధన ధరలు మరింత దిగొచ్చాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతున్న స్థితిలో.. కొన్ని రోజులుగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది తొలిరోజున కూడా ఇంధన ధరలు మరికాస్త తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 19 పైసలు తగ్గి రూ. 68.65లకు చేరింది. లీటర్ డీజిల్ ధర కూడా 20 పైసలు తగ్గి 62.66లకు చేరింది. ఆర్థిక రాజధాని ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ. 74.30లు, కోల్‌కతాలో రూ. 70.78లు, చెన్నైలో రూ. 71.23లు, ఏపీ రాజధాని అమరావతి, విజయవాడలో రూ.72.39లు, విశాఖపట్నంలో రూ.71.85లు హైదరాబాద్‌లో రూ. 72.82లకు తగ్గింది. ఇక డీజిల్ ధర ముంబైలో లీటర్‌కు రూ. 65.56లు, కోల్‌కతాలో రూ. 64.42లు, చెన్నైలో రూ. 66.15లు, ఏపీ రాజధాని అమరావతి, విజయవాడలో రూ.67.34లు, విశాఖపట్నంలో రూ.66.75లు, హైదరాబాద్‌లో రూ. 68.11లకు తగ్గింది. రూపాయి పతనం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడంతో గతేడాది ఆగస్టు-సెప్టెంబరు కాలంలో చుక్కలను తాకిన ఇంధన ధరలు.. ఆ తర్వాత అక్టోబరు 18 నుంచి తగ్గుముఖం పట్టాయి. తాజాగా ఏడాది కనిష్ఠానికి పడిపోయాయి.

బీజేపీ కుట్రలు ఫలించవు : పరమేశ్వర

బెంగళూరు : జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు బీజేపీ కొత్త పన్నాగాలు, వ్యూహాలు రచిస్తోందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వర మంగళవారం ఆరోపించారు. బీజేపీ కుట్రలేమీ ఫలించవన్నారు. 'మా పార్టీలోని అసంతృప్త ఎమ్మెల్యేలను బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాతో సమావేశపర్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకోవడంలో బీజేపీ దిట్ట. గత ఫలితాలు ఫలించకపోగా ఇప్పుడు మళ్లీ ఈ దిశగా పావులు కదుపుతోంది' అని పరమేశ్వర విమర్శించారు. తమ పార్టీతో పాటు కాంగ్రెస్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలను బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఉప ముఖ్యమంత్రి వారి పేర్లను మాత్రం వెల్లడించలేదు. తమ ప్రభుత్వానికి ఢోకా లేదని, ఆందోళన అక్కర్లేదని అన్నారు. కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యే రమేష్ జర్కిహోలీ సహా మరికొందరు ఢిల్లీలో మకాం వేయడంతో పరమేశ్వర వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

జేఎన్‌వీ విద్యార్థుల ఆత్మహత్యలపై

ఆరు వారాల్లోగా వివరణ ఇవ్వండి

హెచ్‌ఆర్డీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసు

న్యూఢిల్లీ : జవహర్ నవోదయా విద్యాలయాల్లో 49 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడంపై హెచ్‌ఆర్డీ శాఖకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసు ఇచ్చింది. 2013-17 మధ్యకాలంలో రెసిడెన్షియల్ జవహర్ నవోదయా విద్యాలయాల(జేఎన్‌వీ)లో చదువుతున్న దళితులు సహా 49 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 'ఏడుగురు మినహా మిగిలినవారు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. వారి మృతదేహాలను తోటి విద్యార్థులు లేదా స్కూలు సిబ్బంది కనుగొన్నారు' అంటూ జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థుల ఆత్మహత్యలను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటోగా తీసుకున్నట్టు హక్కుల ప్యానల్ పేర్కొంది. చనిపోయిన విద్యార్థుల్లో సగం మంది దళితులు/గిరిజనులే కాగా, వీరిలో అత్యధికులు బాలురని తెలిపింది. నవోదయా స్కూళ్లలో విద్యార్థులు ఆత్మహత్యలపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇదే విషయమై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర మానవ వనరుల (హెచ్‌ఆర్డీ) శాఖకు నోటీసు జారీచేసింది. ఇందుకోసం ఆరు వారాల గడువునిచ్చింది. పిల్లలు తమ మనస్సులోని మాటలను, భావాలను పంచుకునేలా ఆయా క్యాంపస్‌లలో శిక్షణ పొందిన కౌన్సిలర్లు ఉన్నారా? హాస్టల్ గదుల్లో పిల్లలు ఒంటరైపోకుండా నిబద్ధగల సిబ్బంది వారికి అందుబాటులో ఉన్నారా? అత్యవసర పరిస్థితుల్లో టెలిఫోన్ ద్వారా కౌన్సిల్సింగ్ ఇచ్చే విధంగా సూసైడ్ హాట్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయా? అని హెచ్ ఆర్డీని ప్రశ్నించినట్టు హక్కుల ప్యానల్ వెల్లడించింది. 'మానసికంగా, శారీరకంగా మార్పులు సంభవించే టీనేజ్‌లో పిల్లలు పలు సమస్యలను ఎదుర్కొంటుంటారు. ఈ క్రమంలో ఒంటరైపోయామన్న భావన వారిలో కలుగుతుంది. దీంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోతారు. తీవ్ర ఒత్తిడికి లోనవుతారు. దానిని తట్టుకోలేక ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తారు' అని ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. 'మనిషి ఆత్మహత్య చేసుకునే ముందు అందుకు సంబంధించి పలు సంకేతాలు ఇస్తాడని మెడికల్ సైన్స్ చెబుతోంది. వారి ప్రవర్తనలో వచ్చిన మార్పులను గమనించి, తగిన సమయంలో కౌన్సిలింగ్ ఇస్తే ఆత్మహత్యలను నివారించవచ్చు' అని కమిషన్ అభిప్రాయపడింది. మానసిక ఒత్తిళ్లకు లోనై ఒంటరైపోతున్న పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చేలా అనుభవజ్ఞులైన, సరైన శిక్షణ పొందిన కౌన్సిలర్లను అందుబాటులో ఉంచాలని సూచించింది. జేఎన్‌వీల పనితీరు, అక్కడ ఉన్న వెసులుబాట్లు, కౌన్సిలర్ల వివరాలను ఆరు వారాల్లో తెలపాలని హెచ్‌ఆర్డీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పష్టంచేసింది.

భారత్‌కు పాక్ అణుస్థావరాల జాబితా...!

న్యూఢిల్లీ : తమ దేశంలోని అణు స్థావరాల జాబితాను పాకిస్థాన్ మంగళవారం భారత్‌కు అప్పగించింది. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఒప్పందం మేరకు అణు స్థావరాల జాబితాను అందజేసింది. భారత్, పాకిస్థాన్‌లోని అణు కేంద్రాలపై పరస్పరం దాడులు చేసుకోవడాన్ని నిషేధిస్తూ 1988, డిసెంబరు 31న ఇరు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందంలోని ఆర్టికల్-2 ప్రకారం ఇరుదేశాలు తమ అణుస్థావరాల జాబితాను ప్రతిఏటా ఇచ్చిపుచ్చుకోవాల్సి ఉందని విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. మంగళవారం ఉదయం 10 గంటలకు విదేశాంగ కార్యాలయంలో భారత హై కమిషన్ ప్రతినిధికి పాకిస్థాన్ అణుస్థావరాల జాబితాను అందజేశారు. అలాగే న్యూఢిల్లీలోని భారత విదేశాంగ శాఖ కార్యాలయం భారత్‌లోని అణు కేంద్రాల జాబితాను పాకిస్థాన్ హైకమిషన్ ప్రతినిధికి అందించింది..." అని సదరు ప్రకటనలో వెల్లడించింది. 1992 జనవరి 1 నుంచి ప్రతియేటా పరస్పరం ఈ వివరాలను ఇచ్చిపుచ్చుకోవడం విశేషం. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు అంతగా లేనప్పటికీ... అణు కేంద్రాల విషయంలో మాత్రం నిరాటంకంగా కొనసాగుతుండడం విశేషం.

దళితులపై కేసుల ఉపసంహరణ

- ఎంపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- మాయావతి డిమాండుపై స్పందన

భోపాల్ : భారత్ బంద్ సందర్భంగా బీజేపీ పాలిత ప్రభుత్వాలు దళితులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండు చేసిన నేపథ్యంలో.. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. దళిత సంఘాలు పిలుపుతో జరిగిన భారత్ బంద్ సందర్భంగా నమోదైన రాజకీయ కేసులను ఉపసంహరించాలని, లేని పక్షంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలకు మద్దతుపై పునరాలోచిస్తామని మాయావతి హెచ్చరించిన సంగతి తెలిసిందే. దళితుల ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులన్నింటినీ ఉపసంహరిస్తున్నట్టు మధ్యప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్ సహా అప్పటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో భారత్ బంద్ నేపథ్యంలో అమాయక దళితులపై కేసులు నమోదు చేశారని, వీటిని మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వాలు తక్షణమే ఉపసంహరించాలని మాయావతి సోమవారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అల్టిమేటం జారీ చేశారు. మాయావతి డిమాండ్‌ను మధ్యప్రదేశ్ సర్కార్ అంగీకరించింది. భారత్ బంద్ నేపథ్యంలో అప్పటి బీజేపీ ప్రభుత్వం మోపిన రాజకీయ కేసులన్నింటినీ ఉపసంహరించాలని నిర్ణయించామని న్యాయ, శాసనసభా వ్యవహారాల మంత్రి పీసీ శర్మ పేర్కొన్నారు.



సచివాలయానికి సీఎం పారికర్...!

పానాజీ : అనారోగ్యంతో ఇటీవల కొన్ని నెలల పాటు ఆసుపత్రిలో చేరిన గోవా సీఎం మనోహర్ పారికర్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. నాలుగు నెలల తర్వాత తొలిసారిగా పారికర్ మంగళవారం రాష్ట్ర సచివాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్ అధికారులు, కేబినెట్ మంత్రులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. పారికర్ సచివాలయానికి వస్తున్నారని తెలియగానే వందల సంఖ్యలో బీజేపీ శ్రేణులు అక్కడకు వచ్చారు. సెక్రటేరి యట్ చేరుకున్న పారికర్‌కు గోవా అసెంబ్లీ స్పీకర్ ప్రమోద్ సవంత్, మంత్రులు, బీజేపీ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌కు చేరుకున్న పారికర్.. అధికారులు, మంత్రులతో సమావేశమయ్యారు. పారికర్ చివరగా 2018 ఆగస్టులో సచివాలయానికి వచ్చారు. ఆ తర్వాత పాన్‌క్రియాటిక్ సమస్యతో బాధపడుతూ ముంబై, అమెరికా సహా ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందారు. ఎయిమ్స్ నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత తొలిసారిగా గతేడాది అక్టోబరులో పారికర్ మీడియాకు కన్పించారు. పనాజీలోని కొత్త వంతెన నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చిన పారికర్ ఫొటో అప్పట్లో వైరల్ అయ్యింది. ముక్కుకు ట్యూబ్‌తో పక్కన వైద్యులతో ఉన్న ఫొటోను బీజేపీ విడుదల చేయడంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ తర్వాత పారికర్ మళ్లీ మీడియాకు కన్పించడం ఇప్పుడే. మంగళవారం కూడా ఆయన ముక్కుకు ట్యూబ్‌తోనే కన్పించారు.

ఇక ప్రజెంట్ సార్ నై...!

- జై హింద్.. 'జై భారత్..అనాల్సిందే
- గుజరాత్ విద్యాశాఖ మంత్రి ఆదేశం




అహ్మదాబాద్ : కొత్త సంవత్సరం సందర్భంగా గుజరాత్ విద్యాశాఖ మంత్రి భూపేంద్ర సిన్హ్ చూడాసమా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి పాఠశాల తరగతుల్లో విద్యార్థులు హాజరు పిలిచేటప్పుడు 'ఎస్ సర్' 'ప్రజెంట్ సార్'కు బదులు 'జై హింద్', లేదా 'జై భారత్' అంటూ పలకాలని కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యార్థుల్లో దేశభక్తిని పెంచేందుకు జనవరి 1వతేదీ కొత్త సంవత్సరం నుంచి హాజరు తీసుకునే పద్ధతి మార్చామని విద్యాశాఖ మంత్రి ప్రకటించారు. ఈ ఉత్తర్వులతో గుజరాత్ రాష్ట్రంలోని 1 నుంచి 12వ తరగతి వరకు చదివే ప్రభుత్వ, ఎయిడెడ్, సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ పాఠశాలల విద్యార్థులు ఇక నుంచి ఉపాధ్యాయులు హాజరు పిలిచినపుడు 'జైహింద్' లేదా 'జైభారత్' అంటూ పలకాలి. బాల్యదశ నుంచి విద్యార్థుల్లో దేశభక్తిని అలవర్చేందుకు హాజరు నిబంధనలు మార్చామని మంత్రి వివరించారు.

2019 ఎన్నికలే ఎన్నికలు..

న్యూఢిల్లీ : ప్రజాప్రభుత్వాలకు 2019 ఎలక్షన్ ఇయర్. భారత్ సహా 62 దేశాల్లో ఎన్నికల సందడికి 2019 వేదిక కానుంది. ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఆస్ట్రేలియా వరకు, థాయ్‌లాండ్ నుంచి ఉరుగ్వే వరకు 62 దేశాలకు ఈ ఏడాదిలో ఎన్నికలు జరుగనున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్‌లో అప్పుడే ఎన్నికల వేడి రాజుకుంది. 62 దేశాల్లో సుమారు 330 కోట్ల మంది ప్రజలుపై ఈ ఎన్నికలు ప్రభావం చూపిస్తాయి. ఇందులో 130 కోట్ల మంది భారతీయులు ఉన్నారు. 'ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎలక్టోరల్ సిస్టమ్స్' ప్రకారం ఈ ఏడాది 62 దేశాలకు ఎన్నికలు జరుగనున్నాయంటే 2019వ సంవత్సరాన్ని ప్రపంచ ఎన్నికల సంవత్సరంగా చెప్పవచ్చు. భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ నెలలో జరుగనుండగా, యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌కు మే నెలలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండు ఎన్నికలే 185 కోట్ల మంది ప్రజల భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి. సగం ప్రపంచాన్నే శాసించనున్నాయి. ఆ మాటకొస్తే పాశ్చాత్య ప్రపంచానికే దిశను నిర్దేశించవచ్చు. దేశంలో సంకీర్ణ సమీకరణల నుంచి ఇరుగు పొరుగు దేశాల సంబంధాల వరకు, విదేశాంగ విధానాల నుంచి అంతర్జాతీయ విధానాల వరకు, శాంతి భద్రతల ఒప్పందాల నుంచి రక్షణ ఒప్పందాల వరకు ఈ ఎన్నికల ఫలితాలు ప్రభావితం చేయనున్నాయి. 25.50 కోట్ల మంది ప్రజలను ప్రభావితం చేయనున్న థాయ్‌లాండ్, నైజీరియాకు ఫిబ్రవరి నెలలో, దాదాపు 30 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న ఇండోనేసియా, ఆఫ్ఘనిస్థాన్‌లకు ఏప్రిల్ నెలలో, 16.20 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న ఫిలిప్పైన్స్, దక్షిణాసియాకు మే నెలలో, 12.7 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న జపాన్‌కు జూలైలో, 8.10 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న కెనడా, అర్జెంటైనాలకు అక్టోబర్‌లో, 6.30 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న పోలండ్, ఆస్ట్రేలియాలకు నవంబరులో, 1.90 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న రొమేనియాకు డిసెంబరులో ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధానంగా ఈ 15 దేశాల ఎన్నికల ఫలితాలు ప్రపంచ గమనాన్ని ప్రభావితం చేస్తాయి. ఐదున్నర కోట్ల జనాభా కలిగిన ఫిన్‌లాండ్‌కు ఏప్రిల్‌లో, దాదాపు ఐదున్నర కోట్ల మంది కలిగిన స్లొవేకియాకు మే నెలలో, దాదాపు 31 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న నెదర్లాండ్స్, బెల్జియం, లిత్వానియా దేశాలకు మే నెలలో, 1.90 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న లట్వియా దేశానికి జూన్ నెలలో, దాదాపు 33 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న బొలీవియా, హైతీ, గ్రీస్ దేశాలకు అక్టోబరులో, 15.7 కోట్ల మందిని ప్రభావితం చేయనున్న క్రొయేషియా, టునీసియాలకు డిసెంబరు నెలలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ దేశాల ఎన్నికల ఫలితాలు కూడా ప్రపంచ గమనంపై స్వల్ప ప్రభావాన్ని చూపుతాయి. మొత్తంగా ఈ ఎన్నికలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలతోపాటు సామాజిక, సంస్కృతి రంగాలను కూడా ప్రభావితం చేస్తాయి.

భారత్ సహా 62 దేశాల్లో ప్రజాతీర్పు



రాజస్థాన్ విద్యాసంస్థల్లో శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్లు

జైపూర్ : వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ కళాశాలల్లో శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేయనున్నట్లు రాజస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. రాజస్థాన్‌లో మొత్తం 189 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. 2019 జూలై నాటికి వీటన్నింటిల్లో శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఉన్నత విద్యాశాఖ వెల్లడించింది. ఈ పథకాన్ని 2018 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి వసుంధరా రాజె ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్ అందించేందుకు రూ.76కోట్లు కూడా కేటాయించారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చిన ఈ పథకం కొత్త ఏడాదిలో అమల్లోకి రానుంది. రుతుక్రమంపై ఇప్పటికీ చాలా మంది మహిళలకు అవగాహన ఉండట్లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆచారాలు, నమ్మకాలతో వ్యక్తిగత శుభ్రత పాటించట్లేదు. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఇక శానిటరీ నాప్‌కిన్‌ల ధర వల్ల కొందరు మహిళలు వాటిని ఉపయోగించట్లేదు. అలాంటి మహిళల కోసం ప్రభుత్వమే వాటిని ఉచితంగా అందించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే రాజస్థాన్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది.



రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత ప్రధానికి లేదు

కాంగ్రెస్ గెలిస్తే ప్రత్యేక హోదా
3న పొత్తులపై రాహుల్ గాంధీతో చర్చ
ఏపీపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర-మడకశిర టౌన్: ప్రధాని నరేంద్ర మోడీకి ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు, వారు పడుతున్న కష్టాలు గుర్తుకు వస్తాయని ఏపీపీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికలు లేకుంటే ప్రజలు ఏమైపోయినా, రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోరన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులతో, ర్యాలీగా వెళ్ళి పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ రాజధాని శంకుస్థాపనలో పిడికెడు మట్టిని, గ్లాస్ నీటిని ఆంధ్ర రాష్ట్రానికి అం దించి చేతులు దులుపు కున్న మోడీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశా రని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తానని నమ్మ బలికి ఆ హామీ సంగతే మరిచిపోయారని, ప్రత్యేక హోదా ఇచ్చాకే రాష్ట్రంలో అడుగుపెట్టాలని, లేకుంటే రాష్ట్రంలో అడుగు పెట్టే అర్హత లేదని ప్రధానిపై రఘువీరా ఫైర్ అయ్యారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ మూడు రాష్ట్రాల్లో రైతుల రుణమాఫీ చేసి కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని మరోసారి రుజువైందని, మన రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బేషరతుగా రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సీట్లను స్పష్టమైన మెజార్టీతో గెలిపిస్తారన్న ఆశాభా వం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో కూడా రుణమాఫీతో పాటు ప్రత్యేక హోదా ప్రకటించి, జీఎస్టీని సైతం సరళీకృతం చేస్తామని తెలిపారు. ఈ నెల 3న ఉమెన్ చాందీతో పాటుగా రాహుల్‌గాంధీని కలిసి పొత్తులపై చర్చిస్తామని, రాహుల్ గాంధీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు సుధాకర్, కన్వీనర్లు నాగేంద్ర, మంజునాథ్, డాక్టర్ రవిశంకర్, గంగులవాయి పాలెం ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, గౌడప్ప, లోకేష్, గురుమూర్తి, సింగల్‌విండో ఉపాధ్యక్షుడు మైలారప్ప, అక్రముల్లా, ఈశ్వరప్ప, దొడ్డయ్య పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థుల కోసం వేట

- ప్రధాన రాజకీయ పార్టీల వెతుకులాట
- విశాఖ, అనకాపల్లి, అరుకు సీట్లపై కుస్తీ

విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతమైన పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థుల కోసం విశాఖ జిల్లాలో రాజకీయ పార్టీలు వేట మొదలుపెట్టాయి. స్థానికుల కంటే వలస వ్యాపారులకు టిక్కెట్లు ఇచ్చేందుకు టీడీపీ, వైసీపీలు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. అనకాపల్లి, విశాఖ, అరకు సీట్ల గెలుపు కోసం అధికార టీడీపీతో పాటు ప్రతిపక్ష వైసీపీ, జనసేన పార్టీలు దృష్టిసారించాయి. కాంగ్రెస్, బీజేపీ నేతలు అన్వేషిస్తున్నారు. ఐదారు నెలల్లో ఎన్నికల వచ్చే అవకాశం ఉండటంతో ఆయా పార్టీల అధిష్టానాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించాలని అంచనా వేస్తున్నాయి. టీడీపీ, వైసీపీ, జనసేన నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

విశాఖ సీటుపై ప్రత్యేక దృష్టి : విశాఖ పార్లమెంటు స్థానంపై అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ప్రశాంత నగరంగా పేరొందిన విశాఖ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుండ టంతో ఇక్కడ పాగా వేయాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో బీజేపీ అభ్యర్థి హరిబాబు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మాతృ మూర్తి విజయమ్మ పై గెలుపొందారు. ఈ సారి టీడీపీ, బీజేపీ కలిసి పోటీ పరిస్థితులు కానరావడం లేదు. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీతో కాంగ్రెస్ పొత్తు ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. వైసీపీ అధిష్టానం కొత్త అభ్యర్థిని రంగంలోకి దించుతుందనే వాదన వినిపిస్తోంది. జనసేన పార్టీ అభ్యర్థి ఎవరనేది తేలాల్సివుంది. అనకాపల్లి, అరకు స్థానాలకు కూడా అదే పరిస్థితి.

తటస్థులపై కన్ను : రాబోయే ఎన్నికల కీలకం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అర్థబలంతో పాటు సామాజిక సమీకరణాల ఆధారంగా అభ్యర్థులను అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది. విశాఖలో పేరు ప్రఖ్యాతు లున్న తటస్థులపై అన్ని పార్టీలు దృష్టిసారించినట్టు సమాచారం. కొందరు తటస్థ ప్రముఖులతో ఆయా పార్టీల అధినేతలు చర్చలు జరిపినట్టు ప్రచారం. అభ్యర్థుల ఎంపికలో టీడీపీ, వైసీపీలతో పాటు జనసేన కూడా బలమున్న అభ్యర్థులను రంగంలోకి దించేందుకు చూస్తున్నాయి..

రేపటి నుంచి భాషా పండిట్‌ల దీక్ష

విశాలాంధ్ర - నెల్లూరు(సిటీ) : భాషా పండితులు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జనవరి 3 నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని డిఈఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నారని రాష్ట్రఉపాధ్యాయ పండిత పరీక్ష జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంపత్ కృష్ణ, శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలోని 10,224 మంది భాష పండితులు పోస్టులను ఎస్ఏ భాగాలుగా ఉన్నతీకరణ చేయడానికి ప్రభుత్వం అంగీకరించి ఉత్తర్వులను విడుదల చేయకపోవడానికి జనవరి 2వ తేదిలోగా పోస్టులను ఉన్నతీకరించి ఉత్తర్వులను విడుదల చేయాలని లేని పక్షంలో జనవరి 3నుండి జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపడుతామని వారు తెలిపారు.

వైభవంగా గంధమహోత్సవం

విశాలాంధ్ర-ఆత్మకూరు : నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని శ్రీ శ్రీ సుల్తాన్ మహబూబ్ సుభానీ దర్గాలో మంగళవారం గంధమహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత గంధాన్ని దర్గా ముతవలి ఇంటి వద్ద నుండి నూతన పాత్రలలో నింపుకుని మేళతాళాలు, ఫకీర్ల విన్యాసాలు, జెండాల ఊరేగింపుల మధ్య దర్గాకు తీసుకుని వచ్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని లేపనం చేశారు. భక్తులకు గంధ ప్రసాదాన్ని పంచి పెట్టారు. దర్గా ఆవరణలో ముస్లిం సోదరులు ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పోర్టు శాఖ

టెండరు నోటీసు

నెం. 18/ఇఇ(ఎం&బి)/డిఎం-1/2018-19 తేదీ : 21-12-2018

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పోర్టులో టి.ఎస్.టి గోదావరికి ఎమ్ఆర్ మరియు భవనాల మరమ్మతుల కొరకు నమోదిత గుత్తేదారుల నుండి సీలు వేసిన టెండర్లు ఆహ్వానించడమైనది. **అంచనా విలువ : రూ. 3 పనులకు రూ.3,02,588/-** టెండరు షెడ్యూళ్ల సరఫరా & జారీ నిమిత్తం దరఖాస్తుల స్వీకరణకు తేదీ : 27-12-2018 నుండి 9-1-2019, సా॥ 5 గంటల వరకు, టెండర్ల స్వీకరణకు తేదీ : 27-12-2018 నుండి 10-1-2019, మ. 3 గం.ల వరకు, టెండర్లు తెరుచు తేదీ : 10-1-2019, సా.3.30 గం.లు. తదుపరి వివరాలను దిగువ సంతకందారునుండి పొందవచ్చును.

సం/- కార్యనిర్వాహక సాంకేతిక నిపుణులు, మెరైన్ డివిజన్, కాకినాడ పోర్టు

డిఐపిఆర్:3684/సివిల్/ఎడివిటి-1/1/18-19, తేదీ : 01/01/2019

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ

షార్ట్ టెండరు నోటీసు

నెం.27 (1నుండి4)/టి.ఓ/2018-19, తేదీ : 28.12.2018

పనిపేరు : 2018-19 రహదారుల అత్యవసర మరమ్మతుల నిమిత్తము మొత్తము 4 పనులకు గాను **అంచనా విలువ : రూ.34.27 లక్షలకు** టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు షెడ్యూలు డౌన్‌లోడ్ చేసుకొనుటకు : 1.1.2019 సా.5 గం.నుండి. టెండర్లు అప్‌లోడ్ చేసుకొనుటకు చివరి తేదీ : 7.1.2019 సా.3 గం. వరకు, టెండర్లు స్వీకరించుటకు : 7.1.2019 సా.3.30 గం. వరకు, టెండర్లు తెరచుటకు : 7.1.2019 సా. 4 గం. నుండి. ఇతర వివరాలను ఈ కార్యాలయము నుండి పొందవచ్చును. ఫోన్ : 08672 252500

సం/-కార్యనిర్వాహక ఇంజనీరు (ర.భ) శాఖ, మచిలీపట్నం

డిఐపిఆర్:3697/సివిల్/ఎడివిటి-1/1/18-19, తేదీ : 01/01/2019

విశాఖపట్నం- సికింద్రాబాద్ మధ్య 26 వీక్లీ ప్రత్యేక రైళ్లు



విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణికుల రద్దీని నివారించడానికి దక్షిణ మధ్య రైల్వే విశాఖపట్నం- సికింద్రాబాద్ మధ్య 26 ప్రత్యేక వారాంతపు రైళ్ళు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు విజయవాడ స్టేషన్‌కు రాకుండానే వెళుతాయి. రైలు నంబరు 08501 గా ఈ నెల 1, 8, 15, 22, 29 ఫిబ్రవరి 5, 12, 19, 26, మార్చి 5, 12, 19, 26 (ప్రతి మంగళవారం) విశాఖపట్నంలో రాత్రి 11.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబరు 08502గా ఈనెల 2,9,16,23,30, ఫిబ్రవరి 6,13,20,27, మార్చి 6,13,20,27 (ప్రతి బుధవారం) సికింద్రాబాద్‌లో సాయంత్రం 04.30 గంటలకు బయలుదేరి తెల్లవారు జామున 04.50 గంటలకు విశాఖ పట్నం చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి,తుని, సామర్ల కోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు, వరంగల్, కాజీపేట, స్టేషన్‌లలో ఆగుతుంది.

మంచి సినిమాలకు మార్గదర్శి మృణాల్‌సేన్

విశాలాంధ్ర - గుంటూరు జిల్లాపరిషత్ : భార తీయ సినిమాకు చెక్కు చెదరని చిరునామా మృణాల్ సేన్ అనీ, ఆయన గొప్ప దర్శకుడే కాదు, దార్శనికుడు, ప్రపంచ పేరెన్నిక కన్న ప్రతిభాశాలి అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ తరఫున మృణాల్‌సేన్‌కు నివాళులర్పించారు. బెంగాలీతో మొదలైన మృణాల్‌సేన్ సినీ ప్రస్థానం హిందీ, తెలుగు, ఒరియా వంటి భారతీయ భాషల్లో సైతం తనదైన కళాత్మక శైలితో ప్రతిభావంతంగా సాగిందని అన్నారు. వ్యాపార పంథాసుకాదని, సామాజిక ప్రయోజనాన్ని విజయవంతమైన సినిమా లుగా మలిచిన కళాస్రష్ట 'మృణాల్‌సేన్' అన్నారు. సమాన్య ప్రజల కష్టాలు, కన్నీళ్ళను రూపుమాపే మెడిసన్‌గా సినిమా కళను మార్చాలని విశ్వప్రయత్నం చేసిన ఘనుడని జేజేలు పలికారు.

విశాలాంధ్ర లేకపోతే నేను లేను

ఆచార్య ఇనాక్



ప్రసంగిస్తున్న ఇనాక్, వేదికపై బుద్ధ ప్రసాద్, రాజమోహన్ గాంధీ తదితరులు

విశాలాంధ్ర - విజయవాడ : అంటరానితనాకి, ఆకలికి, వివక్షకు గురవుతున్న తనకు చైతన్యవంతమైన పుస్తకాలు అందించి తన నుంచి అంటరానితనాన్ని దూరం చేసిన, ఆకలిని తీర్చిన ఘనత విశాలాంధ్ర ప్రచురణాలయానికి దక్కుతుందని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. స్థానిక స్వరాజ్య మైదానం('నవభారత్' ప్రకాశరావు ప్రాంగణం)లోని యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వేదికపై 30వ విజయవాడ పుస్తక మహోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ సంధర్భంగా జరిగిన సభలో ఇనాక్ మాట్లాడుతూ అంకెలు, అక్షరాలను తాను ఇసుక నుంచే ఏరుకున్నానని తెలిపారు. ఇసుకలో అక్షరాలు, అంకెలు నేర్చుకున్న చాలాకాలం తర్వాత అక్షరాలు, అంకెలు ఉన్న పుస్తకాలు తనకు కనిపించాయని చెప్పారు. విశాలాంధ్ర, ఎమెస్కో, దేశగ్రంథ ప్రచురణ సంస్థలు ఇచ్చిన పుస్తకాలు తన వంటి ఎందరినో వ్యక్తులుగా, సాహితీవేత్తలుగా తీర్చిదిద్దాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విశాలాంధ్ర ప్రచురణాలయం లేకపోతే తనవంటి చాలా మంది తయారయ్యేవారు కాదని చెప్పారు. పుస్తకాలు లేకపోతే చాలామంది మనుషులుగా వ్యవహరించేవారు కాదన్నారు. పుస్తకాలు మనిషిని విచక్షణ కలిగిన మనిషిగా తీర్చిదిద్దుతాయన్నారు. తెలుగు మాట్లాడే 18 కోట్ల మంది చదవగలిగిన పుస్తకాలు విజయవాడ పుస్తక మహోత్సవంలో లభిస్తుండటం అభినందనీయమన్నారు.

రెండు పుస్తకాల ఆవిష్కరణ

పుస్తమహోత్సవ ప్రారంభ సభలో రెండు ప్రముఖ పుస్తకాలను ఆవిష్కరించారు. ఆచార్య రాజమోహన్ గాంధీ రచించిన 'మోడరన్ సౌత్ ఇండియన్ హిస్టరీ' పుస్తకాన్ని మండలి బుద్ధప్రసాద్, ఆర్పీ సిసోడియా, బి.లక్ష్మీకాంతం తదితరులు ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ డి.విజయభాస్కర్ రచించిన 'మహాత్మా గాంధీ 150వ జన్మదిన స్మారక విశేష సంపుటి'ని ఆచార్య రాజమోహన్ గాంధీ ఆవిష్కరించారు.

సొసైటీ మాజీ నాయకులకు సన్మానం

బుక్‌ఫెస్టివల్ సొసైటీ ప్రారంభించిన 1989 నుంచి ఇప్పటి వరకు అధ్యక్ష, కార్యదర్శులుగా, కోశాధికారిగా, పలు కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారికి సొసైటీ తరఫున పుస్తకాలు అందించి రాజమోహన్ గాంధీ సన్మానించారు. రామ్మోహన్‌రావు(నవోదయ పబ్లిషర్స్), బాబ్జీ(న్యూ స్టూడెంట్ బుక్ సెంటర్), అశోక్‌కుమార్(అశోక్ బుక్ సెంటర్), రామారావు(వీజీఎస్ పబ్లిషర్స్)ను సన్మానించారు.

నేషనల్ బుక్ ట్రస్ట్ స్ఫూర్తితో...

విజయవాడ పుస్తక మహోత్సవం కో-ఆర్డినేటర్ 'ఎమెస్కో' విజయకుమార్ మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట తొలిసారిగా విజయవాడలో నేషనల్ బుక్ ట్రస్ట్ వారు తమ తొలి పుస్తక ప్రదర్శనను విజయవాడలో ఏర్పాటు చేశారని చెప్పారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని 'నవోదయ' రామ్మోహన్‌రావు, వెంకటనారాయణ, అశోక్‌కుమార్ తదితరులు నగరంలోని పబ్లిషర్లతో కలిసి బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత 1989 నుంచి ఇప్పటి వరకు ఒకటి, రెండు సంవత్సరాలు మినహా ఏటా జనవరి 1 నుంచి 10వ తేదీ వరకు విజయవాడ పుస్తక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. నాటి నుంచి నేటి వరకు జిల్లా అధికారులు అందిస్తున్న సహకారం వల్లే విజయవంతంగా పుస్తక మహోత్సవాన్ని నిర్వహించగలుగుతున్నామని తెలిపారు.

ఎన్నికల సంఘం స్టాల్ ఏర్పాటు

పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఈ ఏడాది తొలిసారిగా ఎన్నికల సంఘం ఆధ్వర్యాన ఓటు హక్కు గురించి తెలియజేస్తూ ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ఆర్పీ సిసోడియా, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఓటు హక్కు నమోదు, వినియోగం గురించి యువతకు అవగాహన కల్పించేందుకు స్టాల్ ఏర్పాటు చేసినట్లు సిసోడియా తెలిపారు.





న్యాయ వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం తగదు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రప్రదేశ్ కు నూతన హైకోర్టు ఏర్పాటు సందర్భంగా ప్రధాన న్యాయ మూర్తి, ఇతర న్యాయమూర్తులు, రిజిస్ట్రార్, సిబ్బందిని అభినం దిస్తూ ఆహ్వానం పలుకుతున్నామని ఆంధ్రరాష్ట్ర సమితి అధ్యక్షు లు పి.రాఘవస్వామి అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మం గళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ సమితి ఏర్పడిన దగ్గర నుండి రాష్ట్ర విభజన కోసం ఎంతో కృషి చేశామన్నారు. విభన అనంతరం అతి ముఖ్య ఘట్టమైన రాష్ట్ర హైకోర్టు కూడా తరలిరావడం సంతోషకరమన్నారు. కొన్ని న్యాయ సంస్కరణలు చేయాలని తాము డిమాండు చేస్తున్నామ న్నారు. వాటిల్లో ముఖ్యమైనవి కోర్టులలో సత్వర న్యాయం జరగాలంటే హైకోర్టులలో ఫుల్ కోర్టుకు అవసరమైన పూర్తి జడ్జిలను నియమించాలి. న్యాయ సంస్కరణల కోసం న్యాయ కమిషన్ ఏర్పాటు చేయాలనీ, హైకోర్టు భవనాన్ని వీలైనంత తొందరగా నిర్మించి అందులో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని అన్నారు. ఏపి పాత భూరికార్డులను అందరికి అందుబాటులో ఉంచాలన్నారు. న్యాయ వ్యవస్థలలో ప్రభుత్వ జోక్యం ఉండరాదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నందీశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పాక్ చెరలోనే..

మత్స్యకార కుటుంబాల ఎదురుచూపులు
హోంశాఖకు లేఖ రాసిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం : సముద్రంలో చేపల వేట కోసం గుజరాత్ సమీపంలోకి వెళ్లి గతేడాది నవంబర్ 29న పాకిస్తాన్ కోస్టుగార్డులకు చిక్కి బంధీలు గా ఉన్న శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుల కోసం కుటుంబ సభ్యులు కన్నీరుపెడుతూ ఎదురు చూస్తున్నారు. ప్రభు త్వాలు పట్టించుకుని తమ వారి విడుదలకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ఈ క్రమంలో మత్స్య కారుల విడుదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. పాక్ చెరలో మగ్గుతున్న 22 మంది మత్స్యకారులను విడిపించాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌కు విడివిడిగా లేఖలు రాసిన చంద్రబాబు పొట్ట కూటి కోసం వెళ్ళి చిక్కుకున్న మత్స్యకారుల కుటుంబాలపై దయ చూపాలని కోరారు. ఆయా మత్స్య కారుల కుటుంబాలు అనాథలు అయ్యాయని లేఖలో పేర్కొన్నారు. 11 కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. ఒక్కో కుటుం బానికి రెండు లక్షల రూపాయల చొప్పున మొత్తం రూ.22లక్షలను ఎచ్చెర్ల మండలంలోని ఆయా కుటుంబాలకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు

ఎదురు చూపులు: భారత మత్స్యకారులు 24 మందిని పాకిస్థాన్ మెరైన్ సెక్యూ రిటీ ఏజెన్సీ బంధించింది. నివేదికల ప్రకారం జాలర్లు అనుకోకుండా గుజరాత్ సమీపంలో పాకిస్తాన్ ప్రాదేశిక జలాల్లో ప్రవేశించారు. ప్రతి సంవత్సరం ఆంధ్ర నుంచి

రాజకీయ విలువలను కాపాడుదాం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - మంగళగిరి : రాజకీయ విలువలు నేడు దిగజారుతున్నాయని, ధన ప్రభావం పెరిగి పోయిందని ఈతరుణంలో రాజకీయ విలువలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరి లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ముప్పాళ్ల నాగే శ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కు మార్ నూతన సంవత్సరం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ 2018 సంవత్స రంలో ఎన్నో పోరాటాలను చేసి అనేక విజయాలను సాధించిన ఘనత ఒక్క సీపీఐకే ఉన్నదని అన్నారు. ప్రత్యేక హోదాకు కట్టుబడి నేటికి పోరాటం చేస్తున్నది సిపిఐనేనని చెప్పారు. ప్రత్యేక హోదాపై ఈ నెల 3, 4 తేదీలలో ఢిల్లీలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు అన్యాయం జరిగితే వారికి అండగా సీపీఐ నిలిచిందని, వారి తరపున పోరాటం చేయటమే కాకుండా నిరవధిక నిరాహారదీక్ష ద్వారా ప్రభుత్వం మెడలు వంచిందని తెలిపారు. సమష్టి పోరాటం వలనే ఈ విజయం సాధించామని అన్నారు. ఈ నెల చివరికి బాధితులకు న్యాయం జరుగుతుందని ముప్పాళ్ల తెలిపారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఈ నూతన సంవత్సరంలో ప్రజా సమస్యలు ఎజెండాగా పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకి ముప్పాళ్ల నాగేశ్వరరావు పూర్తిగా అండగావుండి విజయం సాధించి నష్టపరిహారం చెల్లించే విధంగా చేయటం ఆయన పోరాటతత్వానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, పట్టణ కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి పత్తేపరపు శివ ప్రసాద్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు. సీపీఐ నాయకులు నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పక్కా ఇళ్ల నిర్మాణాలు

ఏలూరులో రూ.730 కోట్లతో12,176 ప్లాట్లు

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు నగరంలో నిరుపేదల సొంతింటి కల త్వరలో నెరవేరబోతోంది. సొంత గూడు కల్పించేందుకు ఆధునిక హంగులతో శాశ్వత పక్కా గృహాలు రూపుదిద్దుకుంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద చేపట్టిన పక్కా ఇళ్ళ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటిడ్కో) ఆధ్వర్యంలో షాపూర్జీ పల్లోంజీ సంస్థ రూ.730 కోట్లతో 12,176 ప్లాట్స్‌ను రెండు దశల్లో నిర్మిస్తోంది. తొలిదశలో 6,480 ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించనున్నారు. ఏలూరు మండలంలోని పోణంగి, మాదేపల్లి, కొత్తూరు ప్రాంతాల్లో సేకరించిన భూముల్లో మూడు చోట్ల 135 బ్లాక్‌లు ఉన్నాయి. పోణంగిలో 113 బ్లాకుల్లో 5,424 ప్లాట్లు, కొత్తూరులోని 19 బ్లాకుల్లో 917 ప్లాట్లు, మాదేపల్లిలోని మూడు బ్లాకుల్లో 144 ప్లాట్లు కలిపి మొత్తం 6,480 ప్లాట్లు నిర్మాణం జరుగుతోంది. ఒక్కో బ్లాక్‌లో నాలుగు ఫ్లోర్లలో 12 ప్లాట్లు ఉన్నాయి. పోణంగిలో ఆరు బ్లాకుల నిర్మాణాలు శ్లాబ్‌ల వరకు పూర్తయ్యాయి. 123 బ్లాక్‌లు ఆఖరు దశలోనూ, 58 బ్లాకులు బేస్‌మెంట్ దశలో, ఎనిమిది బ్లాకులు గ్రౌండ్‌ఫ్లోర్ దశలో, ఆరుబ్లాకులు సెకండ్ ఫ్లోర్ వరకు పూర్తయ్యాయి. కొత్తూరు, మాదేపల్లి గ్రామాల్లో పనులు ప్రారంభ దశలో వున్నాయి. నగర పరిధిలో సొంత ఇల్లు లేని పేదలు 12,176 మందిని ఇప్పటికే తెల్లకార్డు, ఆధార్‌కార్డు ఆధారంగా కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. వీరి దరఖాస్తులను మునిసిపల్ సిబ్బంది పూర్తిచేసి 44 బ్యాంకుల ద్వారా గృహనిర్మాణ రుణాల మంజూరు కోసం ప్రాథమిక పని పూర్తి చేశారు. మరోపక్క లబ్ధిదారుల ప్లాట్ల కేటాయింపు జరిగింది. పోణంగి, కొత్తూరు, మాదేపల్లిలో రోడ్లు, డ్రెయిన్లు వీధిదీపాలు, తాగునీటి వసతి తదితర పనులు సమాంతరంగా చేస్తున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎ మోహనరావు తెలిపారు. మూడు రకాల ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయిస్తున్నామన్నారు. 300 చదరపు అడుగులలో 3-బెడ్‌రూమ్ ప్లాట్స్, 365 చదరపు అడుగులలో 3-బెడ్‌రూమ్ ప్లాట్‌లు, 460 చదరపు అడుగుల్లో డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మిస్తున్నామన్నారు. రు.3లక్షల విలువైన 300 చదరపు అడుగులలో 3-బెడ్‌రూమ్ ప్లాట్‌కు లబ్ధిదారుడు రు.500తో బ్యాంకు అకౌంట్ ప్రారంభిస్తే సరిపోతుందన్నారు.



రూ.6.65 లక్షల విలువైన 300 చదరపు అడుగుల 3-బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు రు.12,500 చొప్పున నాలుగు వాయిదాల్లో లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ. 7.65 లక్షలతో నిర్మించే డబుల్ బెడ్‌రూమ్ ప్లాట్‌కు రూ.25 వేల చొప్పున నాలుగు వాయిదాలు చెల్లించాలన్నారు. రూ.4.65 లక్షల రుణాన్ని 20 ఏళ్ళలోపు వాయిదాలపై చెల్లించాలన్నారు. ఈ గృహాలన్నిటికీ కేంద్ర ప్రభుత్వం లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు సబ్సీడీని బ్యాకులకు నేరుగా చెల్లిస్తాయని ఆయన చెప్పారు.

ఇంకా దొరకని కూలీల జాడ

షిల్లాంగ్ : మేఘాలయలోని బొగ్గు గనిలో కూలీలు చిక్కుకుపోయి 20 రోజులు గడుస్తున్నా జాడ ఇంకా తెలియరాలేదు. కూలీల ఆచూకీని గుర్తించేందుకు చేపట్టిన సహాయక చర్యలకు మరోసారి ఆటంకం ఏర్పడింది. గని నుంచి నీటిని తోడేందుకు తీసుకొచ్చిన అధిక శక్తి పంపుల్లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఎన్డీఆర్ఎఫ్ అధికారులు తెలిపారు. మేఘాలయలోని తూర్పు జయంతియా జిల్లాలో డిసెంబరు 13న 15 మంది కూలీలు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో అనుమతి లేకపోయినా బొగ్గు గని తవ్వకాలు చేపట్టారు. అయితే రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా బొగ్గు గనిని వరద నీరు ముంచెత్తించింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న 15 మంది కూలీలు అక్కడి గనిలో చిక్కుకుపోయారు. వీరిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయకచర్యలు చేపట్టారు. అయితే సరైన పరికరాలు లేకపోవడంతో ఇటీవల కొన్ని రోజుల పాటు సహాయకచర్యలను నిలిపివేశారు. అనంతరం అసోం నుంచి అధిక శక్తి పంపులను తీసుకొచ్చి సహాయక చర్యలను పునరుద్ధరించారు. అయితే తాజాగా వాటిలో సాంకేతిక లోపం తలెత్తింది. అయితే పంపులను మరమ్మతు చేస్తున్నామని, త్వరలోనే మళ్లీ గాలింపు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

బులంద్‌షెహర్ హింసాఘటనలో

ఇన్‌స్పెక్టర్‌పై దాడిచేసిన దుండగుడి అరెస్టు

బులంద్‌షెహర్: బులంద్‌షెహర్ హింసాత్మక ఘటనలో ఇనస్పెక్టర్ సుబోద్ కుమార్ సింగ్‌పై గొడ్డలితో దాడిచేసిన దుండగుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటివరకు ఈ కేసులో 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. డిసెంబరు 3న జరిగిన ఈ హింసాత్మక ఘటనలో దుండగులు ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసి హత్యచేసిన విషయం తెలిసిందే. గొడ్డలిదాడితో తీవ్రంగా గాయపడి లేవలేని ఇనస్పెక్టరన్ తుపాకీతో కాల్చిచంపిన ప్రశాంతనాథ్‌ను డిసెంబరు 27న అరెస్టు చేశారు. డిసెంబరు 18న ఈ కేసులో మూకదాడి జరిపిన మరో ఐదుగురిని అరెస్టు చేశారు. జిల్లాలోని మహావ్ గ్రామంలో గోవుల అస్తిపంజరాలు దొరకాయని దుండగులు అల్లర్లను సృష్టించి ఒక ఇనస్పెక్టర్, మరొక యువకుడిని బలితీసుకున్నారు. ఈ అల్లరి గుంపులో 50 నుంచి 60 మంది పాల్గొన్నారని సియాన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వీరంతా చింగ్రావతి పోలీసు పోస్టుపై దాడి జరిపి హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. ఎఫ్ఐఆర్‌లో 27 మంది పేర్లను నమోదు చేశారు. స్థానిక బజరంగదళ్ నాయకుడు యోగేష్ రాజ్‌తోసహా ఆర్మీ జవాన్ జితేంద్ర మాలిక్‌ను అరెస్టు చేసి పోలీసు కస్టడీకి తీసుకున్నారు.



కేరళ మహిళలకు బెజవాడలో మద్దతు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం కోరుతూ కేరళలో మహిళా సమాఖ్య సభ్యులు పెద్ద ఎత్తున చేపట్టిన మానవహారానికి మద్దతుగా విజయవాడ లెనిన్ సెంటర్‌లో మంగళవారం ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ ఆధ్యాత్మిక విషయాల్లో సైతం పురుషాధిక్యతను ప్రదర్శిస్తూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న అరాచక విధానానికి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. కేవలం రాజకీయ కుట్రలో భాగంగానే శబరిమలలో మహిళా భక్తులపై దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. బీజేపీ కేంద్రంలో ఒక తరహాలో, కేరళలో మరొక తరహాలో వ్యవహరిస్తోందని విమర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టరు సుజాత, సమాఖ్య నాయకులు భారతి, దుర్గా, రమణమ్మ, లక్ష్మీ, శైలజ, పుష్పావతి, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బీహార్ సీఎస్‌కు ఎన్‌హెచ్చార్సీ నోటీసులు...!

పాట్నా: బీహార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. వైశాలిలో గల హాజీపూర్ సర్దార్ ఆస్పత్రిలో కాలిన గాయాల వార్డు నుంచి ఓ పేషెంట్‌ను వార్డు బోయ్ చెత్తడంపులో పడేశాడు. ఈ ఘటన మీడియాలో కవర్ అయింది. మీడియా వార్తలను సుమోటాగా స్వీకరించిన ఎన్‌హెచ్ఆర్సీ ఆ రాష్ట్ర సీఎస్‌కు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. పేషెంట్ ఆరోగ్యస్థితి, జరిగిన అమానుష చర్యపై నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది.

భర్తలకు విడాకులిచ్చి ఒక్కటైన యువతులు

లక్నో: కుటుంబ సభ్యుల బలవంతంతో ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని ఆపై భర్తల నుంచి దూరంగా ఉంటున్న ఇద్దరు యువతులు తాజాగా ఓ ఆలయంలో వివాహం చేసు కున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. హమీర్‌పూర్‌కు చెందిన ఇద్దరు యువతుల్లో ఒకరి వయసు 24 కాగా, మరొకరి వయసు 26. భర్తలకు విడాకులిచ్చి ఒంటరిగా ఉంటున్న వీరిద్దరికీ కాలేజీలో పరిచయం ఏర్పడింది. అది ముదిరి ప్రేమకు దారితీసింది. ఇటీవల ఇద్దరూ ఒక గుడిలో దండలు మార్చుకుని ఒక్కటయ్యారు. అయితే, వీరి వివాహాన్ని గుర్తించేందుకు రిజిస్ట్రార్ నిరాకరించారు.

'ఉమెన్ వాల్' సక్సెస్..!



తిరువనంతపురంలో మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బృందాకారత్

తిరువనంతపురం : లింగ సమానత్వమే లక్ష్యంగా కేరళ మహిళలు కదంతొక్కారు. లక్షలాది మంది మహిళలు రోడ్లపైకి వచ్చి 620కి.మీల 'ఉమెన్ వాల్' (మానవహారాన్ని) ఏర్పాటు చేశారు. ఆచారాలు, సంప్రదాయాల ముసుగులో రాష్ట్రాన్ని చీకటి శకంలోకి నెట్టబడనివ్వమని సంకల్పించారు. అన్ని వయస్కుల మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించవచ్చునన్న సుప్రీంకోర్టు తీర్పునకు మద్దతు పలికారు. నూతన సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకొని ఉత్తర కేరళలోని కాసర్‌గాడ్ నుంచి దక్షిణానున్న తిరువనంతపురం వరకు 'మహిళా'హారాన్ని ఏర్పాటు చేశారు. సీపీఐ, సీపీఎం జాతీయ నాయకులు, ముఖ్యమంత్రి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. మలయాళంలో వనితా మాటిల్‌గా పిలిచే ఉమెన్ వాల్‌కు మలాయళం నటి రీమా కల్లింగల్, స్వామి అగ్నివేష్ మద్దతుపలికారు. శబరిమలలోకి మహిళలు రావొద్దన్న నిరసనలకు దీటుగా, సుప్రీం కోర్టు బాటలో లింగ సమానత్వం కోసం 'ఉమెన్ వాల్'ను నిర్వహిస్తున్నట్లు మహిళాహారానికి నేతృత్వం వహించిన ఆరోగ్యమంత్రి కేకే శైలజ తెలిపారు. కాసర్‌గాడ్‌లో మంత్రి శైలజ ఆధ్వర్యంలో మొదలైన మానవహారానికి తిరువనంతపురంలో సీపీఎం నాయుకులు బృందాకారత్ చివరిన ఉన్నారు. మొత్తం 14 జిల్లాల గుండా సాగే జాతీయ రహదారుల వెంబడి ఈ మహిళాహారం ఏర్పడింది. ఇందులో పాల్గొనే మహిళలు ప్రారంభ కేంద్రానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకొని రిహార్సల్స్ చేశారు. ఆపై సాయంత్రం 4 నుంచి 4.15 గంటల మధ్యలో 'ఉమెన్ వాల్' ఏర్పాటును పారంభించారు. అనంతరం లింగసమానత్వం, పునరుజ్జీవనం విలువలపై ప్రతిజ్ఞ చేశారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి సంబంధించి ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఈ మహిళాహారాన్ని కేరళ ప్రభుత్వం ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ 'మహిళల సమస్యలకు పరిష్కారాన్ని అన్వే షించడం కూడా ఉద్యమమే' అని అన్నారు. శబరిమ లోకి మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ మతశక్తులు చేస్తున్న నిరసనలు, ఆందోళనలే ఈ మహిళాహారానికి దారితీసినట్టు సీఎం తెలిపారు. ప్రభుత్వంతో పాటు ప్రగతిశీల సంఘాలు పాల్గొన్నట్టు ఆయన వెల్లడించారు. కేరళ రాష్ట్రం మరలా చీకటి శకంలోకి వెళ్లిపోకుండా ఉండేందుకే ఈ మహిళాహారానికి శ్రీకారం చుట్టినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. మహిళల శబరిమల ఆలయ ప్రవేశానికి అనుకూలంగా తలపెట్టిన ఉమెన్స్ వాల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలను కేరళ ప్రభుత్వం నిర్వహించింది. అధికార సీపీఐ(ఎం)తో పాటు సీపీఐ, శ్రీ నారాయణ ధర్మ పరిపాలనా యోగం (ఎస్ఎన్‌డీపీ), కేరళ పులయర్ మహాసభ (కేపీఎంఎస్) సహా 176కు పైగా సామాజిక-రాజకీయ సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. అయితే, ఆర్ఎస్ఎస్‌తో పాటు మరిన్ని మతసంఘాలు, ముఖ్యంగా నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) 'ఉమెన్ వాల్'ను తీవ్రంగా వ్యతిరేకించాయి. నిరసనగా 'అయ్యప్ప జ్యోతి'ని నిర్వహించాయి. సీఎం విజయన్ దీనిని ఖం డించారు. ఇది సరైనదా? కాదా? అన్నది ఆర్ఎస్ఎస్ వర్గాలు ఆత్మవిమర్శ చేసుకో వాలని సూచించారు. అయ్యప్ప జ్యోతిలో పాల్గొనడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శమని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పునకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కాగా, జనవరి 1న తలపెట్టిన మహిళా హా రం కోసం తమ తరపున ఏకంగా 1.25లక్షల మంది మహిళలు పాల్గొంటారని కదంబశ్రీ మిషన్ ఇంతకు ముందు ప్రకటించిన విషయం తెలిసిందే.

వృద్ధి రేటులో మనమే ముందు

వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెరిగిన ఆదాయం
ఆఖరి శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర అమరావతి : ఆర్థికవృద్ధి రేటులో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మనమే ముందున్నామని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత పది రోజులుగా వరుసగా శ్వేతపత్రాలు విడుదల చేస్తున్న సీఎం మంగళవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో చివరి శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. ముందుగా పది శ్వేతపత్రాలను విడుదల చేసిన సందర్భంగా సమాచారశాఖ కార్యదర్శి రామాంజనేయులు పుష్పగుచ్ఛం ఇచ్చి సీఎంను అభినందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నవ్యాంధ్రప్రదేశ్ అన్నిరంగాలలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. 2018 మనకు అనేక సవాళ్లను ఎదుర్కొన్నామన్నారు. 2019లో హైకోర్టు ప్రారంభంతో శుభారంభం పలికామన్నారు. ఇది నూతన అధ్యాయమని హర్షం వ్యక్తం చేశారు. కసితో, పట్టుదలతో పనిచేసి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామని వివరించారు. 2014 అధైర్యపడితే నిర్వీర్యం అయిపోతామనే ఆలోచనతో తొలి సంవత్సరం పూర్తి కాగానే, నవ నిర్మాణ దీక్ష, మహా సంకల్పం చేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, నిర్ణయాలు, పథకాలతో నాలుగున్నరేళ్లు అసలు సమయమే తెలియకుండా గడచిపోయిందని చెప్పారు. ఈ నాలుగున్నరేళ్లు సాధించిన ప్రగతి, సమస్యలపై బుధవారం నుంచి జరిగే జన్మభూమి గ్రామసభలలో, వార్డు సభలలో చర్చిస్తామని తెలిపారు. మోయలేని భారంతో అప్పులు చేస్తే చివరికి దివాళా తీసే పరిస్థితి రాకూడదన్నారు. 46 శాతం ఆదాయం, 58 శాతం జనాభాతో మన ప్రస్థానాన్ని ఆరంభించామని వివరించారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలన్నది వారి ధ్యేయమనీ, సుస్థిరమైన ప్రభుత్వం రాకూడదని సామంత రాజులు రావాలని చూస్తున్నారని సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించి సుస్థిర పాలనకు మద్దతుగా నిలవాలన్నారు. ఆర్థికంగా సుస్థిరత రాకుండా చేస్తున్నారనీ, అనేక అంశాలలో ఇవాళ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందన్నారు. ప్రభుత్వ అటెన్షన్ డైవర్ట్ చేయడానికీ, మనల్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ బకాయిలకు ఇవ్వాల్సిన రూ.5వేల కోట్లు ఇవ్వకుండా తెలంగాణా ప్రభుత్వం పేపర్లో అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఏపీ మీడియాలో పెద్దఎత్తున ప్రకటనలు ఇచ్చి మన ప్రభుత్వాన్ని రెచ్చగొట్టాలనీ, అవమానించాలని కేసీఆర్ చూస్తున్నారని విమర్శించారు. బాధ్యత కలిగిన కేంద్ర ఆర్థిక మంత్రి ఫెడరల్ ఫ్రంట్ లో మమతాబెనర్జీ ఉండంటూ ఎలా ప్రకటన ఇస్తారని ప్రశ్నించారు. మహాకూటమి విఫలం కాలేదని ప్రధానమోడీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీలు మాత్రమే విఫలమైనారన్నారు. దేశంలో రెండే కూటములు ఉన్నాయనీ, ఒకటి ఎన్డీఏకి మద్దతు పలుకుతున్న పార్టీలు, రెండోది కాంగ్రెస్‌కి మద్దతు పలికే పార్టీల కూటమని స్పష్టం చేశారు. బీజేపీ వలన దేశానికి కలిగిన లాభం ఏమిటో చర్చకు సిద్ధమానని నరేంద్రమోడీకి చంద్రబాబు సవాల్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన వృద్ధి రేటు ఏముందని, నోట్ల రద్దు, జీఎస్టీతో ఆర్థికాభివృద్ధి ఏం సాధించారన్నారు. దేశాన్ని భయభ్రాంతుల్ని చేస్తున్నారని, కేంద్రం తీసుకున్న చర్యల వల్ల దేశంలో ఆర్థికవ్యవస్థ కుప్పకూలిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రచారమే అజెండా

- ప్రభుత్వ పథకాలు, శ్వేతపత్రాలపైనే ప్రధాన చర్చ
- సర్కారు వైఫల్యాలపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సన్నద్ధం
- నేటి నుంచి 'జన్మభూమి-మాఊరు' ప్రారంభం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఎన్నికలు రానున్న నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జన్మభూమి-మాఊరు' ఈసారి పూర్తిగా ప్రచార కార్యక్రమం కానుంది. చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నిర్వహించే ఆరవ జన్మభూమి కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ పది రోజులూ నాలుగున్నరేళ్ల అభివృద్ధిపై చర్చించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సర్కారు వైఫల్యాలను నిలదీసేందుకు ప్రతిపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి జన్మభూమి కార్యక్రమాలు వాడివేడిగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. తొలి రోజు చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగే గ్రామసభకు సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. అట్టడుగు స్థాయి వరకూ సమగ్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యమని చెబుతూనే గ్రామసభల వేదికలను పార్టీ ప్రచారానికి వినియోగించుకునేందుకు రంగం సిద్ధమైంది. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని రోజుకొక శ్వేతపత్రం చొప్పున పది రోజులూ పది శ్వేతపత్రాలను విడుదల చేయాలని డిసెంబరు 21న చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో నిర్ణయించారు. అయితే ఒకవైపు శ్వేతపత్రాలు విడుదల చేస్తూ మరోవైపు జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించడం కష్టం అవుతుందనే భావాన్ని మంత్రులు, ప్రజాప్రతినిధులు వ్యక్తం చేసినట్లు సమాచారం. జన్మభూమి ప్రారంభానికి ముందు రోజుతో పదవ శ్వేతపత్రాన్ని విడుదల చేసే విధంగా ప్రణాళికను రూపొందించి డిసెంబరు 23 నుంచి శ్వేతపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వ పరంగా నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధితోపాటు వివిధ పథకాల ప్రచారమే ప్రధాన ఎజెండా కానుంది. సీఎం సందేశం వినిపించిన వెంటనే శ్వేతపత్రాల్లో పొందుపరచిన అంశాలను గ్రామసభల్లో వివరించి వాటిపై అవగాహన కల్పించడమే కాకుండా ఆయా అంశాలపై చర్చించే విధంగా కార్యక్రమాలను రూపొందించారు. వీటిని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలగినప్పటి నుంచి రాష్ట్ర పునర్విభజన అంశాలపైనే ప్రధానంగా దృష్టిని సారిస్తున్న టీడీపీ ప్రభుత్వం అదే అంశాన్ని మొదటి రోజు చర్చకు పెట్టడం గమనార్హం. ఆయా జిల్లాల్లోని గ్రామ సభలకు హాజరయ్యే మంత్రులు, ప్రజాప్రతినిధులు కేంద్రంలోని బీజేపీ ఏపీకి చేసిన అన్యాయం, మోడీకి జగన్, కేసీఆర్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారనే అంశాలను ముఖ్యంగా ప్రస్తావించే విధంగా కార్యాచరణ సిద్ధమైనట్లు సమాచారం. ఈ సారి నిర్వహించే గ్రామసభలు రాబోయే ఎన్నికలకు ముందస్తు ప్రచార వేదికలుగా మారడం ఖాయంగా పలువురు పేర్కొంటున్నారు.

పేద, మధ్య తరగతి ప్రజలే లక్ష్యం

పేద, మధ్య తరగతి ప్రజానీకమే లక్ష్యంగా జన్మభూమి-మాఊరు కార్యక్రమం ఉండనుంది. గ్రామసభల్లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, వివిధ ప్రోత్సాహకాలను పంపిణీ చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణం ఇంకా పూర్తికాకపోయినప్పటికీ ప్రతి గ్రామసభలోనూ ఒకరిద్దరికి ఇళ్లను కేటాయిస్తూ పత్రాలను అందచేసే విధంగా కార్యక్రమాలు రూపొందించినట్లు తెలుస్తోంది. పెట్టుబడిలేని ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించనున్నారు. రాష్ట్ర పునర్విభజన అంశాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వృద్ధి రేటు, నూరు శాతం రేషన్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లికానుక, గృహ నిర్మాణం, ఉపకార వేతనాలు, వసతి గృహాలు, జ్ఞానభూమి, ఆదరణ, అన్న క్యాంటీన్లు, మధ్యాహ్న భోజన పథకం, పేదరికంపై గెలుపు, ఎస్టీ, ఎస్సీ కుటుంబాలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్, భూగర్భ జలాలు సహా జలవనరుల నిర్వహణ, గ్రామీణ-పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పన, విద్యుత్, పరిశ్రమలు, సుపరిపాలన తదితర అంశాలను నిర్దేశించిన రోజుల్లో చర్చించనున్నారు.

మోడీ చర్యలతో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి: ప్రధాని నరేంద్ర మోడీకి ఏపీ సీఎం చంద్రబాబు సవాల్ విసిరారు. మహా కూటమి విఫలైందని, చంద్రబాబు ఆక్రోశంతో మాట్లాడుతున్నారంటూ ఏఎన్ఐతో ముఖాముఖిలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు ధీటుగా స్పందించారు. ప్రధాని నరేంద్రమోడీ వల్ల దేశానికి ఏం లాభం జరిగిందో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కేంద్రం సాధించిన వృద్ధి రేటు ఏముంది?, నోట్ల రద్దు, జీఎస్టీతో మీరు ఆర్థికాభివృద్ధి ఏం సాధించారు? అని ప్రశ్నించారు. దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ తీసుకున్న చర్యల వల్ల దేశంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి పోయిందని వ్యాఖ్యానించారు. ప్రధాని, భాజపా జాతీయ అధ్యక్షుడు తెలంగాణలో పర్యటించినా గెలిచింది ఒక్క సీటేనన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ మిమ్మల్ని ఎన్నెన్ని మాటలు అన్నారో గుర్తులేదా అని మోడీని ప్రశ్నించారు.

ప్రజల్ని మోసం చేద్దామని అనుకుంటున్నారు గానీ చేయలేరన్నారు. కేంద్రం అనుసరించిన ఆర్థిక, పాలనా పరమైన విధానాలతో దేశానికి ఎంతో నష్ట మన్నారు. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుందని చంద్రబాబు ప్రశ్నించారు. మోడీ, జైట్లీ కలిసి ప్రమోట్ చేస్తున్నదే ఈ ఫెడరల్ ఫ్రంట్ అని దుయ్య బట్టారు. వారికి రాజకీయంగా లాభం వస్తుందనే దాన్ని ప్రమోట్ చేస్తున్నారని ధ్వజ మెత్తారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఫెడరల్ ఫ్రంట్‌లో ఉంటున్నట్టు చెప్పలేదని, టీఎంసీ చెప్పక పోయినా.. కేంద్రం తప్పుదారి పట్టిస్తోందని మండి పడ్డారు. మహాకూటమి విఫలం కాలేదని, కేంద్రం లో ఎన్డీయే ప్రభుత్వం, మోడీ, అరుణ్ జైట్లీ విఫలమయ్యారన్నారు. దేశంలో రెండే కూటమిలు ఉన్నాయన్నారు. ఒకటి ఎన్డీయే, దానికి మద్దతు పలుకుతున్న పార్టీలు కాగా, రెండోది కాంగ్రెస్, దానికి మద్దతు పలికే పార్టీల కూటమిలేనని వివరించారు.

అక్రమాయుధాల కేసులో 42 మంది అరెస్టు

ముజఫర్‌నగర్ : జిల్లాలో జరిగిన సోదాల్లో అక్రమాయుధాలు కలిగిన 42 మందిని అరెస్టు చేశామని పోలీసులు మంగళవారం తెలిపారు. అక్రమాయుధాల తయారీ కేంద్రాలను కూడా కనుగొన్నామన్నారు. సోమవారం జరిగిన ఈ దాడుల్లో దేశవాళీ తుపాకులు, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఎస్పీ సుధీర్ కుమార్ తెలిపారు. ఖటోలీపట్నంలో అక్రమాయుధాల కేంద్రంపై దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేశామని సిటీ ఎస్పీ ఓంబీరసింగ్ తెలిపారు. బుదాన్ పోలీసు స్టేషన్ పరిధిలోని అక్రమాయుధాల తయారీ కంపెనీని కనుగొని, పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

మహా కూటమి విఫలం

ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కొనేందుకు మహాకూటమి, ఫెడరల్ ఫ్రంట్‌ల ఏర్పాటు ప్రయత్నాలను ప్రధాని నరేంద్ర మోడీ తోసిపుచ్చారు. సిద్ధాంత వైరుధ్యాలున్న పార్టీలు మోడీ ఓటమే అజెండాగా ఏకమవడాన్ని ప్రజలు తిప్పికొడతారని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి ప్రయోగం విఫలమైందని అన్నారు. తెలంగాణలో కూటమికి చొరవ చూపిన ఏపీ సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని, అక్కడే కూటమికి తొలిదెబ్బ తగిలిందన్నారు. సిద్ధాంతాలను పక్కనపెట్టి చంద్రబాబు కాంగ్రెస్ పంచన చేరారని మండిపడ్డారు. మోడీ ఆశీస్సులతోనే తెలంగాణ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారన్న చంద్రబాబు ఆరోపణలను తిప్పికొట్టారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు పూనుకున్నారన్న విషయం తనకు తెలియదని మోడీ వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై న్యాయ ప్రక్రియ పూర్తయిన అనంతరమే ఎన్డీఏ ప్రభుత్వం ఈ దిశగా ఆర్డినెన్స్ తీసుకువస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. నూతన సంవత్సరం తొలి రోజున ప్రధాని ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణ వ్యవహారంపై న్యాయ ప్రక్రియ నెమ్మదించేలా కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ పరిధిలో ఈ అంశానికి పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాన్ని నాలుగు తరాల పాటు ఏలిన కాంగ్రెస్ పార్టీ పలు కుంభకోణాల్లో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. ఆర్థిక అవకతవకలతో బెయిల్ మీద ఆ పార్టీ అగ్రనేతలున్నారని ఎద్దేవా చేశారు. ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేశారని చెప్పారు. గత ఆరేడు నెలలుగా ఆయన తనను రిలీవ్ చేయాలని కోరుతున్నారని, చివరికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసుకున్నారని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఉర్జిత్ రాజీనామా వ్యవహారంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన తన విధులను సమర్థంగా నిర్వహించారని ప్రశంసించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రజలు తమకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలు మహాకూటమికి, ప్రజలకు మధ్య జరుగుతున్న పోరుగా మోడీ అభివర్ణించారు. ప్రజల ప్రేమ, అశీర్వాదాలే తనకు కొండంత అండగా నిలుస్తాయన్నారు. పాక్ భూభాగంలో ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేసేందుకు నిర్వహించిన మెరుపు దాడులకు తాను స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశానని చెప్పుకొచ్చారు. దాడులు చేపట్టే క్రమంలో మీరు విజయవంతమైనా, విఫలమైనా దాని గురించి ఆలోచించకుండా సూర్యోదయం అయ్యే సమయానికి తిరిగి చేరుకోవాలని సైన్యానికి సూచించానన్నారు. ఆపరేషన్‌ను అతితక్కువ సమయంలో పూర్తిచేయాలని, దాన్ని ఎక్కువసేపు కొనసాగించరాదని చెప్పానన్నారు. సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్స్‌ను తమ ప్రభుత్వం తీసుకువచ్చిందని, రాజ్యాంగ పరిధిలో ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని బీజేపీ మేనిఫెస్టోలో పొందుపరిచామని ప్రధాని పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్‌ను పెద్దసంఖ్యలో ముస్లిం దేశాలు నిషేధించాయని చెప్పారు. పాకిస్తాన్‌లో సైతం ట్రిపుల్ తలాక్‌ను నిషేధించారన్నారు. ఇది ఎలాంటి మతానికి, విశ్వాసానికి సంబంధించిన అంశం కాదని, కేవలం లింగ సమానత్వం, సామాజిక న్యాయంతో ముడిపడిన వ్యవహారమని చెప్పారు. దేశంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలన్నది భారత్ అభిమతం..దేశంలో కొన్ని దేవాలయాలకు ప్రత్యేక సంప్రదాయాలున్నాయని శబరిమల ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని పేర్కొన్నారు.

కుటీరంలోకి దూసుకెళ్లిన ట్రక్

ఏడుగురి మృతి

చందౌలీ(యూపీ) : పశువులను తీసుకువెళుతున్న ట్రక్ ఒకటి కుటీరంలోకి దూసుకుపోవడంతో మూడు నుంచి ఎనిమిదేళ్ల వయసున్న నలుగురు పిల్లలతో సహా ఏడుగురు కొత్త ఏడాది రోజున దుర్మరణం చెందారని పోలీసులు వెల్లడించారు. మాల్దా లోని చకియా గ్రామంలో మంగళవారం ఉదయం 5.30 గంటలకు ఈ దుర్ఘటన జరిగిందని ఎస్పీ సంతోషకుమార్ సింగ్ తెలిపారు. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా ఒక బాలిక గాయపడిందని, ఆమెను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నామన్నారు.

మృతి చెందినవారిలో శ్యామాదేవి (60), రామకిషన్(27) సుహాగిన (25), నలుగురు పిల్లలు గోలు (4), మున్ని (4)మోను (5), నిష (8) ఉన్నారన్నారు. మాల్దా పోలీసు అవుటపోస్టు స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుళ్లు, డయల్ 100 టీంలను ఎస్పీ సస్పెండ్ చేశారు.

విలాసాలు..!

(మొదటిపేజీ తరువాయి)

కేటాయింపులో ఒక ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. రాజకీయ పార్టీల నేతలు, అధికారులకు నివాస భవనాలు కేటాయించ కూడదని నిర్ణయించామంటున్నారు. ఎవరైనా సీఎం భార్య లేదా కుటుంబ సభ్యులు ఢిల్లీలోనే నివాసం ఉండాలనుకుంటే తప్పనిసరిగా ప్రభుత్వం నివాస సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. భద్రతా కారణాలరీత్యా ఇది తప్పనిసరి. ఆ కారణంగానే త్రిపుర సీఎం బిప్లవ్ కుమార్‌కు గతేడాది ఏప్రిల్ 24న 6బీ లుటేన్యా బంగళాను కేంద్రం ప్రభుత్వం కేటాయించినట్లు ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. తల్కాతోర రోడ్డులోనే పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు నివాసం ఉంటున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో బంగళాలు కోసం దరఖాస్తులేవీ పెండింగ్‌లో లేవని పట్టణాభివృద్ధిశాఖ వర్గాలు చెబుతున్నాయి.

మోడీ రావటంతోనే ఖాళీ చేయించారు

కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం రావటంతోనే ఢిల్లీలోని గతంలోని బంగళాల కేటాయింపులను కేంద్ర రద్దు చేసింది. అప్పటికే ఉన్న సీఎంలు, రాజకీయ పార్టీల నేతలు, అధికారుల బంగళాలను ఖాళీ చేయించారు. ప్రధాని మోడీ ఆదేశాల మేరకే నివాస బంగళాలను ఖాళీ చేయించినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి బంగళాల కేటాయింపు కేంద్రానికి పెద్ద భారం కాదు, పైపెచ్చు ఇబ్బంది కూడా కాదు. ఎవరైతే బీజేపీ, ప్రధాని మోడీకి అనుకూలంగా ఉంటున్నారో వారికి మాత్రమే నివాస బంగళాలను కేటాయించటం పలు విమర్శలకు తావిస్తోంది. విపక్షంలో జడ్ ప్లస్ కేటగిరి ఉన్న సీఎంలకు సైతం బంగళాలు కేటయించలేదు. ఈ నేపథ్యంలో అసలు ఢిల్లీలో ఎంతమంది సీఎంలకు నివాస భవనాలను కేటాయించారో ఆరా తీయగా, కేవలం ఏడుగురికే బంగళాలు కేటాయించినట్లు తేలింది. ఏడుగురు సీఎంలకు బంగళాలు కేటాయించగా, అందులో ఐదుగురు ఎన్‌డీఏ, బీజేపీ ముఖ్యమంత్రులు, ఇద్దరు తెలుగు రాష్ట్రాల సీఎంలు కావటం విశేషం. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు ఎన్‌డీఏలో ఉండగా కేంద్రం బంగళాను కేటాయించగా, తెలంగాణ సీఎం కేసీఆర్ మోడీకి అనుకూలంగా ఉన్నందుకు నివాస భవనం దక్కింది. ఇదిలావుండగా, సీఎంలకు కేటాయించిన బంగళాల అద్దె, ఇతర ఖర్చులను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది.

ఎవరెవరికి ఎక్కడ...

- తెలంగాణ సీఎం కేసీఆర్‌కు తుగ్లక్ రోడ్డులోని టైప్ 8 బంగళాను 2015 జూన్ 3న కేటాయించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన తుది దశలో ఉండటం, సీఎం పర్యటన సమయంలో మరో ప్రత్యామ్నాయ వసతి లేకపోవటం, భద్రతా కారణాలు, మోడీకి అనుకూలంగా ఉంటుండటంతో ఆ భవనాన్ని కేటాయించినట్లు తెలిసింది.
- ఏపీ సీఎం చంద్రబాబు ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉండటంతో 2016 ఏప్రిల్ 6న 7, సఫ్దర్‌జంగ్ రోడ్డులో టైప్ 8 బంగళాను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఏపీ భవన విభజన, ఢిల్లీ పర్యటన సమయంలో మరో ప్రత్యామ్నాయ నివాస భవనం లేకపోవటంతో బంగళాను కేటాయించారు. గతేడాది చంద్రబాబు ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చారు. నివాస బంగళా పొందిన ప్రతిపక్ష సీఎం చంద్రబాబు ఒక్కరే.
- అసోం సీఎం శరబానంద సోనోవాల్‌కు కానింగ్ లైన్‌లో టైప్ 6బీ బంగళాలను 2016 సెప్టెంబరు రెండున కేటాయించారు. ఢిల్లీలో అసోం భవనం, అందులో సీఎం కార్యాలయం ఉన్నప్పటికీ, ప్రస్తుతం అది మరమ్మతుల దశలో ఉండటంతో తాత్కాలిక కేంద్రం బంగళాను కేటాయించింది.
- జార్ఖండ్ సీఎం రఘుబార్ దాస్‌కు ఏబీ 13, మథురా రోడ్డులో టైప్ 7 బంగళాను 2015 డిసెంబరు 21న కేటా యించారు. జార్ఖండ్ భవన్ నిర్మాణంతో ఉందని, అందుకే బంగళాను కేటాయించినట్లు పట్టణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు.
- ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగగ్ రావత్‌కు ఏబీ 1, పురాణ క్వాలియా రోడ్డులో టైప్ 7 బంగళాను 2017 జూన్ 28న కేటాయించారు. ఉత్తరాఖండ్ భవన నిర్మాణంలో ఉండటంతో బంగళాను కేటాయించగా, తర్వాత కేటాయిం పును కేంద్రం రద్దు చేసింది.
- బీహార్ సీఎం నితీష్‌కుమార్‌కు గతేడాది నవంబరు 27న 6 కే కామరాజ్ లైన్‌లో టైప్ 7 బంగళాను కేటాయించారు. బీహార్ భవన్‌లో నివాస భవనానికి అవకాశం లేదు. దీంతో అదనంగా మరో భవన్‌ను నిర్మించేందుకు స్థలం కేటాయించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరగా, తాత్కాలికంగా బంగళాను కేటాయించారు. అది కూడా నితీష్‌కుమార్ ఎన్‌డీఏ చేరాకే భవనాన్ని కేటాయించటం గమనార్హం. - ఇక త్రిపుర సీఎం కుటుంబ సభ్యులు, భద్రతా కారణాల రీత్యా భవనాన్ని గతేడాది ఏప్రిల్ 24న కేటాయించగా, దానిని కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది.

విశాలాంధ్ర

క్రీడలు

ఈ ఏడాది టీమిండియా బిజీబిజీ



హైదరాబాద్: ఐసీసీ వరల్డ్‌కప్ 2019, టెస్ట్ చాంపియన్‌షిప్, ఐపీఎల్, యాషెస్ 2019, ఐర్లాండ్-ఇంగ్లండ్ నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్... ఇలా 2019లో అభిమానులకు క్రికెట్ కనువిందు చేయనుంది. బాల్ టాంపరింగ్ ఉదంతం కారణంగా ఏడాది పాటు నిషేధాన్ని ఎదుర్కొంటున్న స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు తిరిగి పునరాగమనం చేయనున్నారు. ఇంగ్లండ్ వేదికగా జరగనున్న వరల్డ్ కప్ అనంతరం మాజీ కెప్టెన్ ధోని తన అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలుపై నిర్ణయం తదితర ఎన్నో విషయాలు ఈ ఏడాది అభిమానులను పలకరించున్నాయి. కాగా, కొత్త ఏడాదిలో టీమిండియా తన తొలి మ్యాచ్‌ని జనవరి 3(గురువారం) సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆడనుంది. నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరిస్‌లో ఇదే ఆఖరి టెస్టు మ్యాచ్. ఈ మ్యాచ్ అనంతరం ఆసీస్ గడ్డపై ఆతిథ్య జట్టుతో టీమిండియా మూడు వన్డేల సిరిస్ ఆడనుంది. అనంతరం టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు బయల్దేరనుంది. ఈ పర్యటనలో భాగంగా కోహ్లిసేన మూడు వన్డేలు, మూడు టీ20ల సిరిస్ ఆడనుంది. ఇలా ఈ ఏడాది షెడ్యూల్‌తో కోహ్లిసేన బిజీ బిజీగా గడపనుంది.

ఏ జట్టుపై	స్వదేశం/విదేశం	మ్యాచ్‌లు	తేదీలు
ఆస్ట్రేలియా	విదేశం	4వ టెస్టు	జనవరి 3-7
ఆస్ట్రేలియా	విదేశం	3 వన్డేలు	జనవరం 12, 15, 18
న్యూజిలాండ్	విదేశం	3 వన్డేలు,	
		3 టీ20లు	జనవరి-ఫిబ్రవరి
ఆస్ట్రేలియా	స్వదేశం	5 వన్డేలు	
		3 టీ20లు	ఫిబ్రవరి-మార్చి
జింబాబ్వే	స్వదేశం	1 టెస్టు,	
		3 వన్డేలు	మార్చి
మే 30 నుంచి జూన్ 14వరకు వరల్డ్ కప్			
వెస్టిండిస్	విదేశం	2 టెస్టులు	
		3 వన్డేలు,	
		3 టీ20లు	జూలై-ఆగస్టు
సౌతాఫ్రికా	స్వదేశం	3 టెస్టులు	అక్టోబర్-నవంబర్
బంగ్లాదేశ్	స్వదేశం	2 టెస్టులు	
		3 టీ20లు	నవంబర్-డిసెంబర్
వెస్టిండిస్	స్వదేశం	3 వన్డేలు	
		3 టీ20లు	డిసెంబర్



టీ20 వరల్డ్‌కప్

లంక, బంగ్లాలకు ఝలక్..!

దుబాయ్: టీ20 మాజీ చాంపియన్ శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు షాక్ తగిలింది. ఈ రెండు జట్లు 2020లో జరిగే పురుషుల టీ20 ప్రపంచకప్ సూపర్-12కు నేరుగా అర్హత సాధించలేకపోయాయి. తక్కువ ర్యాంకుల్లో ఉండడంవల్ల నేరుగా అర్హత సాధించలేక పోయాయి. అయితే ఈ రెండు జట్లు సూపర్-12లో అడుగు పెట్టేందుకు గ్రూప్ దశలో పోటీపడాల్సి ఉంటుంది. టీ20 టాప్ ర్యాంకర్లు పాకిస్థాన్, భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్ నేరుగా సూపర్-12కు అర్హత సాధించాయని ఐసీసీ ప్రకటించింది. మూడు సార్లు టీ20 క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్‌కు వెళ్లిన శ్రీలంక నేరుగా అర్హత సాధించలేక పోవడం అభిమానులను ఆశ్చర్యపరి చింది. 2020 అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15 వరకు టీ20 ప్రపంచకప్ నిర్వహిస్తారు. ఐసీసీ టీ20 ర్యాంకుల జాబితాలో అగ్రస్థానంలోని ఎనిమిది జట్లు నేరుగా సూపర్-12కు అర్హత సాధిస్తాయి. గ్రూప్ దశలో అగ్రస్థా నంలో నిలిచిన నాలుగు జట్లు సూపర్-12కు ఎంపికవుతాయి. శ్రీలంక అనర్హత గురించి సారథి లసిత్ మలింగ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గ్రూప్ దశలో విజృంభించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశాడు. టీ20 విశ్వ విజేత వెస్టిండీస్‌పై ఈ మధ్యనే సిరీస్ విజయం సాధించామని షకిబ్ అల్ హసన్ అన్నాడు.

జట్టు ఎంపికపై డైలమా..!

సిడ్నీ : ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరిస్ గెలిచి చరిత్ర సృష్టించేందుకు టీమిండియా అడుగు దూరంలో నిలిచింది. నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరిస్‌లో భాగంగా ఈ సిరిస్‌లో చివరిదైన నాలుగో టెస్టు గురువారం నుంచి సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరగనుంది. ఈ టెస్టు కోసం జట్టు ఎంపికపై టీమిండియా తీవ్రంగా కసరత్తులు చేస్తోంది. కారణం.. ఈ టెస్టులో తుది జట్టు ఎంపిక సరిగా లేకుండా బరిలోకి ఓటమి పాలైతే చరిత్ర సృష్టించే సువర్ణావకాశాన్ని టీమిండియా కోల్పోతుంది కాబట్టి. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో సీనియర్ ఓపెనర్లు మురళీ విజయ్, కేఎల్ రాహుల్‌పై వేటు వేసి వారి స్థానంలో కొత్త ఆటగాళ్లు మయాంక్ అగర్వాల్, హనుమ విహారీలను ఆడించిన సంగతి తెలిసిందే.

మయాంక్ హిట్

అయితే, ఓపెనర్‌గా మయాంక్ అగర్వాల్ హిట్ అవగా.. హనుమ విహారి మాత్రం రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పేలవ ప్రదర్శనతో వికెట్‌ను చేజార్చుకున్నాడు. దీంతో హనుమ విహారిని మళ్లీ మిడిలార్డర్‌లోనే ఆడిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో గురువారం నుంచి సిడ్నీ వేదికగా ప్రారంభంకానున్న నాలుగో టెస్టులో తుది జట్టు ఎంపికపై భారత్ డైలమాలో ఉంది.



రోహిత్ శర్మ దూరం

గాయం కారణంగా రెండో టెస్టుకు దూరమై... మూడో టెస్టులో ఫరవాలేదనిపించిన రోహిత్ శర్మ తన భార్య రితికా ఆదివారం పాపకు జన్మనివ్వడంతో భారత్‌కు తిరుగుపయనమైన సంగతి తెలిసిందే. దీంతో సిడ్నీ టెస్టుకు రోహిత్ శర్మ దూరం కానున్నాడు. అతడి స్థానాన్ని ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో భర్తీ చేయాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

రోహిత్ స్థానంలో విహారి

రోహిత్ శర్మ స్థానంలో(మిడిలార్డర్) తిరిగి హనుమ విహారిని ఆడించాలని కొందరు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతుండగా.. నాలుగో టెస్టులోనూ అతడ్నే ఓపెనర్‌గా ఆడించాలని కూడా మరికొందరు తమ అభిప్రాయలను వెల్లడిస్తున్నారు. దీనికి తోడు మెల్‌బోర్న్ టెస్టుకు ముందు చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ చివరి రెండు టెస్టుల్లో విహారి ఓపెనర్‌గా ఆడతాడని, ఒకవేళ అతను విఫలమైనా తర్వాతి సిరీస్‌లో విహారిని మిడిలార్డర్‌లో ఆడిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

తుది జట్టులో హార్దిక్

ఈ నేపథ్యంలో నాలుగో టెస్టుకు ఎంపిక చేసే తుది జట్టులో హార్దిక్ పాండ్యాకు చోటు కల్పించడం తప్ప మిగతా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఈ సిరిస్‌లో చివరిదైన నాలుగు టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా జరగనుంది. ఈ సిరిస్ అనంతరం ఇరుజట్ల మధ్య జనవరి 12 నుంచి మూడు వన్డేల సిరిస్ ప్రారంభం కానుంది.



శరీరాన్ని కాపాడుకోవడం ముఖ్యం

బ్రిస్బేన్ : నెంబర్ వన్ ర్యాంకు వెనుక పరిగెత్తడం నా లక్ష్యం కాదు, శరీరాన్ని కాపాడుకోవడమే నాకు ముఖ్యమని స్పెయిన్ స్టార్ టెన్నిస్ ఆటగాడు రఫెల్ నాదల్ అన్నాడు. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో గాయం కారణంగా వైదొలగిన నాదల్, నవంబర్‌లో కాలిమడమకు శస్త్ర చికిత్స చేయించుక్ను అనంతరం మూడు వారాల క్రితమే ప్రాక్టీస్ ఆరంభించాడు. ప్రస్తుతం బ్రిస్‌బేన్ టోర్నీలో ఆడుతూ రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు. నాదల్ మీడియాతో మాట్లాడుతూ 'రెండేళ్ల నుంచీ ప్రపంచ ర్యాంకింగ్స్‌కు నేను అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అవి నా లక్ష్యం కాదు. సంతోషంగా ఉండడానికి ఏది చేయాలనుకున్నానో అది చేస్తున్నాను. నేను ఆడాతున్నంత కాలం పోటీ ఇవ్వాలనుకుంటున్నాను. కానీ అందరి కంటే మెరుగ్గా ఉండాలని మాత్రం కోరుకుంటాను. మళ్లీ గత ఏడాదిలా గాయాలపాలై బాధపడాలనుకోవడం లేదు. అలా రెండేళ్లు సాగితే అది మిమల్ని మానసికంగా చంపేస్తుంది' అని అన్నాడు.

02-01-2019

విభజన చట్టంలోని ప్రతి హామీ నెరవేర్చాలి, తెలుగువారి ఆత్మగౌరవం నిలబెట్టాలి.

5 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు కోసమే 11 ధర్మపోరాట దీక్షలు చేశాం!

విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక హోదాతో పాటు పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు మన ధర్మ పోరాటం ఆగదు..., మన పట్టుదలతో, స్వయంకృషితో అటు అభివృద్ధి, ఇటు పేదల సంక్షేమం చేస్తూ ఐదేళ్లలో అద్భుత ప్రగతి సాధించాం. రాజకీయ కుట్రలకు, కుతంత్రాలకు రాష్ట్రం బలి కాకూడదని ఎలాంటి సవాలునైనా పరిష్కరిస్తూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తున్నాం.

మనం సొంతంగా పరిష్కరించుకున్న విభజన సమస్యలు:

- విద్యుత్ కొరత ఉన్న రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా చేశాం. గృహాలకు, పరిశ్రమలకు 24 గంటలు, వ్యవసాయానికి 7 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.
- రాష్ట్రానికి ఎంతో భారమైనా కుడా రైతుల కష్టాలను గట్టెక్కించాలని రూ. 24,500 కోట్ల రైతు రుణ మాఫీ చేశాం.
- ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనులు ఆగకుండా శరవేగంగా పూర్తి చేసుకుంటున్నాం.
- కేంద్రం అటకెక్కించిన కడప ఉక్కు కర్మాగారాన్ని మనమే సొంతంగా నిర్మించుకుంటున్నాం.
- ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆంధ్రప్రదేశ్ ప్రజలు గర్వించేలా ప్రపంచ స్థాయి రాజధాని అమరావతిని నిర్మించుకుంటున్నాం.
- నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి గత ఐదేళ్లలో కియా మోటార్స్, హీరో, అపోలో టైర్స్, ఇసుజు, అశోక్ లేలాండ్ వంటి దేశ విదేశీ కంపెనీల స్థాపనకు కృషి చేసి లక్షల ఉద్యోగాలను సృష్టించుకున్నాం.
- గత ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, రాష్ట్రం మొత్తం 24,000 కి.మీ సీసీ రోడ్లు నిర్మించుకున్నాం.
- విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాలతో పాటు రాష్ట్రంలో 20 మహానగరాలను సుందర నగరాలుగా తీర్చుదిద్దుతున్నాం.
- రియల్ టైం గవర్నెన్స్ ద్వారా అభివృద్ధి, సంక్షేమ పనులపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే పర్యవేక్షణ.
- ఏపి ఫైబర్ నెట్ ద్వారా ప్రతి ఇంటికి హై స్పీడ్ ఇంటర్నెట్.
- మహిళా సంఘాలకు రూ. 10,000 కోట్లు ఆర్థిక సహాయం.

కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా రూ. 90,283.26 కోట్లు రావాల్సి ఉంది. రెవిన్యూ లోటు భర్తీ, పోలవరం, రాజధాని, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సహాయం, విద్యా సంస్థల ఏర్పాటుకు సాయం తదితర అంశాలన్నీ కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. విభజన చట్టంలోని మొత్తం 18 అంశాలకుగాను ఒక్కదానిని కూడా పూర్తిగా కేంద్రం అమలు చేయలేదు.


రాష్ట్రాభివృద్ధికి సంబంధించి కేంద్రం నిర్లక్ష్యం వహించిన అంశాలు:

- రాజధాని నిర్మాణ అంచనా వ్యయం రూ. 1,09,023 కోట్లకు గాను కేంద్రం ఇచ్చినది రూ.1500 కోట్లు.
- వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ కింద 2017-18, 2018-19 సంవత్సరాలకు గాను రూ. 700 కోట్లు విడుదల చేయలేదు. ఇచ్చిన రూ. 350 కోట్లు వెనక్కి తీసుకుంది.
- 11 విద్యాసంస్థల ఏర్పాటుకు రూ. 12,746.38 కోట్లు అవసరంకాగా కేంద్రం కేవలం రూ. 845.42 కోట్లు మాత్రమే ఇచ్చింది.
- తొలి ఏడాది రెవిన్యూ లోటు కింద రూ. 16,078.76 కోట్లకు గాను కేవలం రూ. 3979.5 కోట్లు మాత్రమే ఇచ్చింది.
- కడప స్టీల్, విశాఖ రైల్వే జోన్ హామీలను విస్మరించారు.
- కాకినాడ పెట్రో కాంప్లెక్స్, రామాయపట్నం ఓడరేవు అటకెక్కించారు.
- ప్రత్యేక హోదా ఇవ్వలేదు.

6వ విడత జన్మభూమి మా ఊరు జనవరి 2-11 2019

ప్రజలే ముందు PEOPLE FIRST 1100

ఇక్కడ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి









ఈ ధర్మపోరాటంలో అంతిమ విజయం మనదే - ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం నిలబెడదాం - ఐదుకోట్ల ప్రజల హక్కులను కాపాడుదాం.

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.